RNI NO:TELTEL/ 2023/89546




# సూర్య రేఖ

తెలుగు దినపత్రిక



## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపుణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం

సంప్రదించవలసిన నెం : 9397303326


రంగారెడ్డి | సంపుటి : 3 | సంచిక : 161 | పేజీలు : 12 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | శనివారం 18 అక్టోబర్ 2025 | వెల : 4/-

# హస్తంలో రచ్చ

## రేవంత్ సర్కార్‌ను ముంచుతున్న ఇగోలు



**కొత్తగా అమాత్య పదవిలో కొనసాగుతున్న వాళ్లు ఇంకొందరు. కానీ సీనియర్ల మధ్య ఇగో పంచాయితీ. తెలంగాణ క్యాబినెట్ మినిస్టర్ల లొల్లి. ఒక మంత్రి అయిపోగానే మరో మంత్రి రచ్చకెక్కి ఇష్యూ చేస్తుండటంతో.. ప్రభుత్వం, పార్టీకి డ్యామేజ్ జరుగుతుందని సీఎం రేవంత్ సీరియస్ అవుతున్నారట. ఇలా అయితే కుదరదు. ఇక నుంచి యాక్షనే అంటున్నారట. మంత్రులను గాడిన పెట్టేందుకు సీఎం రేవంత్ ఏం చేయబోతున్నారు? తెలంగాణలో మంత్రుల మధ్య కొట్లాటలు.. ప్రభుత్వానికి, కాంగ్రెస్ పార్టీకి పరువు సమస్యగా మారాయి**

హైదరాబాద్

అందరూ సీనియర్ లీడర్లే. గతంలో మంత్రులుగా పని చేసిన వాళ్లు కొందరు.. కొత్తగా అమాత్య పదవిలో కొనసాగుతున్న వాళ్లు ఇంకొందరు. కానీ సీనియర్ల మధ్య ఇగో పంచాయితీ. జూనియర్లు అంటే చిన్న చూపు అన్నట్లుగా ఉందట.. తెలంగాణ క్యాబినెట్ మినిస్టర్ల లొల్లి. ఒక మంత్రి అయిపోగానే మరో మంత్రి రచ్చకెక్కి ఇష్యూ చేస్తుండటంతో..ప్రభుత్వం, పార్టీకి డ్యామేజ్ జరుగుతుందని సీఎం రేవంత్ సీరియస్ అవుతున్నారట. ఇలా అయితే కుదరదు. ఇక నుంచి యాక్షనే అంటున్నారట. మంత్రులను గాడిన పెట్టేందుకు సీఎం రేవంత్ ఏం చేయబోతున్నారు? అమాత్యులపై చర్యలు అంటే ఎలా ఉండబోతున్నాయి? తెలంగాణలో మంత్రుల మధ్య కొట్లాటలు.. ప్రభుత్వానికి, కాంగ్రెస్ పార్టీకి పరువు సమస్యగా - మిగతా3లో



## ఏం సాధించారని విజయోత్సవాలు!

- కాంగ్రెస్ సర్కార్‌కు హరీశ్‌రావు సూటి ప్రశ్న
- ఈ 23 నెలల పాలనలో ఏం సాధించారు అని విజయోత్సవాలు జరుపుతారు
- కమిషన్ల కోసం క్యాబినెట్‌లో గల్లాలు పట్టుకొని కొట్టుకున్నందుకా?
- మంత్రుల మధ్య తగాదాలు జరుగుతున్నందుకా?
- ఆరు గ్యారెంటీలు, 420 హామీలను రేవంత్ సర్కార్ తుంగలో తొక్కింది.

# బంద్‌కు ప్రధాన కారణం బీజేపీనే



- డిప్యూటీ సీఎం భట్టి
- తొలిసారిగా సైంటిఫిక్‌గా తెలంగాణలో కులగణన నిర్వహించాం
- సర్వే ద్వారా వచ్చిన సమాచారంతో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని చూసినం
- ఢిల్లీ జంతర్ మంతర్ దగ్గర కాంగ్రెస్ పార్టీ బీసీ రిజర్వేషన్లపై ధర్నా చేశాం
- బీజేపీ పార్టీ తప్ప అన్ని రాజకీయ పార్టీల నాయకులు సంఘీభావం తెలిపారు

ఖమ్మం

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల ప్రకారం స్థానిక సంస్థల్లో 42% రిజర్వేషన్లు దేశంలో ఎక్కడా లేని విధంగా చేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. తొలిసారిగా సైంటిఫిక్‌గా తెలంగాణలో కులగణన నిర్వహించామని.. సర్వే ద్వారా వచ్చిన సమాచారంతో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని చూసినట్లు తెలిపారు. చట్ట సభల్లో ఏకగ్రీవాగంగా ప్రవేశ పెట్టామని.. గవర్నర్, రాష్ట్రపతికి పంపించినట్లు తెలిపారు. అయితే తాము పాస్ చేసిన బిల్లును కేంద్ర ప్రభుత్వం ఆమోదించకుండా అడ్డుకట్ట వేసి రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లకు అడ్డుపడుతోందని ఆరోపించారు. ఇది బీజేపీ ప్రభుత్వం నిరంకుశ పాలనకు నిదర్శనమని మండిపడ్డారు భట్టి. ఢిల్లీ జంతర్ మంతర్ దగ్గర కాంగ్రెస్ పార్టీ బీసీ రిజర్వేషన్లపై ధర్నా చేశామని.. బీజేపీ పార్టీ తప్ప అన్ని రాజకీయ పార్టీల నాయకులు సంఘీభావం తెలిపారని అన్నారు. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం బిల్లు - మిగతా3లో



## డిజిటల్ అరెస్టు పేరుతో మోసాలు.. సుప్రీం ఆందోళన

- దేశంలో ఈ డిజిటల్ అరెస్టు మోసాలు పెద్ద ముప్పుగా మారాయి
- సుమోటోగా తీసుకున్న ఓ కేసు విచారణ సందర్భంగా కేంద్రం, సీబీఐలకు వారి స్పందన తెలపాలి



## గాంధీనే విడిచి పెట్టలేదు, నేనెంత

- ఆర్ఎస్ఎస్‌పై నిప్పులు చెరిగిన ప్రియాంక్ ఖర్గే
- జన సమీకరణల పేరుతో సమాజాన్ని విషపూరితం చేస్తున్నారు
- మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వంటి ప్రముఖులకు ఎదురైన చారిత్రక చేదు అనుభవాలే



## పాక్-అఫ్ఘాన్ ఘర్షణలు.. ట్రెండింగ్‌లో ‘93000’

- భారత్‌కు సంబంధం ఏంటి?
- “అప్పుడు భారత్ ఎదుట.. ఇప్పుడు అఫ్ఘాన్ ముందు
- ‘టీమ్ 93000’ విషయంలో అప్పుడూ ఇప్పుడూ ఏమీ మారలేదు
- భారత్ సైన్యం పాక్‌ను ఓడించడంతో బంగ్లాదేశ్ ఏర్పాటుకు దారితీసింది




# ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారు?

- ఈ నెల 9 న స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ సస్పెండ్ చేస్తూ స్టేట్ ఎలక్షన్ కమిషన్ ఉత్తర్వులు జారీ
- నోటిఫికేషన్‌ను సస్పెండ్ చేయడానికి సవాలు చేస్తూ సురేందర్ అనే న్యాయవాది పిటిషన్ దాఖలు
- బీసీ రిజర్వేషన్‌లను 42 శాతానికి పెంచుతూ ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చాం కాబట్టే దాన్ని సస్పెండ్ చేశాం

హైదరాబాద్

తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికలపై హైకోర్టు విచారణ జరిపింది. ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారో ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ చర్చించి చెప్పాలని హైకోర్టు పేర్కొంది. స్థానిక సంస్థల ఎన్నికలపై తెలంగాణ హైకోర్టులో మరో పిటిషన్ దాఖలు కాగా.. స్థానిక సంస్థల ఎన్నికలకు రీ నోటిఫికేషన్ - మిగతా3లో

# గాంధీనే విడిచి పెట్టలేదు, నేనెంత...



**బెంగళూరు:** బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లపై కర్ణాటక మంత్రి ప్రియాంక్ ఖర్గే శుక్రవారంనాడు తీవ్ర స్థాయిలో విరుచుకు పడ్డారు. జన సమీకరణల పేరుతో సమాజాన్ని విషపూరితం చేస్తున్నారని, మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వంటి ప్రముఖులకు ఎదురైన చారిత్రక చేదు అనుభవాలే ఇందుకు నిదర్శనమని అన్నారు. ప్రభుత్వ ప్రాంగణాల్లో ఇక నుంచి ఎలాంటి సమావేశాలను నిర్వహించ రాదని కర్ణాటక మంత్రివర్గం నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. ముఖ్యమంత్రికి నేను లేఖ రాశాను. దానిని పరిగణనలోకి తీసుకుని ఇక నుంచి ప్రభుత్వ సంస్థలు, బహిరంగ ప్రదేశాల్లో సమావేశాలకు సంబంధించిన కొత్త రూల్స్ అమల్లోకి తెస్తూ క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. ఇక నుంచి ఎలాంటి సమీకరణలకైనా, సమావేశాలకైనా ముందస్తుగా ప్రభుత్వ అనుమతి తీసుకోవాలి. ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తే లీగల్ చర్యలు తీసుకుంటాం' అని ప్రియాంక్ ఖర్గే మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. 'ఆర్ఎస్ఎస్, బీజేపీల స్థాయీ ఆపరేషన్ ప్రొసీజర్ (ఎస్ఓపీ) ఆలోచన.. అంతిమంగా మహాత్మాగాంధీ మరణానికి, బాబా సాహెబ్ అంబేడ్కర్ ఓటమికి దారితీసింది. ఇది సమాజాన్ని అత్యంత విషపూరితం చేసే ఆలోచన. మహాత్మాగాంధీ వంటి గొప్ప వ్యక్తులనే వాళ్లు లెక్కచేయనప్పుడు నేను ఎంత?' అని ఆయన ప్రశ్నించారు. ప్రధాన అంశాల నుంచి దారి మళ్లించేందుకు బీజేపీ వ్యక్తిగత దాడులకు పాల్పడుతోందని ప్రియాంక్ ఆరోపించారు. తనను వ్యక్తిగతంగా నిందించడానికి బదులు ఆర్ఎస్ఎస్ తరఫున ఎందుకు మాట్లాతున్నారో బీజేపీ సమాధానం చెప్పాలన్నారు. 'ఆర్ఎస్ఎస్ తరఫున మాట్లాడేందుకు వాళ్లు ఎవ్వరు. ఆర్ఎస్ఎస్ తనకు తాను డిఫెండ్ చేసుకోలేదా?' అని ఆయన నిలదీశారు.

**ప్రభుత్వ అధికారుల ధిక్కారం..**

కాగా, ఆర్ఎస్ఎస్ ఈవెంట్లలో కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రభుత్వ అధికారులు మాట్లాడుతున్నారంటూ ఖర్గే ఆరోపించారు. ప్రభుత్వ అధికారులు తటస్థంగా ఉండటాన్ని తప్పనిసరి చేస్తూ కర్ణాటక స్టేట్ సివిల్ సర్వీస్ (కాండక్ట్) రూల్స్-2021ను అమలు చేయాలని సీఎంను ఆయన కోరారు. ఇది తాను పెట్టిన రూల్ కాదని, కర్ణాటక సివిల్ సర్వీస్ రూల్ అని, ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయ సంస్థలతో సంబంధం ఉన్న ఎలాంటి కార్యక్రమాల్లోనూ పాల్గొనరాదని ఆ నిబంధన చెబుతోందని అన్నారు. అయినప్పటికీ పీడీఓలు, విలేజ్ అకౌంటెంట్లు, ఇతర అధికారులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆర్ఎస్ఎస్ ఈవెంట్లలో ప్రసంగిస్తున్నారని చెప్పారు.

**షోకాజ్ నోటీసులు**

కాగా, ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్న అధికారులకు ప్రభుత్వం షోకాజ్ నోటీసులు ఇచ్చింది. వారిని సస్పెండ్ చేసే అవకాశాలు ఉన్నాయి. ఖర్గే ఈ విషయాన్ని ధ్రువీకరించారు. తన డిపార్ట్‌మెంట్ ఉద్యోగులకు నోటీసులు ఇచ్చామని చెప్పారు. సిద్ధాంతాలు ఉంటే ఉండవచ్చని, కానీ ప్రభుత్వ ఉద్యోగులు రాష్ట్ర నిబంధనలను పాటించాల్సిందేనని పేర్కొన్నారు.

# పాక్-అఫ్ఘాన్ ఘర్షణలు.. ట్రెండింగ్‌లో '93000'



పాకిస్థాన్-అఫ్ఘానిస్థాన్ మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సంగతి తెలిసిందే ప్రస్తుతం రెండు దేశాల మధ్య కాల్పుల విరమణకు అంగీకారం కుదిరినా.. అది ఎంతవరకు కొనసాగుతుందో తెలియని అనిశ్చితి నెలకొంది. ఈ సమయంలో నెట్టింట్లో '93000' ట్రెండ్ అవుతోంది

%ఈ ఘర్షణల్లో భాగంగా పాక్ నుంచి స్వాధీనం చేసుకున్న ట్యాంక్‌లతో పాటు సరిహద్దు స్థావరాల నుంచి పారిపోయిన పాక్ సైనికుల దుస్తులను అఫ్ఘాన్ ప్రదర్శించినట్టుగా కొన్ని దృశ్యాలు వైరల్ అయ్యాయి. క్షేత్రస్థాయిలో ఎవరు గెలిచినా.. ఆన్‌లైన్‌లో ప్రచారంతో మాత్రం అఫ్ఘాన్ నెగ్గింది. కొందరు ఆ దేశ యాక్టివిస్ట్‌లు '93,000 %జ్ఝుత్రం ఎవతీవఎశీఅఎ% 2.0' అని పోస్టులు పెట్టారు. ఆ నంబర్‌కు భారత్‌తో సంబంధం ఉంది. 1971, డిసెంబర్‌లో భారత లెఫ్టినెంట్ జనరల్ జగ్జీత్ సింగ్ అరోడా, ఇతర సైన్యాధికారుల సమక్షంలో పాక్ లెఫ్టినెంట్ జనరల్ ఆమిర్ అబ్దుల్లా నియాజీ లొంగుబాటు పత్రంపై సంతకం చేశారు. ప్రస్తుతం ఆ చిత్రాన్ని నెటిజన్లు షేర్ చేస్తున్నారు. అప్పుడు 93000 మంది పాక్ సైనికులు భారత్ ముందు లొంగిపోయారు. "అప్పుడు భారత్ ఎదుట.. ఇప్పుడు అఫ్ఘాన్ ముందు. 'టీమ్ 93000' విషయంలో అప్పుడూ ఇప్పుడూ ఏమీ మారలేదు. భవిష్యత్తులో భారత్ రికార్డును అఫ్ఘాన్ బ్రేక్ చేస్తుందేమో" అని నెటిజన్లు పోస్టులు పెట్టారు.

**ఫీల్డ్ మార్షల్ మానెక్ షా వ్యూహం దెబ్బకు కంగుతిని..**

1971లో తూర్పు పాకిస్థాన్‌లో మొదలైన స్వాతంత్ర్య పోరు భారత్-పాక్ మధ్య యుద్ధానికి దారి తీసింది. భారత్ సైన్యం పాక్‌ను ఓడించడంతో బంగ్లాదేశ్ ఏర్పాటుకు దారితీసింది. ఆ విజయానికి గుర్తుగా మనం ఏటా డిసెంబర్ 16న విజయ్ దివస్‌ను నిర్వహిస్తున్నాం. అప్పటి మన ఆర్మీ చీఫ్, ఫీల్డ్ మార్షల్ మానెక్ షా పటిష్ఠ వ్యూహ రచన జరిపి, విజయాన్ని భారత్ పరం చేశారు. 93,000 మందితో కూడిన పాకిస్థాన్ దళం భారత సైన్యం ముందు లొంగిపోయింది. ఈ సంఘటన రెండో ప్రపంచ యుద్ధం తర్వాత అతి పెద్ద లొంగుబాటుగా చరిత్రలో నిలిచి, మన సైన్య పరాక్రమాన్ని ప్రపంచానికి చాటింది.

**పాక్-అఫ్ఘాన్ ఘర్షణలు..**

అఫ్ఘాన్ భూభాగాన్ని ఉపయోగించుకుంటున్న తెహ్రీక్-ఇ-తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) ఉగ్రవాదులు.. పాక్ ఖైబర్ పఖ్తుంఖ్వాలోని ఓరక్‌జాయ్ జిల్లాలో ఇటీవల దాడులు చేయగా పలువురు సైనికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో గత గురువారం అఫ్ఘాన్ రాజధాని కాబుల్‌లో పేలుళ్లు చోటుచేసుకున్నాయి (%ఝుశ్రీఅఝఅ ఓశీఅటశ్రీఅఓ%). ఈ పేలుళ్లకు పాకిస్థాన్ కారణమని తాలిబన్ ప్రభుత్వం ఆరోపించింది. అప్పుడు అఫ్ఘాన్ విదేశాంగమంత్రి భారత్ పర్యటనలో ఉండటం గమనార్హం. ఉగ్రవాదుల ఏరివేత పేరుతో తమ సరిహద్దుల్లో దాడులు చేసిన దాయాదిపై అఫ్ఘాన్ కూడా అదే స్థాయిలో విరుచుకుపడిన సంగతి తెలిసిందే. ఆ దాడుల్లో 58 మంది పాక్ సైనికులు మరణించినట్లు తాలిబన్ నేతృత్వంలోని ప్రభుత్వం వెల్లడించింది. తర్వాత కూడా ఆ ఘర్షణలు కొనసాగాయి. భారత ఆదేశాల మేరకే తమపై దాడులు జరిగాయని పాక్ ఆరోపించింది. ప్రస్తుతానికి ఇరుదేశాల మధ్య కాల్పుల విరమణ కొనసాగుతోంది

# అమెరికా మిలిటరీ టెక్నాలజీకే ఎసరు



**న్యూఢిల్లీ :** అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టాక.. ఆయన తీసుకుంటున్న నిర్ణయాలతో ప్రపంచ దేశాలన్నీ అమెరికాకే వ్యతిరేకంగా మారుతున్నాయి. మరోవైపు అన్నీ తమకే కావాలన్న స్వార్థంతో ట్రంప్ ప్రపంచ దేశాలపై సుంకాల మోత మోగిస్తున్నారు. ప్రపంచంలో అరుదుగా లభించే ఎర్త్ మినరల్స్‌లో ఆధిపత్యం చెలాయిస్తున్న చైనాకు చెక్ పెట్టేందుకు వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. చైనాపై భారీగా సుంకాలు విధిస్తున్నారు. దీంతో చైనా కూడా ఎక్కడా తగ్గడం లేదు. అగ్రరాజ్యానికే సవాల్ విసురుతోంది. తాజాగా తీసుకున్న నిర్ణయంతో అమెరికా మిలిటరీ టెక్నాలజీకే ఎసరు వచ్చేలా ఉంది. చెనా తాజాగా రేర్ ఎర్త్ ఎగుమతులపై నియంత్రణలు కఠినం చేసింది. ఈ లోహాలే ఆధునిక మిలిటరీ, సెమీకండక్టర్, గ్రీన్ ఎనర్జీ టెక్నాలజీలకు ప్రాణాధారం. అమెరికా, యూరప్, జపాన్ వంటి దేశాలు ఇప్పటి వరకు ఇవి ఎక్కువగా చైనాపై ఆధారపడ్డాయి. ఇప్పుడు బీజింగ్ పట్టుబిగించడంతో ఆ ఆధార వ్యవస్థ కదిలిపోయింది. రేర్ ఎర్త్ మెటల్స్‌లో నియోడియమియం, ప్రాసియోడియమియం, డిస్ప్రోస్యియం వంటి లోహాలు ప్రధానమైనవి. వీటితో జెట్ ఇంజిన్లు, క్షిపణి నియంత్రణ వ్యవస్థలు, రాడార్ సెన్సర్లు, మొబైల్ ఫోన్లు నిర్మించబడతాయి. ప్రపంచంలోని సుమారు 70% సరఫరా చైనాకు చెందిన గనుల నుంచే వస్తుంది. ఒక గనిలో ఉత్పత్తిని తగ్గించినా ప్రపంచ మార్కెట్లో ధరలు క్షణాల్లో పెరుగుతాయి. టెక్నాలజీ ఆధిపత్యం కోసం ప్రతిదశలో చైనాకు సవాలు విసిరిన అమెరికా ఇప్పుడు రేర్ ఎర్త్ సరఫరాలో బంధింపబడిన స్థితిలో ఉంది. మిలిటరీ సాధనాలు, జాతీయ రక్షణ పరిశ్రమల ఉత్పత్తి ఆలస్యమవుతోంది. టెక్ కంపెనీలు ప్రత్యామ్నాయ మూలాలు కనుగొనడానికి ప్రయత్నిస్తున్నాయి. కాని తక్షణ పరిష్కారం లేదు. దీంతో వాషింగ్టన్ మళ్లీ భారత్ వంటి మిత్రదేశాల సహకారం కోసం చూస్తోంది. అమెరికా గతంలో వాణిజ్య టారిఫ్‌లతో భారత ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి తెచ్చింది. ఇప్పుడు ఆర్థిక పరిస్థితులు మారడంతో భారత్ సహకారం తప్పనిసరైంది. భారత్‌లోని ఆంధ్రప్రదేశ్, ఒడిశా, రాజస్థాన్‌లలో రేర్ ఎర్త్ ఖనిజ వనరులను అభివృద్ధి చేసే దిశగా ముందుకువెళ్తోంది. ఇది భారత్‌కు ద్విగుణ ప్రయోజనం. ఒకటి వ్యూహాత్మక చర్చల్లో ప్రాధాన్యం పెరగడం. రెండోది అంతర్జాతీయ పెట్టుబడులు ఆకర్షించగలగడం. చైనా "టెక్నాలజీ ఆయుధం"గా రేర్ ఎర్త్‌ను ఉపయోగించడం ప్రారంభించింది. దీంతో అమెరికా, యూరప్ తమ పరిశ్రమల్లో కొరతను ఎదుర్కొంటున్నాయి. గ్రీన్ ఎనర్జీ (ఇవి వాడే బ్యాటరీలు, టర్బైన్‌లు) ప్రాజెక్టులు మందగిస్తున్నాయి. టెక్ మార్కెట్లలో అనిశ్చితి పెరిగింది. ఈ పరిణామాలు చైనా "సైలెంట్ వెపన్" ప్రభావాన్ని మరోసారి నిరూపిస్తున్నాయి. రేర్ ఎర్త్ యుద్ధం కేవలం మినరల్ సప్లై పోరు కాదు.. ఇది భవిష్యత్తు టెక్నాలజీ ఆధిపత్యంపై పోరాటం. చైనా ఒకే నిర్ణయంతో ప్రపంచ సరఫరా గొలుసును కుదిపేసింది. భారత్ వంటి దేశాలు ఇప్పుడు వ్యూహాత్మకంగా కొత్త అవకాశాల సరిహద్దులో నిలిచాయి.

## లంచం తీసుకుంటూ దొరికిన డీఐజీ..
## రహస్య స్థావరంలో బయటపడ్డ ఆస్తుల గుట్టు!

**ఛండీఘడ్ :** రూ. 8 లక్షల లంచం తీసుకుంటుండగా ఓ డిఐజితో పాటు ఒక ప్రైవేట్ వ్యక్తిని సిబిఐ అరెస్టు చేసింది. అరెస్టయిన ఐపీఎస్ అధికారి 2009 బ్యాచ్ కు చెందిన వ్యక్తి. ప్రస్తుతం పంజాబ్ పోలీస్ రోపర్ రేంజ్‌గా విధులు నిర్వహిస్తున్నారు. డిఐజి ఇల్లు, ఇతర ప్రాంగణాలలో జరిగిన దాడులలో సిబిఐ అనేక విలాసవంతమైన వస్తువులను స్వాధీనం చేసుకుంది. సీబీఐ తెలిపిన ప్రకారం, తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను పరిష్కరించేందుకు బదులుగా ఒక వ్యాపారవేత్త నుండి పంజాబ్ పోలీస్ రోపర్ రేంజ్ డిఐజి హర్చరణ్ సింగ్ భుల్లార్ రూ. 8 లక్షల లంచం డిమాండ్ చేశారు. తదుపరి పోలీసు చర్యలు తీసుకోకుండా ఉన్నాడని, చట్టవిరుద్ధమైన నెలవారీ చెల్లింపులు కూడా చేయాలని డిఐజి డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. బాధితుడి నుంచి ఫిర్యాదు అందిన తర్వాత అక్టోబర్ 16న సీబీఐ కేసు నమోదు చేసింది. చండీగఢ్‌లోని సెక్టార్ 21లో ఒక ఉచ్చును పన్నారు. నిందితుడి మధ్యవర్తి ద్వారా రూ. 8 లక్షలు తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. ఈ ఉచ్చులో, ఫిర్యాదుదారుడు డీఐజీకి కాల్ చేశాడని, ఆ అధికారి డబ్బు అందుకున్నట్లు అంగీకరించారని, మధ్యవర్తి, ఫిర్యాదుదారుడిని తన కార్యాలయానికి పిలిపించారని సీబీఐ పేర్కొంది. ఆ తర్వాత సీబీఐ బృందం డీఐజీని ఆయన కార్యాలయం నుంచి అరెస్టు చేసింది. ఈ దాడిలో, సిబిఐ డిఐజి ఇళ్ళు, ఇతర ప్రాంగణాల నుండి భారీ మొత్తంలో నగదు, విలువైన వస్తువులను స్వాధీనం చేసుకుంది.

## డిజిటల్ అరెస్టు పేరుతో మోసాలు..
## సుప్రీం ఆందోళన



డిజిటల్ అరెస్టులు ఇటీవల సైబర్ నేరగాళ్లు ఎంచుకొన్న కొత్త పంథా ఇదే. దీని పేరు చెప్పి అవతలి వ్యక్తులను భయాందోళనకు గురిచేస్తూ.. పెద్ద మొత్తంలో సొమ్ములు కాజేస్తున్నారు. దేశంలో ఈ డిజిటల్ అరెస్టు మోసాలు పెద్ద ముప్పుగా మారాయి. తాజాగా ఈ మోసాలపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. సుమోటోగా తీసుకున్న ఓ కేసు విచారణ సందర్భంగా కేంద్రం, సీబీఐలకు వారి స్పందన తెలపాలని న్యాయస్థానం ఆదేశించింది. అసలేం జరిగిందంటే.. హరియాణాలోని అంబాలాకు చెందిన 73 ఏళ్ల ఓ మహిళ భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌కి ఫిర్యాదు పత్రం రాశారు. అందులో.. తనను డిజిటల్ అరెస్టు చేయమని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసినట్లు ఉన్న ఒక పత్రాన్ని నేరగాళ్లు తనకు చూపించారన్నారు. రూ.కోటి ఇస్తే ఈ అరెస్టు నుంచి బయటపడొచ్చని వారు బెదిరింపులకు పాల్పడ్డారని ఆమె తెలిపారు. కోర్టు ఆదేశాలు ఇచ్చినట్లుగా నకిలీ పత్రాలు చూపించి నేరగాళ్లు సొమ్ములు కాజేయడాన్ని సీజేఐతో సహా సీనియర్ న్యాయమూర్తులు తీవ్రంగా పరిగణించారు. అంబాలా కేసును న్యాయస్థానం సుమోటోగా తీసుకోగా.. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం శుక్రవారం దీనిపై విచారణ జరిపింది. ఈ సందర్భంగా న్యాయమూర్తులకు సంబంధించి నకిలీ సంతకాలు, సుప్రీం, హైకోర్టులు ఆదేశాలు జారీ చేసినట్లు పత్రాలు చూపించి ఇలాంటి నేరాలకు పాల్పడటం వల్ల న్యాయవ్యవస్థపై ప్రజలకు ఉన్న విశ్వాసం దెబ్బతింటుందని ధర్మాసనం పేర్కొంది. వీటిని సాధారణమైన మోసాలుగా పరిగణించలేమని వ్యాఖ్యానించింది. ఇలాంటి నేరాలను బయటపెట్టేందుకు కేంద్ర, రాష్ట్ర పోలీసుల మధ్య సమన్వయం అవసరమని అభిప్రాయపడింది. ఇక, అంబాలా కేసుకు ఇప్పటివరకు జరిగిన దర్యాప్తుపై స్టేటస్ రిపోర్టు దాఖలు చేయాలని అటార్నీ జనరల్‌ను, స్థానిక సైబర్ క్రైమ్ విభాగానికి సూచించింది. మరోవైపు ఇదే కేసుకు సంబంధించి స్పందన తెలియజేయాలని కేంద్రం, సీబీఐలను సుప్రీంకోర్టు ఆదేశించింది.

## టీవీకే గుర్తింపు పొందిన పార్టీ కాదు - ఈసీ



తమిళ నటుడు విజయ్‌కు చెందిన తమిళగ వెట్రి కళగం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ కాదని కేంద్ర ఎన్నికల సంఘం పేర్కొంది. విజయ్ పార్టీని రద్దు చేయాలని దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యం విచారణ సందర్భంగా హైకోర్టు ధర్మాసనానికి ఈసీ ఈ విషయాన్ని తెలిపింది. కరూర్‌లో విజయ్ ప్రచార సభలో చోటుచేసుకున్న తొక్కిసలాటలో 41 మంది ప్రాణాలు కోల్పోవడం యావత్ దేశాన్ని తీవ్రంగా కలచివేసింది. ఈ నేపథ్యంలో విజయ్ పార్టీ గుర్తింపు రద్దు చేయడంతోపాటు రాజకీయ పార్టీల ప్రచార సభల్లో మహిళలు, చిన్నారులు పాల్గొనకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ మద్రాస్ హైకోర్టులో పలు ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలయ్యాయి. వీటిని సీజే జస్టిస్ ఎంఎం శ్రీవాస్తవ, జస్టిస్ జీ అరుల్ మరుగణ్‌ల ధర్మాసనం విచారించింది. ఈ ఘటనకు సంబంధించి సుప్రీం కోర్టులో పెండింగులో ఉన్న పిటిషన్లు మినహా ఈ కేసుల విచారణకు ఓ ధర్మాసనాన్ని ఏర్పాటు చేసేందుకు వీలుగా వాటన్నింటిని హైకోర్టు పాలనావ్యవహారాల విభాగం ముందు ఉంచాలని రిజిస్ట్రీని ఆదేశించింది. ఇక టీవీకే గుర్తింపు రద్దు విషయానికొస్తే.. ఇప్పటికీ ఆ పార్టీకి ఆ హోదా లేనందున ఆ అభ్యర్థన నిలబడదని ఈసీ తరఫు న్యాయవాది నిరంజన్ రాజగోపాల్ పేర్కొన్నారు.

## 'రాబోయే కాలమంతా భారత్‌ది..
## ఆ దేశ ప్రధానిది.. అటు తర్వాతే ఎవరైనా'



**న్యూఢిల్లీ:** రాబోయే కాలమంతా భారత్‌దే అంటున్నారు ఆస్ట్రేలియా మాజీ ప్రధాని టోనీ అబోట్. ఈ 21 శతాబ్దం అనేది కచ్చితంగా భారత్‌దేనని అందులో ఎటువంటి సందేహం లేదన్నారు. కనీసం నాలుగు నుంచి ఐదు దశాబ్దాల పాటు ప్రపంచాన్ని భారత్ శాసిస్తుందన్నారు. ఎన్డీటీవీ వరల్డ్ సమ్మిట్-2025లో పాల్గొనేందుకు భారత్‌కు వచ్చిన టోనీ అబాట్.. మాట్లాడుతూ.. భారత్‌పై, ప్రధాని నరేంద్ర మోదీపై ప్రశంసలు కురిపించారు. స్వేచ్ఛా ప్రపంచం అనే మాటకు భారత్‌ను సరైన నిర్వచనంగా మారుతుందనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదన్నారు. అమెరికా అధ్యక్షుడు నుంచి స్వేచ్ఛా ప్రపంచ నాయకుడు అనే బాధ్యతను భారత ప్రధాని తీసుకోవచ్చని అబోట్ అభిప్రాయపడ్డారు. ఈ 21వ శతాబ్దంలో చైనా ఎలాగైతే ఎదిగిందో అలాగే భారత్ కూడా ఎదుగుతుందన్నారు. కనీసం 40 ఏళ్ల నుంచి 50 ఏళ్ల పాటు ప్రపంచాన్ని భారత్ శాసిస్తుందన్నారు. భారత్ సూపర్‌పవర్‌గా ఆవిష్కృతం కావడానికి ఎంతో సమయం పట్టదన్నారు. ప్రపంచంలో భారత్ సరికొత్త సూపర్‌పవర్ కాబోతుందని ధీమా వ్యక్తం చేశారు. ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో చైనాకు బలమైన ప్రత్యర్థిగా, తమకు నమ్మకమైన భాగస్వామిగా భారత్ కీలక పాత్ర పోషించాలన్నారు. చైనాను ఆర్థికంగా, సైనిక పరంగా అధిగమించే క్రమంలో బారత్ మూడు అతిపెద్ద ప్రయోజాలను కల్గి ఉందన్నారు. అది భారతదేశంలో ప్రజాస్వామ్యం, చట్ట పాలన, ఇంగ్లిష్ అనే ఈ మూడు అంశాలు భారత్ వేగంగా ఎదగడానికి, చైనాను దాటిపోవడానికి కీలకం కాబోతున్నాయన్నారు.

# ఏం సాధించారని విజయోత్సవాలు!

**హైదరాబాద్ :** ఏం సాధించామని కాంగ్రెస్ ప్రభుత్వం విజయోత్సవాలకు సిద్ధమవుతుంది..? అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సూటిగా ప్రశ్నించారు. ఈ 23 నెలల పాలనలో ఏం సాధించారు అని విజయోత్సవాలు జరుపుతారు అని నిలదీశారు. ఇవాళ తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ విజయోత్సవ కార్యక్రమాలు నడుపుతారంటా.. ఎందుకు నాయన తుపాకులు పెట్టి వసూళ్లు బాగా చేసినందుకా? కమిషన్ల కోసం క్యాబినెట్‌లో గల్లాలు పట్టుకొని కొట్టుకున్నందుకా? మంత్రుల మధ్య తగాదాలు జరుగుతున్నందుకా? ఏం సాధించామని కాంగ్రెస్ ప్రభుత్వం విజయోత్సవాలకు సిద్ధమవుతుంది..? అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

ఆరు గ్యారెంటీలు, 420 హామీలను రేవంత్ సర్కార్ తుంగలో తొక్కింది. అవ్వాతాతలకు పెన్షన్ ఇవ్వకుండా మోసం చేసినందుకు విజయోత్సవాలు జరుపుతారా..? నెలకు రూ. 2500 ఇస్తారేమోనని మహిళలు ఎదురు చూశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేయని వర్గం లేదు. రైతుబంధు ఇవ్వనందుకు, రుణమాఫీ చేయనందుకు ఉత్సవాలు జరుపుతారా..? గురుకులాల్లో పిల్లలు పిట్టల్లా రాలుతున్నందుకు ఉత్సవాలు జరుపుతారా..? నిరుద్యోగులకు నోటిఫికేషన్లు ఇవ్వనందుకు ఉత్సవాలు జరుపుతారా..? అని హరీశ్‌రావు నిలదీశారు. పెట్టుబడిదారులకు, పారిశ్రామికవేత్తలకు, సినిమా పెద్దలకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు, పేదలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుంది. ప్రభుత్వం



మిమ్మల్ని ఇబ్బంది పెడితే మా దృష్టికి తీసుకురండి.. మేము కాపాడుతాం. మీకోసం తెలంగాణ భవన్ తలుపులు ఎప్పుడు తెరిచే ఉంటాయని హరీశ్‌రావు అన్నారు. డీజీపీ శివధర్ రెడ్డి కాకీ బుక్‌లో మంత్రులకు రూల్స్ వేరేలా ఉన్నాయా? టెండర్లు వేయొద్దని మంత్రులు బెదిరిస్తుంటే.. ముఖ్యమంత్రి సన్నిహితులు తుపాకులు పట్టుకొని తిరుగుతుంటే వారి మీద కేసు లేదు. ఒక ట్వీట్‌ను రీట్వీట్ చేస్తే కేసులు పెట్టి అరెస్ట్ చేస్తున్నారు అని హరీష్ రావు తెలిపారు.

**కాంట్రాక్టుల్లో వాటాల కోసమే కాంగ్రెస్ నేతల మధ్య తగాదాలు : హరీశ్‌రావు**

కాంట్రాక్టుల్లో వాటాల కోసమే కాంగ్రెస్ నేతల మధ్య తగాదాలు ఏర్పడుతున్నాయని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. కమీషన్ల కోసం ఒకరు, కాంట్రాక్టుల కోసం ఒకరు, వాటాల కోసం ఒకరు, అక్రమ వసూళ్ల కోసం, కబ్జాల కోసం ఒకరు అని వర్గాలుగా విడిపోయారు. ఇవాళ కేబినెట్ మీటింగ్ దండుపాళ్యం ముఠా లాగా అయిపోయింది అని హరీశ్‌రావు విమర్శించారు. ఇవాళ తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్రానికి ఈ ఏడాది అతి తక్కువ పెట్టుబడులు, పరిశ్రమలు వచ్చాయి. వ్యాపారవేత్తలకు తుపాకులు ఎక్కుపెట్టి బెదిరించి వసూలు చేస్తున్న సంస్కృతి కాంగ్రెస్ పార్టీది. ఇది మేం చేస్తున్న ఆరోపణలు కాదు.. స్వయంగా ఒక మంత్రి కుమార్తె చెప్పిన వాస్తవం. హోం శాఖ సీఎం రేవంత్ రెడ్డి వద్దే ఉంటే నిస్పాక్షిక దర్యాప్తు ఎలా జరుగుతుంది..? మంత్రుల మధ్య తగాదాలు పెరిగిపోయి.. రాష్ట్రం పరువు బజారున పడేస్తున్నారు అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. కేసీఆర్ తన పాలనలో కేంద్రంతో కొట్లాడి నీళ్ల వాటా, నిధుల వాటా సాధించారు. కేసీఆర్ హయాంలో పెట్టుబడులకు కేంద్రంగా తెలంగాణ ఉండేది. టెక్ మహేంద్ర సీఈఓ వచ్చినప్పుడు వర్షం పడుతుంటే తానే గొడుగు పట్టి వ్యాపారవేత్తలను ఆహ్వానించిన సంస్కృతి మాది.. తుపాకులు పెట్టి వసూళ్ళు చేస్తున్న సంస్కృతి మీది. రేవంత్ రెడ్డి ఇవాళ తెలంగాణలోకి గన్ కల్చర్ తీసుకువచ్చాడు.. అందుకే ఇవాళ రాష్ట్రానికి పెట్టుబడులు తగ్గిపోయాయని హరీశ్‌రావు పేర్కొన్నారు. మంత్రులు వాటాల కోసం కొట్టుకుంటుంటే సీఎం చోద్యం చేస్తున్నారు. ముఠా పంచాయితీలు తెంపుకోవడానికి నిన్న కేబినెట్ మీటింగ్ పెట్టుకున్నారు. ఎవరికి అందినకాడికి వారు దోచుకుంటున్నారు అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

# కొండా పదవికి ఎసరు

**హైదరాబాద్ :** కొండా సురేఖ మంత్రిపదవికి ఎసరు వచ్చింది. ఆమెను తప్పించేందుకు రంగం సిద్ధమైనట్టు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యమంత్రి, మంత్రులపై ఆమె కుమార్తె చేసిన వ్యాఖ్యలతోపాటు కొండ సురేఖ కూడా సన్నిహితుల వద్ద ఇలాంటి కామెంట్స్ చేసినట్టు తెలుస్తోంది. అంతే కాకుండా మొదటి నుంచి ఆమె వివాదాల్లో ఇరుక్కోవడం తర్వాత ప్రభుత్వం వాటిని సమర్థించుకోవడం సాధారణంగా మారింది. ఇప్పటి వరకు ఎక్కువ వివాదాల్లో ఇరుక్కున్న మంత్రిగా కొండా సురేఖ పేరు పొందారు. కేటీఆర్, నాగార్జున ఫ్యామిలీ ఇష్యూలపై మాట్లాడటం, తర్వాత ఓ ప్రైవేటు పార్టీలో మందు గురించి మాట్లాడటం, తోటి మంత్రులతో గిల్లికజ్జాలు, ఇలా వివిధ రకాలైన వివాదాల్లో ఇరుకుంటూ వస్తున్నారు. ఇప్పుడు వెలుగు చూసిన వివాదం మరింత రచ్చకెక్కింది. ఏకంగా ఓ కంపెనీ ప్రతినిధులను గన్‌తో బెదిరించిన వ్యక్తికి వంతపాడుతూ కాపాడే ప్రయత్నం చేయడంతో ముఖ్యమంత్రి సీరియస్‌గా ఉన్నట్టు తెలుస్తోంది. కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్ధమయ్యారు. మొదటి నుంచి వివాదాల మంత్రిగా ఉన్న కొండా సురేఖపై మొత్తం మంత్రిమండలే గుర్రుగా ఉన్నట్టు తెలుస్తోంది. అందుకే దీనిపై అధినాయకత్వానికి ఫిర్యాదు చేసి తప్పించాలని చూస్తున్నారు. బుధవారం నుంచి ఓఎస్‌డీ చుట్టూ రాజుకున్న వివాదంలో ఆమె కుమార్తె చేసిన కామెంట్స్ మరింత కాక రేపాయి. ఏకంగా టెండర్ల పేర్లతో, సెటిల్మెంట్ల



పేర్లతో దోపిడీ జరుగుతుంది అని సిట్టింగ్ మినిస్టర్ కూతురే కామెంట్స్ చేయడం అందర్నీ ఆశ్చర్యపరిచింది. సీఎం అనుచరుడు రోహిణ్ రెడ్డి దందాలు చేస్తున్నారని, సీఎం బ్రదర్స్ కొండల్ రెడ్డి, తిరుపతి రెడ్డి గురించి, రేవంత్ అంతర్గత విషయాలపై సుస్మిత బహిరంగంగా మీడియా ముందు విమర్శలు చేశారు. వీటన్నింటిపై గుర్రుగా ముఖ్యమంత్రి ఇంకా కొండా సురేఖను కొనసాగిస్తే వాటికి సమ్మతించినట్టు అవుతుందని భావిస్తున్నారట. అందుకే ఆమెను తప్పించేందుకు సిద్ధమయ్యారని అంటున్నారు. మేడారం పనుల టెండర్లతో మొదలైన వివాదం ఇప్పుడు మరింత పీక్స్ వెళ్లింది. అప్పటి నుంచి ముఖ్యమంత్రి మీటింగ్స్‌కు కొండా సురేఖ దూరంగా ఉంటున్నారు. ఇవాళ కేబినెట్‌కు వస్తారో రారో కూడా తెలియడం లేదు. అందుకే ఇంత గ్యాప్ వచ్చిన తర్వాత టీంగా పని చేయడం కష్టమని సీఎం సన్నిహతులు చెబుతున్నారు. కొండా సురేఖను తప్పించేందుకు అధిష్ఠానం ఓకే చెబుతుందా లేదా అన్నది మాత్రం అనుమానంగా ఉంది. అసలే బీసీల కోసం పోరాడుతున్న పార్టీగా ఎస్టాబ్లిష్ అవుతున్నారు. ఈ టైంలో ఓ బీసీ మహిళను తప్పిస్తే ఎలాంటి పరిణామాలు ఉంటాయనేది బేరీజు వేసుకుంటున్నారు. దీనికి కౌంటర్‌గా ఏం చేయాలనే విషయంపై చర్చలు జరుపుతున్నట్టు తెలుస్తోంది. అసలే జూబ్లీహిల్స్ ఉపఎన్నికలు, మరోవైపు లోకల్ బాడీ ఎన్నికల వేళ కొండా సురేఖపై తీసుకునే నిర్ణయం పార్టీకి ఇబ్బంది లేకుండా ఏం చేయాలో ఆలోచిస్తున్నారు. అసలే కోర్టు వివాదాలతో బీసీ సంఘాలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నాలు నిరసనలు చేపడుతున్నారు. ఈ టైంలో ఈ నిర్ణయం తీసుకుంటే వచ్చే పరిణామాలపై సమాలోచనలు జరుపుతున్నారు. సురేఖతో పార్టీ పెద్దలు మాట్లాడి ఆమెకు స్వతహాగా తప్పుకునేలా కూడా ఒప్పించే ఛాన్స్ ఉందని అంటున్నారు. తనపై తన అనుచరులపై ఆరోపణలు వచ్చినందుకు అవి నిర్ధారణ అయ్యే వరకు పదవికి దూరంగా ఉంటానని చెప్పే ఆస్కారం లేకపోలేదని, దీని వల్ల రెండు వర్గాలను కూల్ చేసినట్టు అవుతుందని కూడా పార్టీలోని ఓ వర్గం ప్రయత్నాలు చేస్తోంది.

# మళ్లీ కరీంనగర్‌లో వర్గపోరు

**కరీంనగర్ :** కరీంనగర్‌లో కాషాయ కుంపటి ? బండి వర్సెస్ ఈటల వర్గపోరు మళ్లీ రగిలింది. హుజురాబాద్ నియోజకవర్గం చుట్టూ కాషాయ రగడ స్థానిక ఎన్నికల్లో బీఫాం ఇష్యూనే రచ్చకు కారణమా..? గతంలో బండిపై పరోక్షంగా ఈటల ఘాటు వ్యాఖ్యలు హుజురాబాద్‌లో ప్రెస్‌మీట్ తర్వాత రాజుకున్న మంటలు తెలంగాణ బీజేపీలో కీలక నేతల మధ్య ఆధిపత్య పోరు మళ్లీ రగులుకుంది. కేంద్ర మంత్రి బండి సంజయ్ వర్గం.. ఎంపీ ఈటల రాజేందర్ మధ్య విభేదాలు మరోమారు బయటపడ్డాయి. హుజురాబాద్ పార్టీ నేతల విషయంపై మొదలైన వివాదం రోజురోజుకూ మరింత ముదురుతోంది. హుజురాబాద్‌లో ఆధిపత్యాన్ని నిరూపించుకునే ప్రయత్నంలో ఈటల మాటాల తూటాలు పేలుస్తుంటే.. బండి వర్గం అంతే ధీటుగా కౌంటర్ అటాక్ చేస్తోంది. గతంలోనూ ఈటల, బండి మధ్య పేర్లు ప్రస్తావించకుండా డైలాగ్ వార్ నడిచింది. ఓవైపు రిజర్వేషన్ల పంచాయితీ తేలక.. స్థానిక ఎన్నికలు వాయిదా పడగా.. బండి వర్సెస్ ఈటల వర్గాల తాజా పంచాయితీ పొలిటికల్ హీట్ పెంచుతోంది. ఇంతకీ ఆ రెండు వర్గాల మధ్య తాజా పొలిటికల్ పంచ్‌లకు రీజనేంటి.. నిన్న, మొన్నటి వరకు స్దానికంగా ఉండే నాయకుల్లో కనిపించిన విభేదాలు ఇప్పుడు నేరుగా ముఖ్య నాయకుల మాటలతో మరింత రంజుగా మారిపోయాయా..? తాజా పరిణామాలు పరిశీలిస్తే అవుననే సమాధానం వస్తోందంటున్నారు రాజకీయ విశ్లేషకులు. స్దానిక సంస్దల ఎన్నికల నేపథ్యంలో హుజూరాబాద్ నియోజవర్గంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. ఇన్నేళ్లుగా హుజూరాబాద్ వైపు కన్నెత్తి చూడని ఈటల రాజేందర్.. ఈమధ్య ఉన్నట్టుండీ రావడం.. అందులోనూ బీజేపీ శ్రేణులను, తన అనుచరులను ప్రేమగా పలకరించడం హాట్‌టాపిక్‌గా మారింది. ఈటల హుజురాబాద్ నుంచి మల్కాజిగిరి మకాం మార్చడంతో.. ఆయన ఫాలోయర్స్.. అయోమయంలో పడ్డారు. కారు దిగిన ఆయన కమలదళంలో చేరడంతో.. అప్పటి వరకు ఉన్న అనుచరులకు బీజేపీలో అంతగా ప్రాధాన్యత లేదన్న వాదన లేకపోలేదు. ఈటల మల్కాజిగిరి నుంచి ఎంపీగా గెలిచారు సరే.. మా సంగతేంటంటూ ఆయన అనుచరులు ఆవేదన చెందుతున్నారట. ఈటల హుజురాబాద్ రారు.. ఇక్కడి బీజేపీ



నాయకులు తమను కలుపుకునిపోరు.. అంటూ వాపోతున్నారట. ఈ నేపథ్యంలో తనను నమ్ముకున్న కేడర్‌కు భరోసా ఇచ్చేందుకు ఈటల తాజాగా హుజురాబాద్ బాట పట్టారు. వరుస పర్యటనలు చేస్తూ అనుచరులకు నేనున్నానంటూ అభయం ఇస్తున్నారు.. తన అనుచరులకు భరోసా ఇవ్వడం అంతా బాగానే ఉన్నా.. స్థానిక సంస్థల ఎన్నికల్లో హుజూరాబాద్ బీజేపీ అభ్యర్థులకు బీఫామ్స్ నేనే ఇస్తానంటూ ఈటల చేసిన కామెంట్ ఇప్పుడు అగ్గికి ఆజ్యం పోసినట్టయ్యిందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. అసలే బండి సంజయ్, ఈటల రాజేందర్ మధ్య కోల్డ్ వార్ కంటిన్యూ అవుతోందన్న ప్రచారం ఉంది. అలాంటిది ఇప్పుడు ఏకంగా బండి సంజయ్ ప్రాతినిధ్యం వహిస్తున్న లోక్‌సభ సెగ్మెంట్‌కే వచ్చి.. కరీంనగర్ పార్లమెంట్‌లోఉండే హుజూరాబాద్‌లో పార్టీ బీఫామ్స్ నేనే ఇస్తానంటూ ఈటల అనడం రచ్చగా మారిపో యిందట. పైగా ఆ మాటలన్న ఈటలను.. బండి సంజయ్ ఈపాటికే సర్వే చేయించారు కదా.. అని జర్నలిస్టులు అడిగితే..” నేనిక్కడ ఇరవై ఐదేళ్ల నుంచి లీడర్‌ని..” అంటూ బండికి తన మార్క్ కౌంటర్ వేశారు. ఈ వ్యాఖ్యలే ఇప్పుడు కరీంనగర్ బీజేపీలో కొత్త పంచాయితీకి తెరలేపిందన్న చర్చ జోరందుకుంది ఈటల కామెంట్స్‌కు బండి సంజయ్ వర్గం నుంచి కౌంటర్ అటాక్ కూడా వచ్చిందట.”బీఫాంలు ఇచ్చేది వ్యక్తులు కాదు.. బీజేపీ అధిష్టానం” అని స్పష్టం చేస్తోందట బండి వర్గం. గ్రూపులు కట్టి, వర్గాలు విడిపోయేవారి మాట వినే సాంప్రదాయం బీజేపీలో లేదంటూ కూడా కుండబద్దలు కొట్టారు. నిజానికి హై కోర్ట్ స్టేతో స్థానిక సంస్థల ఎన్నికలు ఆగిపోయాయి. ఆ తరవాత హుజురబాద్‌లో ఈటల చేసిన ఈ వ్యాఖ్యలు ఇలా దుమారం రేపుతున్నాయి. అంతా సిద్ధమైనప్పటికీ.. ఎన్నికలు ఆగిపోవడంతో స్దానిక నాయకులు తలలు పట్టుకుంటున్నారు. ఈ క్రమంలో తాజాగా బండి వర్సెస్ ఈటల వర్గాల పంచాయితీ.. కరీంనగర్ జిల్లాలో కొత్త పొలిటికల్ హీట్ పెంచిందటవచ్చే ఎన్నికల్లో ఎవరు గెలుస్తారో.. ఎవరు ఓడుతారో..? అనే అంశం కంటే .. ఈటల వర్గానికి బీఫాములు వస్తాయా..? లేదంటే బండి సంజయ్ వర్గానికి దక్కుతాయా..? అనే ఆసక్తికర చర్చ మొదలైంది. ఎన్నికల హడావుడికి ప్రస్తుతం బ్రేక్ పడినప్పటికీ, ఈ రెండు వర్గాల మధ్య మొదలైన రగడ.. మరింత హీట్ పెంచుతోందట. మరి హుజూరాబాద్‌లో బీజేపీ టికెట్లు తమ వారికి ఇప్పించుకుని ఈటల పైచేయి సాధిస్తారా..? లేదంటే పార్టీ కోసం పని చేసినవారికి టికెట్లు అంటూ చెబుతున్న సంజయ్ వర్గం.. పైచేయి సాధిస్తుందా..? అనేది చూడాలి. అసలు స్థానిక సంస్థల ఎన్నికల కంటే బండి వర్సెస్ ఈటల వర్గాల అంశమే ఇప్పుడు కరీంనగర్ జిల్లాలో హాట్ టాపిక్‌గా మారిందట.

## ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారు?

-మొదటిపేజీ తరువాయి

ఇచ్చి ఎన్నికలు నిర్వహించాలని పిటిషనర్ పేర్కొన్నారు. ఈ నెల 9 న స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ సస్పెండ్ చేస్తూ స్టేట్ ఎలక్షన్ కమిషన్ ఉత్తర్వులు జారీ చేయగా.. నోటిఫికేషన్‌ను సస్పెండ్ చేయడానికి సవాలు చేస్తూ సురేందర్ అనే న్యాయవాది పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు.. నిన్న సుప్రీం కోర్టు కూడా ఎన్నికలకు వెళ్లమని చెప్పింది కదా అంటూ వ్యాఖ్యానించింది. ఎన్నికలు పెట్టుకోవచ్చని ఓరల్‌గా మాత్రమే చెప్పిందని.. ఆర్డర్‌లో ఎక్కడా చెప్పలేదని ఎలక్షన్ కమిషన్ తరఫు న్యాయవాది అన్నారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశామని కోర్టుకు తెలిపారు. బీసీ రిజర్వేషన్‌లను 42 శాతానికి పెంచుతూ ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చాం కాబట్టే దాన్ని సస్పెండ్ చేశాం. ఫ్రెష్ గా రిజర్వేషన్ లను గూర్చి ప్రభుత్వంతో చర్చించాకే రీ నోటిఫికేషన్ ఉంటుంది. రెండు వారాల సమయం కావాలంటూ కోర్టును స్టేట్ ఎలక్షన్ కమిషన్, రాష్ట్ర ప్రభుత్వం కోరింది. దీంతో తదుపరి విచారణ రెండు వారాలకు హైకోర్టు వాయిదా వేసింది.

## బంద్‌కు ప్రధాన కారణం బీజేపీనే

-మొదటిపేజీ తరువాయి



పాస్ చేయడమే కాకుండా న్యాయస్థానాలకు కూడా వెళ్తోందన్నారు. ఓబీసీపై సుప్రీం కోర్టులో ప్రముఖ న్యాయవాదులు పోరాడుతున్నారని తెలిపారు. కేవలం రాష్ట్ర ప్రభుత్వం పంపిన బిల్లును కేంద్రం పార్లమెంట్‌లో పెట్టకపోవడం వల్లే... ఓబీసీలకు 42శాతం రిజర్వేషన్ కష్టమని సుప్రీం కోర్టు చెప్పే పరిస్థితి వచ్చిందన్నారు. బీజేపీ పార్టీ వల్లనే బీసీ రిజర్వేషన్ల అంశం ఇంకా పెండింగ్‌లో ఉందన్నారు. దీని వల్ల రాష్ట్రంలో ఓబీసీ సంఘాలన్నీ కూడా రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చాయన్నారు. రేపు జరిగే ఓబీసీ బంద్‌కు ప్రధాన కారణం బీజేపీ అని అన్నారు. ఓబీసీల బంద్‌లో అన్ని పార్టీల సంఘాలు ఆమోదం తెలిపాయని డిప్యూటీ సీఎం వెల్లడించారు. ఓబీసీ బిల్లుపై ఎందుకు మొండి వైఖరి చూపిస్తున్నారని కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండిసంజయ్‌లను ప్రశ్నించారు. ప్రధానితో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి ఓబీసీ బిల్లును ఎందుకు పాస్ చేయించడం లేదని నిలదీశారు. బిల్లులకు అడ్డుపడుతూ మళ్ళీ కాంగ్రెస్ పార్టీ మీద బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఒక్క బీసీలే కాదు అన్ని వర్గాల ప్రజలు కూడా.. బీజేపీకి తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. బీజేపీ చేస్తున్న ఆగడాలను అందరూ గమనిస్తున్నారని.. కమలం పార్టీ విధానాలకు వ్యతిరేకంగా రేపు బంద్ జరుగుతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు.

**సింగరేణి కార్మికుల బోనస్‌పై**

కాగా.. తెలంగాణ రాష్ట్ర ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు డిప్యూటీ సీఎం. సింగరేణి కార్మికులకు దీపావళికి 400 కోట్ల రూపాయల బోనస్ చెల్లిస్తున్నామని ప్రకటించారు. సింగరేణి ఖమ్మం జిల్లా నుండే మొదలైందని.. ఇక్కడ మొదలై రాష్ట్రం అంతటా వ్యాపించిందన్నారు. సింగరేణి కార్మికులకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు

## హస్తంలో రచ్చ

-మొదటిపేజీ తరువాయి

మారాయి. రెండేళ్లైనా నిండక ముందే..మంత్రులు గొడవలకు దిగడం.. సర్కార్ ఇమేజ్‌కు డ్యామేజ్ చేస్తుందని టాక్. అమాత్యుల గిల్లి కజ్జాలపై సీరియస్‌గా ఉన్న సీఎం రేవంత్..మంత్రులను గాడిన పెట్టడంపై దృష్టి పెట్టారట. మొన్న పొన్నం, అడ్లూరి..నిన్న కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి.. ఇప్పుడు వివేక్ ఎంట్రీతో..అడ్లూరితో వివాదంపై రచ్చ.ఇలా రోజుకో ఇద్దరు మంత్రుల వివాదం న్యూస్ హెడ్‌లైన్‌గా మారి ప్రభుత్వానికి హెడెక్‌గా మారిందట. పైగా డైరెక్టుగా అధిష్టానం పెద్దలకే ఒకరిపై మరొకరు కంప్లైంట్ చేసుకుంటుండటం కూడా ప్రభుత్వాన్ని బజారున పడేస్తుందన్న భావనలో ఉన్నారట సీఎం రేవంత్. ఈ క్రమంలోనే కాంట్రవర్సీకి కేరాఫ్‌గా ఉంటున్న మంత్రుల తీరుపై ఆగ్రహంగా ఉన్న ముఖ్యమంత్రి..తీరు మార్చుకోవాలని సూచించారట.మంత్రుల మధ్య అభిప్రాయ బేధాలు ఉంటే..ఇంటర్నల్‌గా డిస్కస్ చేసుకోవాలి కానీ.. మీడియాకెక్కి రచ్చ చేస్తుంటే ప్రభుత్వం పరువు పోతుందని..ఓ సీనియర్ మంత్రి వాపోయినట్లు టాక్. ప్రతిపక్షాల ముందు చులకన కావొస్తుందని సీఎం రేవంత్ రెడ్డి కూడా ఆగ్రహంగా ఉన్నారట. మంత్రులకు అనుమానాలు, అపోహలు ఉంటే..నేరుగా తనతో మాట్లాడొచ్చని..అలా కాకుండా.. ఒకరిని ఒకరు టార్గెట్ చేసుకోవడం ఏంటని.. క్లాస్ తీసుకున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.సేమ్ టైమ్ వివాదాస్పద మంత్రులపై యాక్షన్ తప్పదని చెప్పకనే చెప్పారట ముఖ్యమంత్రి. నిత్యం ప్రభుత్వాన్ని ఇరకాటంలో పడేస్తూ..ఏదో ఒక వివాదంతో మీడియాకు ఎక్కుతున్న మంత్రులపై వేటు తప్పదని అంటున్నారట. అందులో భాగంగానే వివాదాస్పద మంత్రుల శాఖలపై సీఎంవో నిఘా పెట్టిందట. ఈ క్రమంలోనే కొండా సురేఖ శాఖలోని ఓఎస్డీని తప్పించారని అంటున్నారు. కాంట్రవర్సీల్లో నిలుస్తున్న మంత్రులను కూడా తప్పించేందుకు కూడా వెనకాడబోమంటున్నారట.స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత క్యాబినెట్‌లో ఖాళీగా ఉన్న మిగిలిన మూడు పోస్టులు భర్తీ చేసేప్పుడు..ఇప్పుడున్న క్యాబినెట్ మంత్రుల్లో కూడా మార్పులు చేర్పులు ఉంటాయట. అవసరమైతే కొందరు మంత్రులను తప్పించడమో .. లేకపోతే శాఖలను మార్చడమో చేయాలని భావిస్తున్నారట. ఇదే విషయాన్ని మంత్రులకు సుతిమెత్తంగా సీఎం రేవంత్ వివరించారన్న టాక్ సెక్రటేరియట్ వర్గాల్లో వినిపిస్తోంది.ఏదేమైనా మంత్రుల ఆధిపత్య పోరు తలనొప్పిగా మారుతుండటంతో పాటు..జనరల్ ఎలక్షన్ రేసు మొదలవుతున్న టైమ్‌లో ఇలాంటి విషయాల్లో ఏ మాత్రం జాప్యం చేయొద్దని సీఎం రేవంత్ ఫిక్స్ అయ్యారట. మరి ముఖ్యమంత్రి అల్టిమేటంతో అమాత్యుల తీరు మారేనా? లేకపోతే ఇలాగే గ్రూప్‌వార్‌ను కంటిన్యూ చేస్తారా అనేది చూడాలి.

## అపార్ట్ మెంట్ వద్దనుకుంటున్నారోచ్

**హైదరాబాద్ :** కాస్త దూరంగా పోయి అయినా ఇండిపెండెంట్ ఇళ్లే కొనాలనుకునేవారు చాలా మంది ఉన్నారు. అలాంటి వారి కోసం హయత్ నగర్ హాట్ ఫేవరేట్ గా మారింది. చిన్న బిల్డర్లు 100 చదరపు గజం నుంచి 300 చదరపు గజాల వరకు ఇళ్లను నిర్మిస్తున్నారు, ధరలు 45 లక్షల నుంచి ?1 కోటి వరకు చెబుతున్నారు. హయత్‌నగర్ చుట్టూ రెసిడెన్షియల్ ప్లాట్లు ఇంకా అందుబాటులో ధరల్లోనే ఉన్నాయి, ముఖ్యంగా ఔటర్ రింగ్ రోడ్ సమీపంలో చదరపు గజానికి ?35,000 నుంచి ?50,000 వరకు. పెద్ద అంబర్‌పేట్‌లో ?32,000 నుంచి ?54,000 వరకు, పసుమాముల , తట్టి అన్నారంలో ?42,000 నుంచి ?60,000 వరకు ధరలు ఉన్నట్లుగా రియల్ ఎస్టేట్ బ్రోకర్లు చెబుతున్నారు.హయత్‌నగర్ సమీపంలో భూమి ధరలు ఇతర ప్రాంతాలతో పోలిస్తే తక్కువగా ఉన్నాయి. ఔటర్ రింగ్ రోడ్ సమీపంలో ఎకరానికి ?3–4.5 కోట్లు, కొంచెం లోపల ?2–3 కోట్లు. రియల్ ఎస్టేట్ నిపుణులు, రీజియనల్ రింగ్ రోడ్ మరియు రింగ్ రైల్ వంటి అవసర సదుపాయాలు మొదలైన తర్వాత భూమి మరియు రెసిడెన్షియల్ ప్లాట్ ధరలు గణనీయంగా పెరుగుతాయని అంచనా వేస్తున్నారు. అపార్టుమెంట్లు కూడా విరివిగా నిర్మిస్తున్నారు. చదరపు అడుగుకు ?3,400 నుంచి ?4,200 వరకు. డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్: ?45 లక్షల నుంచి ?52 లక్షలు. ట్రిపుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్: ?55 లక్షల నుంచి ?65 లక్షలు. రామోజీ ఫిల్మ్ సిటీ చుట్టూ కొన్ని డెవలపర్లు విల్లాలు నిర్మిస్తున్నారు. హయత్‌నగర్‌కు ఔటర్ రింగ్ రోడ్, విజయవాడ జాతీయ రహదారి ద్వారా మెరుగైన కనెక్టివిటీ ఉంది. సమీపంలో రామోజీ ఫిల్మ్ సిటీ, సంఘి టెంపుల్, మౌంట్ ఓపెరా వంటి ఆకర్షణలు ఉన్నాయి. ఇంజనీరింగ్ , ఫార్మా కాలేజీలు ఉన్నాయి. రీజినల్ రింగ్ రోడ్ , రీజియనల్ రింగ్ రైల్ ప్రాజెక్టులు హయత్‌నగర్‌ను మరింత అభివృద్ధి చేస్తాయి. హయత్‌నగర్‌లో చాలా మంది కొనుగోలుదారులు ప్రాపర్టీలను ఇన్వెస్ట్‌మెంట్ పరంగా కొంటున్నారు.

# సంపాదకీయం

## చైనా ఉన్నతిని గుర్తిస్తున్న ప్రపంచం

చైనా, యావత్ ప్రపంచ దేశాలూ అసాధారణమైన పరిస్థితులను ఎదుర్కొంటున్న నేపథ్యం లో సి.పి.ఐ(యం) ప్రతినిధి బృందం చైనాలో పర్యటించింది. ఆరుగురు ప్రతినిధులతో కూడిన మా బృందం సెప్టెంబరు 23 నుండి 30 వరకు ఆ దేశ రాజధాని బీజింగ్‌తో పాటు హుబెయి, ఝెజియాంగ్ ప్రావిన్స్‌లను సందర్శించింది. నేను 40 ఏళ్ళ క్రితం, 1985లో తొలిసారిగా చైనాలో జరిగిన అంతర్జాతీయ యువజన సదస్సుకు హాజరయ్యా ను. ఈ శతాబ్దపు తొలి దశాబ్దంలో మరలా చైనాలో అడుగు పెట్టిన నేను ఆ దేశంలో చోటు చేసుకున్న మార్పులు చూసి ఆశ్చర్యపోయాను. బీజింగ్‌లోని తియాన్మెన్ స్క్వేర్‌లో 'నేషనల్ సెంటర్ ఫర్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్' (జాతీయ కళా ప్రదర్శనా వేదిక) పేరిట భూగర్భంలో నిర్మించిన సాంస్కృతిక రంగస్థల సమాహార వేదిక ఆసియాలోనే అతి భారీ కట్టడంగా పేరొందింది. స్థానికంగా ఈ కాంప్లెక్స్‌ను 'జెయింట్ ఎగ్'గా పిలుచుకుంటారు. అద్భుతమైన శిల్ప కళా నైపుణ్యంతో నిర్మించిన ఈ కాంప్లెక్స్‌లో ఒకేసారి నాలుగైదు భారీ ఇవెంట్లు నిర్వహించుకోవచ్చు. మౌలిక సౌకర్యాల అభివృద్ధిలోని సృజనాత్మకత, సాంస్కృతిక వైభవాలకు ఇది అద్దం పడుతుంది. గతంలో పర్యటించినప్పుడు ఇక్కడ చుట్టు పక్కల పరికిస్తూ ఉండిపోయాను. ఈసారి మాత్రం వయోలిన్, గిటార్‌ల వీనుల విందైన కచేరీని అస్వాదించాం. 2021 నాటికి చైనా కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి వందేళ్ళు అయ్యింది. ఈ శత వార్షిక సంబరాల్లో భాగంగా చైనా కమ్యూనిస్టు పార్టీ అమలు చేసిన భారీ ప్రజా సంక్షేమ కార్యక్రమాన్ని యావత్ ప్రపంచం ఆసక్తిగా గమనిస్తున్నది. ప్రపంచబ్యాంకు నిర్వచనం ప్రకారం దారిద్యరేఖకు దిగువన ఉన్న 80 కోట్ల ప్రజానీకాన్ని చైనా పైకి తీసుకు వచ్చింది. ఈ స్ఫూర్తితోనే కేరళలో సి.పి.ఐ(యం) నాయకత్వాన ఉన్న వామపక్ష ప్రజాతంత్ర ప్రభుత్వం కూడా దుర్భర దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న ప్రజలను పైకి తీసుకురావడానికి వివిధ అభ్యుదయ కార్యక్రమాలను అమలు చేసిన తీరును గుర్తు చేసుకోవడం సందర్భోచితమని భావిస్తున్నాను. ఈ ఏడాది నవంబర్ నాటికి మన దేశంలో దుర్భర పేదరికాన్ని నిర్మూలించిన తొలి రాష్ట్రంగా కేరళ నిలుస్తుంది. చైనా కమ్యూనిస్టు పార్టీ శత వార్షికోత్సవాల సందర్భంగా ఈ ఏడాది జులై 15న బీజింగ్‌లో ఒక మ్యూజియమ్ ఏర్పాటు చేశారు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో ఒక దేశ చరిత్రను, పార్టీ చరిత్రను సునిశితంగా ఎలా ప్రదర్శించవచ్చనే దానికి మ్యూజియమ్‌ను ఒక ఉదాహరణగా చెప్పుకోవచ్చు. చైనా కమ్యూనిస్టు పార్టీ ఏర్పడిన కాలం నుండి ఆధునిక కాలం వరకూ వందేళ్ళ సుదీర్ఘ ప్రయాణంలో సాధించిన విజయాలను కళ్ళకు కట్టినట్లు డిజిటల్ రూపంలో ప్రదర్శించారు. చైనాను సామ్రాజ్యావాద, వలస పాలన నుండి విముక్తి చేసేందుకు సాగించిన పోరాటాన్ని, వివిధ దశలలో అనుసరించిన వ్యూహాలను, ఎత్తుగడలను ఆది నుండి తుది వరకు సచిత్ర రూపంలో ప్రదర్శించారు. మావో జెడాంగ్ నాయకత్వం.. కుమింటాంగ్‌తో పొత్తు, 1927 తర్వాతి కాలం నాటి చీలిక, పోరాటాలు, లాంగ్ మార్చ్, అశేష త్యాగాలు, సమరశీల పోరాటాల ద్వారా సాధించిన విప్లవ విజయం, డెంగ్ జియావో పింగ్ నాయకత్వాన చేపట్టిన ఆధునీకరణ చర్యలు, జియాంగ్ జెమిన్, హుజింటావో నాయకత్వాన కొనసాగిన ఆధునీకరణ పర్వం, 2012 నుండి సీ జిన్‌పింగ్ నాయకత్వాన పార్టీ, దేశం పురోగమిస్తున్న వర్తమాన దశను ఇందులో పొందుపరిచారు. ఈ మ్యూజియంలో 4,548 వస్తువులను ప్రదర్శనకు ఉంచారు. కార్ల్‌మార్క్స్ బ్రసెల్స్ నోట్‌బుక్, చైనా రిపబ్లిక్‌ను ప్రకటించిన రోజున మావో ధరించిన కోటు, టోపీ, మావో చేతి రాత ప్రతులు, కమ్యూనిస్టు ప్రణాళికను చెన్ వాంగ్టూ చైనా భాషలోకి అనువదించిన ప్రతి, లాంగ్ మార్చ్ సందర్భంగా ధరించిన బెల్ట్‌లు, చైనా సైన్యం అమెరికా 31వ పదాతి దళాన్ని ఓడించి కైవసం చేసుకున్న అమెరికన్ జాతీయ జెండా వంటివి చూశాం. మా పర్యటన సందర్భంగా అనేక ద్వైపాక్షిక చర్యలు చోటు చేసుకున్నాయి. అన్నింటిలోకి చైనా కమ్యూనిస్టు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు 'లీ షులేరు' నాయకత్వాన ఉన్న ప్రతినిధి బృందంతో సాగిన చర్యలు ప్రముఖమైనవి. చైనా కమ్యూనిస్టు పార్టీ – సి.పి.ఐ.(యం), ఇరు పార్టీల మధ్య ఉన్న దీర్ఘకాలిక ధృఢ సంబంధాలను కొనసాగించాలన్న అభిప్రాయం ఈ చర్చల్లో వచ్చింది. ట్రంప్ అధ్యక్షతన అమెరికా ప్రపంచ దేశాల మీద, ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దక్షిణాది దేశాల మీద తన ఆధిపత్యాన్ని రుద్దడానికి సాగిస్తున్న ప్రయత్నాలను ఇరు పార్టీలూ గమనంలో ఉంచుకుని, ఈ ప్రయత్నాలను నిలవరించడానికి భుజం భుజం కలిపి నిలబడాలన్న ఏకాభిప్రాయానికి వచ్చాయి. ఈ సందర్భంగా తియాంజిన్‌లో జరిగిన షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్స్ సదస్సుకు భారత ప్రధాని నరేంద్ర మోడీ హాజరైన విషయాన్ని గమనంలోకి తీసుకున్నది. భారత్ చైనా దేశాల మధ్య రాయబార సంబంధాలు నెలకొని 75 ఏళ్లు కావొస్తున్న సందర్భం ఇది. షాంఘై కోఆపరేషన్ వేదికతో పాటు బ్రిక్స్ కూటమిలో కూడా రెండు దేశాలూ వాటి వంతు పాత్ర పోషిస్తున్నాయి. రాబోయే కాలంలో భారత్, చైనాలు వంతుల వారీగా బ్రిక్స్ అధ్యక్ష స్థానాన్ని నిర్వహించనున్నాయి. భారత్ – చైనాలు చర్చల ద్వారా రెండు దేశాల మధ్య నెలకొన్న సమస్యలు పరిష్కరించుకోవాలని చైనా కమ్యూనిస్టు పార్టీ సిపిఐ(ఎం) ప్రతినిధి బృందాలు అభిప్రాయపడ్డాయి. రెండు దేశాల మధ్య సంబంధాలు మెరుగుపడడం ఇరు దేశాలకూ లాభదాయకం కావడంతో పాటు ప్రపంచ శాంతికి, ఆర్థిక ప్రగతికి తోడ్పడుతుంది కాబట్టి ఇరు దేశాలూ సరిహద్దుల వద్ద నెలకొన్న ఉద్రిక్తతలను ఉపశమింపచేయడానికి ఓపికగా కృషి చేయాలని ఇరు పార్టీల ప్రతినిధి బృందాలు అభిప్రాయపడ్డాయి. మేం ఈ పర్యటనలో ఉన్న సందర్భంలోనే ఆ దిశగా ఆశాజనకమైన పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఇందులో భాగంగానే చైనా–భారత్‌ల మధ్య ప్రత్యక్ష విమానయానానికి ఇరు దేశాలూ అంగీకారానికి వచ్చాయి. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రపంచ దేశాల మీద టారిఫ్ ఉగ్రవాదంతో ఎడాపెడా దాడులు చేస్తూ, బెదిరింపులకు పాల్పడుతున్నాడు. చైనా మాత్రం తొణుకూబెణుకూ లేకుండా అమెరికాను ప్రతిఘటిస్తూ తమ దేశ ప్రయోజనాల కోసం నికరంగా నిలబడింది. చైనా పటిష్ట ఆర్థిక వ్యవస్థ, చైనా కమ్యూనిస్టు పార్టీ రాజకీయ దృక్పథం ఇందుకు ఎంతగానో తోడ్పడ్డాయి.

# మావోల లొంగుబాటులో భిన్నస్వరాలు

భారతదేశంలో మావోయిస్టు ఉద్యమం దశాబ్దాలుగా రక్తపాతానికి, అస్థిరత్వానికి చిహ్నంగా నిలిచింది. 1967లో నక్సల్‌బరీ తిరుగుబాటుతో మొదలైన ఈ సాయుధ పోరాటం, దేశంలోని అనేక ప్రాంతాలను అస్తవ్యస్తం చేసింది. కానీ, 2025 అక్టోబర్‌లో జరిగిన వరుస సరెండర్లు ఈ ఉద్యమానికి ముగింపు దశ వచ్చినట్టు సూచిస్తున్నాయి. మావోయిస్టు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ రావు (అలియాస్ భూపతి, సోనూ) మహారాష్ట్రలో సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ సమక్షంలో లొంగిపోవడం, ఆయనతో పాటు 60 మంది కేడర్ సరెండర్ చేయడం ఒక మైలురాయి. ఇది కేవలం ఒక సంఘటన కాదు. మావోయిజంలో అంతర్గత విభేదాలు, ప్రభుత్వ ఒత్తిడి, సమాజ మార్పులు అన్నీ కలిసి సృష్టించిన పరిణామమే ఈ లొంగుబాటు. ఈ సరెండర్లు మావోయిస్టు పార్టీకి గట్టి దెబ్బ. కానీ, ఈ లోంగుబాటు దీర్ఘకాలిక ఉద్యమానికి,విరామమా !? లేక వ్యూహాత్మక వెనకడుగా!? అనేది విశ్లేషించాల్సిన అంశం. మల్లోజుల వేణుగోపాల్ సరెండర్ ఒక చారిత్రక సంఘటన. 70 ఏళ్ల వయస్సున్న అగ్రనేత. పార్టీ వ్యవస్థాపక సభ్యుడు. పొలిట్‌బ్యూరో, కేంద్ర కమిటీ, సెంట్రల్ మిలిటరీ కమిషన్ సభ్యుడు. ఆయన వ్యూహకర్తగా పేరుపొందాడు. రెండు నెలల క్రితం వరకు పార్టీ అధికారిక ప్రతినిధిగా పనిచేశాడు. గడ్చిరోలి పోలీసు హెడ్‌క్వార్టర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన తుపాకీని సీఎం చేతికి అప్పగించి, రాజ్యాంగాన్ని అందుకున్నాడు. 7 ఏకే–47లు, 6 ఎస్ఎల్ఆర్‌లు, 6 ఇన్సాస్ రైఫిళ్లతో సహా 54 ఇతర ఆయుధాలు ప్రభుత్వానికి అప్పగించారు. ఇది మావోయిస్టు చరిత్రలో మొదటిసారి ఒక సీఎం ముందు అగ్రనేత సరెండర్ అవడం. సీఎం ఫడ్నవీస్ దీనిని "మావోయిజం వెన్ను విరిగింది" అని వ్యాఖ్యానించారు. మిగిలిన కేడర్ కూడా త్వరలో లొంగిపోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మహారాష్ట్రలో మావోయిజం దాదాపు అంతమైందని, కేవలం ఒక కంపెనీ (10 మంది) తో మాత్రమే మిగిలి ఉందని చెప్పారు. నెల రోజులుగా పోలీసుల సంప్రదింపులు, ఆపరేషన్లు ఈ ఫలితానికి కారణమని పేర్కొన్నారు. ఈ సరెండర్ వెనుక అంతర్గత విభేదాలు స్పష్టం. సెప్టెంబర్‌లో 'అభయ్' పేరిట వచ్చిన లేఖలో మావోయిస్టులు ఆయుధాలు వీడటానికి సిద్ధమని, దీర్ఘకాలిక సాయుధ పోరు పొరపాటని పేర్కొన్నారు. ఒక నెల సీజ్‌ఫైర్ ప్రతిపాదన కూడా చేశారు. ఇది పార్టీలో కలకలం రేపింది. కేంద్ర కమిటీ సభ్యుడు కడారి సత్యనారాయణ రెడ్డి (అధికార ప్రతినిధి) దీనిని తప్పుపట్టి లేఖ విడుదల చేశారు. కానీ ఆయన ఎన్‌కౌంటర్‌లో మరణించాడు. మల్లోజుల పార్టీ వ్యూహంలో లోపాలున్నాయని, తాను భాగస్వామినని పేర్కొంటూ పొలిట్‌బ్యూరో సభ్యత్వానికి రాజీనామా చేశాడు. ఈ లేఖలు సరెండర్‌కు సంకేతాలిచ్చాయి. పోలీసులు ఈ సంకేతాలను పసిగట్టి, వేణుగోపాల్ సోర్స్‌ను పట్టుకుని రాయబారం నడిపారు. ఆయన సీఎం ముందు మాత్రమే సరెండర్ అవుతానని షరతు పెట్టడం గమనార్హం. గతేడాది డిసెంబర్‌లో ఆయన భార్య తారక్క గడ్చిరోలిలో సరెండర్ అయింది. ఇటీవల మల్లోజుల కోటేశ్వరరావు భార్య సుజాత తెలంగాణలో లొంగిపోయింది. కోటేశ్వరరావు 2011లో ఎన్‌కౌంటర్‌లో మరణించారు. వేణుగోపాల్ ఆయన రెండో అన్న. తెలంగాణకు చెందిన వేణుగోపాల్ లొంగుబాటుకు మహారాష్ట్రను ఎంచుకోవడం ఆసక్తికరం. సీఎం ఫడ్నవీస్ మాట్లాడుతూ, మహారాష్ట్ర ప్రభుత్వం సరెండర్ అయినవారికి



ఉద్యోగాలు, నివాసం, సదుపాయాలు కల్పిస్తుందని హామీ ఇచ్చారు. లాయిడ్ స్టీల్ కంపెనీ లొంగిపోయిన మావోయిస్టులకు ఉద్యోగాలు ఇస్తుంది, ఇప్పటికే 70 మంది పనిచేస్తున్నారు. తాజాగా సరెండర్ అయినవారికి 6 నెలలు వృత్తి పరంగా శిక్షణ ఇచ్చి, షేర్‌హోల్డర్లుగా చేస్తామని కంపెనీ ప్రతినిధి ప్రభాకరన్ తెలిపారు. ఇది ప్రభుత్వ రీహాబిలిటేషన్ పాలసీల విజయాన్ని సూచిస్తుంది. కానీ విమర్శకులు ఇది తాత్కాలిక ఆకర్షణ మాత్రమేనని అంటున్నారు. లొంగిపోయిన వారు సమాజంలో పూర్తిగా సమైక్యమవుతారా లేక పాత ఇడియాలజీకి తిరిగి వెళ్తారా అనేది ప్రశ్న. వేణుగోపాల్ 45 ఏళ్ల పార్టీ ప్రస్థానం ఆసక్తికరం. 1956లో తెలంగాణ పెద్దపల్లిలో జన్మించిన ఆయన, తండ్రి వెంకటయ్య ప్రభావంతో నక్సల్ బాట పట్టాడు. అన్న కోటేశ్వరరావు (కిషన్‌జీ) తర్వాత పీపుల్స్ వార్‌లో చేరాడు. 1981లో ఫుల్‌టైమర్‌గా అజ్ఞాతంలోకి వెళ్లాడు, 1992లో దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సెక్రెటరీగా, 2007లో పొలిట్‌బ్యూరో సభ్యుడిగా ఎదిగాడు. 2011లో చెరుకూరి రాజ్‌కుమార్ (ఆజాద్) మరణం తర్వాత అధికార ప్రతినిధిగా పనిచేశాడు. తల్లి 2022లో మరణించినా అంత్యక్రియలకు రాలేదు. ఇప్పుడు సరెండర్ చేయడం మావోయిజం ఆదర్శాల ఆచరణలో వచ్చిన మార్పును సూచిస్తుంది. ఈ సరెండర్ తర్వాత వరుస పరిణామాలు జరిగాయి. తెలంగాణలో మావోయిస్టు తెలంగాణ స్టేట్ కమిటీ మెంబర్ బండి ప్రకాశ్ (అలియాస్ ప్రభాత్) డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో లొంగిపోయాడు. 40 ఏళ్లకు పైగా దండకారణ్యంలో ఉన్న ఈ బెల్లంపల్లి వాసి, తీవ్ర అనారోగ్యం కారణంగా పార్టీ వీడాడు. మావోయిస్టు అనుబంధ సంస్థ సింగరేణి కార్మిక సమాఖ్యలో మాజీ కార్యదర్శి అయిన ప్రకాశ్, మల్లోజుల వేణుగోపాల్ ఆయుధాలు వదులుకోవాలన్న వాదనను సమర్థించాడు. ఇది పార్టీలో అనారోగ్యం, వయస్సు సమస్యలు సరెండర్లకు కారణమవుతున్నాయని చూపిస్తుంది. మరోవైపు, ఛత్తీస్‌గఢ్‌లో 50 మంది మావోయిస్టులు ఉత్తర బస్తర్ అడవుల నుంచి కాంకేర్ జిల్లాలోని కామ్‌తేరా బీఎస్ఎఫ్ క్యాంపుకు చేరుకున్నారు. వీరిలో డీకేఎస్‌జడ్సీ సభ్యుడు రాజ్‌మన్ (కందగట్ల యాదగిరి), మిలిటరీ చీఫ్ రాజు సలామీ (శివప్రసాద్) సహా 32 మహిళలు ఉన్నారు. 49 ఆయుధాలతో వచ్చిన వీరిలో ఒక రీజనల్ కమిటీ సభ్యుడు, 5 వ, డివిజన్ కమిటీ సభ్యులు, 21 ఏరియా కమిటీ సభ్యులు ఉన్నారు. ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయ్ సమక్షంలో వీరు సరెండర్ అవుతారని అంచనా. ఆశన్న (తక్కళ్లపల్లి వాసుదేవరావు), రనిత టీమ్ కూడా 50–70 మందితో సరెండర్ అవుతారనే ఊహాగానాలు ఉన్నాయి. ఇది జరిగితే, మావోయిస్టు చరిత్రలో అతిపెద్ద సరెండర్ అవుతుంది, 100–120 మంది లొంగిపోవచ్చు. ప్రధాన మీడియాలో ఈ సరెండర్లపై మిశ్రమ స్పందనలు వచ్చాయి. టైమ్స్ ఆఫ్ ఇండియా దీనిని "50 ఏళ్ల మావోయిస్టు ఉద్యమం ముగింపు" అని వర్ణించింది. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ "రాజకీయ–ఆదర్శవాద విజయం" అని పేర్కొంది. హిందూ పత్రిక వేణుగోపాల్ సరెండర్‌ను "పెద్ద దెబ్బ" అని చెప్పింది. ది ప్రింట్ ఆయన టెక్ సావీ, అగ్రనేత అయినా సరెండర్ చేయడాన్ని విశ్లేషించింది. కొంతమంది విమర్శకులు మావోయిజం "మాసెస్ నుంచి అన్యాయం" అని, పార్టీలో వెస్టెడ్ ఇంటరెస్ట్స్ ఉన్నాయని చెప్పారు.సోషల్ మీడియాలో కూడా హల్‌చల్. ఒక పోస్ట్ "మహారాష్ట్ర నక్సల్ ఫ్రీ" అని ప్రశంసించింది. మరొకటి అమిత్ షా వాగ్దానాన్ని గుర్తు చేసింది. కానీ కొన్ని పోస్టులు మావోయిజం ముగియడాన్ని సందేహించాయి, ప్రభుత్వ ఒత్తిడిని విమర్శించాయి. గణాంకాల ప్రకారం, 2025లో 1040 మావోయిస్టులు సరెండర్ చేశారు, గత ఏడాది 881తో పోలిస్తే పెరిగింది.రెండు రోజుల్లో 258 మంది లొంగిపోయారు. మావోయిజం 11 జిల్లాలకు పరిమితమైంది, మూడు మాత్రమే తీవ్రంగా ప్రభావితమయ్యాయి. ఛత్తీస్‌గఢ్‌లో 836 అరెస్టులు, 1639 సరెండర్లు జరిగాయి. ప్రభుత్వం 2026 నాటికి మావోయిజం అంతం చేస్తామని వాగ్దానం చేసింది. కానీ విమర్శనాత్మకంగా చూస్తే, సరెండర్లు పెరిగినా, మూల కారణాలు (పేదరికం, అసమానతలు) పరిష్కరించకపోతే ఉద్యమం మళ్లీ తలేత్తవచ్చు. అంతర్గతంగా పార్టీ "మాసెస్ నుంచి దూరమైంది" అని వేణుగోపాల్ చెప్పాడు. రీహాబిలిటేషన్ పాలసీలు బలోపేతం చేయాలి. లేకపోతే ఇవి తాత్కాలిక విజయాలుగా మిగిలిపోతాయి.

# జ్ఞానపీఠ అవార్డు గ్రహీత రావూరి

ప్రతిష్టాత్మకమైన జ్ఞానపీఠ్ అవార్డు పొందిన మూడో తెలుగు రచయిత రావూరి భరద్వాజ. ఆయన కన్నా ముందు ఈ అవార్డు కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణకు, డాక్టర్ సి. నారాయణరెడ్డికి ఈ అవార్డు లభించింది. భరద్వాజ 2011లో త్రిపురనేని గోపీచంద్ పురస్కారాన్ని, 2009లో లోక్‌నాయక్ ఫౌండేషన్ సాహిత్య పురస్కారాన్ని, 2012లో జ్ఞానపీఠ పురస్కారాన్ని అందుకున్నారు.రావూరి భరద్వాజ (జూలై 5, 1927– (అక్టోబరు 18, 2013) తెలుగు లఘు కథా రచయిత, నవలా రచయిత, రేడియోలో రచయితగా పేరు తెచ్చు కున్నారు. గొప్ప భావుకుడైన తెలుగు కవి, రచయిత. రావూరి భరద్వాజ 37 కథా సంపుటాలు, 17 నవలలు, 6 బాలల మినీ నవలలు, 5 బాలల కథా సంపుటాలు, 3 వ్యాస, ఆత్మకథా సంపుటాలు, 8 నాటికలు, ఐదు రేడియో కథానికలు రచించారు. ఈయన బాల సాహిత్యంలో కూడా విశేషకృషి సలిపారు. సినీ పరిశ్రమలో తెరవెనుక జీవితాన్ని కళ్లకు కట్టినట్టు చిత్రీకరించిన పాకుడు రాళ్ళు నవల భరద్వాజ యొక్క ఉత్కృష్ట రచనగా పరిగణింపబడుతుంది. ఆయన రచనలలో జీవన సమరం మరో ప్రముఖ రచన. తెలుగు రచనా ప్రపంచంలో వినూత్న సాహితీ ప్రక్రియకు శ్రీకారం చుట్టిన ఘనుడాయన. ఆడంబరాలు లేని సాధారణ జీవితం ఆయనది. భరద్వాజకు దిగువ మధ్యతరగతి, పేదప్రజల భాషపై గట్టిపట్టు ఉంది. ఒక బీద కుటుంబంలో జన్మించిన భరద్వాజ కేవలం ఉన్నత పాఠశాల స్థాయి వరకే చదువు కున్నారు. ఆ తరువాత కాయకష్టం చేసే జీవితాన్ని ప్రారంభించారు. చిన్న తనంలో పొలాల్లో గడిపిన భరద్వాజ వ్యవసాయ కూలీల కఠినమైన జీవన పరిస్థితులను గమనించే వారు. అప్పుడే పల్లె ప్రజల భాష, యాస, ఆవేశాలు, ఆలోచనలు, కోపాలు, తాపాలు గమనించిన భరద్వాజ ఆ అనుభవాలను తర్వాత కాలంలో తన రచనలలో నిజమైన పల్లె వాతావరణాన్ని సృష్టించడానికి ఉపయోగించుకున్నారు. 2013 అక్టోబరు 18న రావూరి భరద్వాజ తిరిగిరాని లోకాలకు తరలి వెళ్ళారు. రావూరి 1927 జూలై 5వ తేదీన కృష్ణా జిల్లా లోని నందిగామ తాలూకా కంచికచర్ల సమీపంలోని మోగులూరు (నాటి హైదరాబాదు సంస్థానంలోని) గ్రామంలో రావూరి కోటయ్య, మల్లికాంబ దంపతులకు జన్మించారు. ఆయన విద్యాభ్యాసం 8వ తరగతి వరకే సాగింది. తొలి నాళ్ళలో రావూరి భరద్వాజపై చలం ప్రభావం ఎక్కువగా ఉండేది. యుక్త



వయసులోనే తెనాలిచేరి అక్కడ ఒక ప్రెస్సులో పనిచేయటం ప్రారంభించారు. 1946లో నెల్లూరులోని జమీన్ రైతు వారపత్రిక సంపాదక వర్గంలో చేరారు. 1948లో దీనబంధు వారపత్రికకు బాధ్యులుగా ఉన్నారు. జ్యోతి,సమీక్ష, అభిసారిక, చిత్రసీమ, సినిమా, యువ పత్రికల్లో 1959వరకు కొన్నాళ్ళు ఫౌంటెన్ పెన్నుల కంపెనీలో సేల్స్‌మన్‌గా పని చేశారు. అక్కడ యజమాని అమానుషత్వాన్ని భరించలేక రాజీనామా చేసి కొన్నాళ్ళపాటు ఖాళీగా ఉన్నారు. ఆ తర్వాత హైదరాబాదు ఆకాశవాణి కేంద్రంలో 1959లో ప్రూఫ్ రీడింగ్ కళాకారునిగా చేరి చివరకు 1987లో ప్రసంగ కార్యక్రమాల ప్రయోక్తగా పదవీ విరమణ చేశారు. రావూరి భరద్వాజ గురించి చాలాకాలం పరిశోధన చేసి, రచనల గురించి సమగ్రమైన పరిశీలన చేసిన బొగ్గుల శ్రీనివాస్ ప్రకారం భరద్వాజ సుమారు 187 పైగా పుస్తకాలను వెలువరించారు, 500 పైగా కథలను 37 సంకల నాలుగా, 19 నవలలు, 10 నాటకాలు వ్రాశారు. భరద్వాజ తన తొలి కథ ఒకప్పుడును 16 ఏళ్ల ప్రాయంలో వ్రాశారు. ఇది జానపద శైలిలోసాగే కథ. భరద్వాజపై చలం ప్రభావం మెండుగా ఉంది. చలాన్ని అనుకరిస్తూ ఈయన అనేక సెక్సు కథలు వ్రాశారు. త్వరలోనే సెక్సు కథలు వ్రాయటంలో అందెవేసిన చెయ్యి అనిపించుకున్నారు. అనేక పత్రికలు ఆ వ్యాసంగంలో ఈయన్ను ప్రోత్సహించాయి. ఏ మాత్రం సంకోచం, జంకు లేకుండా జీవనోపాధికై ఆయన అనేక కథలు వ్రాశారు. 1983లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును పొందారు. నాలోని నీవు, అంతరంగిణి, ఒక ఏకాంతం, ఒకింత వేకువ కోసం వంటి కవితా సంకలనాలు రచించారు. భరద్వాజ రచించిన కౌముది, హిందీ, గుజరాతీ భాషల్లోకి అనువాద మైంది. ఆత్మగతం, బానుమతి, దూరపు కొండలు, జీవనాడి, మనోరత్నం, నీరు లేని నది, సశేషం, స్వప్న సీమలు, స్వర్ణ మంజరి వంటి 11 నాటకాలు రచించారు. బాల సాహిత్యానికి సంబంధించి 33 పుస్తకాలు రచించారు. పిల్లల కోసం ఏడు నవలలు రాశారు. విచిత్రమైన మానవ భావోద్వేగాలే ప్రధానాంశాలుగా కథలు వ్రాసే భరద్వాజ శైలిసరళమైనది. పాత్ర చిత్రీకరణలో, ఒక సన్నివేశాన్ని పరిచయం చేయటంలో రావూరి భరద్వాజకు ఉన్న ప్రజ్ఞ అద్భుతమైనది. రావూరి భరద్వాజ పేరు ప్రఖ్యాతులు తెచ్చిన రచనల్లో ముఖ్యమైనది, చలనచిత్ర పరిశ్రమను వస్తువుగా చేసుకొని తెలుగులో వెలువడిన మొట్ట మొదటి నవల పాకుడు రాళ్లు. భరద్వాజ దీనికి మాయ జలతారు అని నామకరణం చేశారు. అయితే శీలా వీర్రాజు పాకుడురాళ్లు అనే పేరు పెట్టాడు. మల్లంపల్లి సోమశేఖర శర్మ, ముదిగొండ సుబ్రహ్మణ్య శర్మల ప్రోత్సాహంతో రావూరి భరద్వాజ తాను అంతకు ముందే రాసిన 'పాలపుంత' అనే ఓ పెద్ద కథని పాకుడురాళ్లు నవలగా రాశారు. మూడు సంవత్సరాల పాటు కృష్ణా పత్రికలో ధారావాహికగా వెలువడిన పాకుడురాళ్లు నవలపై శ్రీకృష్ణదేవ రాయ, శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయాల్లో పరిశోధనలు జరగడం విశేషం. రావూరి భరద్వాజకు 1980లో ఆంధ్ర విశ్వ విద్యాలయం, 1987లో జవర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వ విద్యాలయం, 1991లో నాగార్జున విశ్వ విద్యాలయం గౌరవ డాక్టరేట్లు ప్రదానం చేసి గౌరవించాయి. 1980లో కళాప్రపూర్ణ – ఆంధ్ర విశ్వవిద్యాలయం,1983లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం, 1985లో సోవియట్ భూమి నెహ్రూ పురస్కారం ఇనుక తెర వెనకకు లభించింది. 1987లో రాజాలక్ష్మీ ఫౌండేషన్ అవార్డు,1987లో తెలుగు కళాసమితి కె.వి.రావు, జ్యోతిరావు అవార్డు, 1997లో తెలుగు విశ్వ విద్యాలయం నుండి సాహిత్యలో విశిష్ట పురస్కారం, 2007లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కళారత్న అవార్డు, 2008లో లోక్ నాయక్ ఫౌండేషన్ పురస్కారం, (వినూత్న సాహితీ ప్రక్రియ కల్పించినందుకు, డిసెంబరు 4 వ తేదీన ప్రకటించారు), 2011లో కేంద్ర సాహిత్య అకాడమీ, వంగూరి ఫౌండేషన్, గోపీచంద్ జాతీయ సాహిత్య పురస్కారాలు లభించాయి. 2012లో జ్ఞానపీఠ అవార్డు తెలుగు సాహిత్యానికి ఆయన చేసిన బహుముఖమైన కృషికి దక్కింది.

## తెలంగాణ జాగృతిలో ఉప్పల్ నియోజకవర్గం నుండి భారీ చేరికలు..




**ఉప్పల్,అక్టోబర్17(సూర్యరేఖ)**చిల్కానగర్ డివిజన్ యువ నాయకుడు శ్రామన్ దేవ్ తన అనుచరులతో కలిసి ఉప్పల్ నుండి ర్యాలీగా బయలుదేరి బంజారాహిల్స్ లోని జాగృతి రాష్ట్ర కార్యాలయంలో జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సమక్షంలో శుక్రవారం జాగృతిలో చేరారు.యువత ఆశయాలకు అనుగుణంగా కవిత చేస్తున్న పోరాటాలు సామాజిక తెలంగాణ సాధనలో ఆమె చేస్తున్న కృషికి ఆకర్షితుడై,జాగృతి ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గోపు సదానంద్ సమక్షంలో చేరిక జరిగింది.ఈ సందర్భంగా శ్రామన్ దేవ్ మాట్లాడుతూ...రాబోయే రోజుల్లో జాగృతి నిర్వహించే ప్రతి కార్యక్రమంలో చురుకుగా పాల్గొంటానని,స్థానిక సమస్యలపై పోరాడతానని తెలిపారు.అలాగే బీసీ బిల్లు సాధన కోసం కవిత తీసుకున్న నిర్ణయానికి అంకితభావంతో కట్టుబడి ఉంటానని తెలిపారు. ఉప్పు సదానంద్ ఆధ్వర్యంలో దాదాపు 300 మంది యువత జాగృతిలో చేరారు.

## ఉద్యోగుల సంక్షేమ విషయంలో జాప్యం వద్దు.

ఏరియా జిఎం ఎన్.రాధాకృష్ణ




**మందమర్రి,అక్టోబర్17(సూర్యరేఖ)** సింగరేణి ఉద్యోగుల సంక్షేమ కార్యక్రమాల విషయంలో ఎటువంటి ఆలస్యం జరగరాదని ఏరియా జనరల్ మేనేజర్ ఎన్.రాధాకృష్ణ సూచించారు.శుక్రవారం జనరల్ మేనేజర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఏరియా జిఎం ఎన్.రాధాకృష్ణ అధ్యక్షతన పర్సనల్ డిపార్ట్మెంట్, సంక్షేమ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మందమర్రి ఏరియాలోని సింగరేణి ఉద్యోగుల సంక్షేమ కార్యక్రమాలు,హెల్త్ కార్డుల వివరాలు ఉద్యోగుల గైర్హాజరు తదితర అంశాలను,అన్ని గనుల డిపార్టుమెంట్ల సంక్షేమ అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...జీరో పెండెన్సీ దిశగా అందరూ కృషి చేయాలని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, ఎస్.ఇ ఐ.ఈ.డి కిరణ్ కుమార్,మందమర్రి ఏరియా అన్ని గనుల డిపార్ట్మెంట్ల సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

## దశదిన కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే సునితారెడ్డి




**కొల్చారం,అక్టోబర్17(సూర్యరేఖ)** వెల్దుర్తిలో పుణ్యం బెస్త నర్సమ్మ దశ దిన కార్యక్రమానికి ఎమ్మెల్యే సునితారెడ్డి శుక్రవారం హాజరై ఘన నివాళులు అర్పించారు.ఆమె వెంట బీఆర్ఎస్ శ్రేణులు,మాజీ జెడ్పీటీసీ రమేష్ గౌడ్, నాయకులు సత్యంగౌడ్,వెన్నవరం మోహన్ రెడ్డి,శ్రీనివాస్ రెడ్డి,సమీర్ సాకేత్ నియోజకవర్గ స్థాయి ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు.

## బచ్చురాజుపల్లిలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం..



**నిజాంపేట,అక్టోబర్17(సూర్యరేఖ)** మండల పరిధిలోని బచ్చురాజుపల్లి గ్రామంలో శుక్రవారం ఎంపీడీవో రాజిరెడ్డి ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని చేపట్టారు.గ్రామంలో ఇంటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకున్నట్లయితే రోగాలు దరిచేరని తెలిపారు.అనంతరం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పర్యవేక్షించారు. ఇండ్ల నిర్మాణం త్వరితగతిన చేపట్టాలని,విడుదల వారీగా ఇంటి నిర్మాణం చేపడుతున్నటువంటి లబ్ధిదారులకు డబ్బులను వారి ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో గ్రామకార్యదర్శి రాము,వివోఏమంజుల,అంగన్వాడి టీచర్ వీణ,నాయకులు శ్రీనివాస్ నాయక్, గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.

## కూతురు వివాహానికి మంత్రి పొన్నం ప్రభాకర్ ను ఆహ్వానించిన కాంగ్రెస్ నేత జనంపల్లి వెంకటేశ్వర రెడ్డి



**ఉప్పల్,అక్టోబర్17(సూర్యరేఖ)** ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకులు జనంపల్లి వెంకటేశ్వరరెడ్డి కూతురు మేఘనరెడ్డి వివాహం ఈనెల29వ తేదీ సాగర్ రోడ్ లోని బిఎంఆర్ కన్వెన్షన్ లో జరిగే వివాహానికి హాజరుకావాలని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ను మర్యాదపూర్వకంగా కలిసి వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు.మంత్రిని జనంపల్లి వెంకటేశ్వర రెడ్డి సాదరంగా ఆహ్వానించగా హాజరవుతానని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ మాజీ కార్యదర్శి గడ్డం రవికుమార్ పాల్గొన్నారు.

## శ్రీరాజరాజేశ్వర పిల్లల ఆసుపత్రి వైద్యుల సేవలతో బాలుడు కోలుకున్నాడు..



**రామాయంపేట,అక్టోబర్15(సూర్యరేఖ)**రామాయంపేట పట్టణంలోని శ్రీరాజరాజేశ్వర పిల్లల ఆసుపత్రి,కంటి ఆసుపత్రి వైద్యులు మరోసారి తమ వైద్య నైపుణ్యాన్ని చాటుకున్నారు.జ్వరంతో బాధపడుతూ,ప్రమాదకరంగా ప్లేట్లెట్స్ కౌంట్ తగ్గిన గజ్వేల్ మండలం లింగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన రిత్విక్ నందన్ 7సంవత్సరాల బాలుడిని విజయవంతంగా చికిత్స చేసి ఆరోగ్యవంతుడిగా మార్చారు.తీవ్ర జ్వరంతో ఆసుపత్రిలో చేరిన బాలుడి పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా ఉండగా, పీడియాట్రిషియన్ డాక్టర్ ప్రదీప్ రావు పర్యవేక్షణలో వైద్య బృందం ప్రత్యేక చికిత్సా విధానాలతో సేవలు అందించారు.వైద్యుల కృషి ఫలితంగా బాలుడి ప్లేట్లెట్స్ కౌంట్ సాధారణ స్థాయికి చేరుకుంది.ఆరోగ్యం పూర్తిగా మెరుగుపడటంతో శుక్రవారం బాలుడిని డిశ్చార్జి చేశారు.ఈ సందర్భంగా బాలుడి తల్లిదండ్రులు మాట్లాడుతూ... తమ కుమారుడికి ఉత్తమ వైద్యం అందించి ప్రాణం కాపాడిన డాక్టర్ ప్రదీప్ రావు మరియు ఆసుపత్రి సిబ్బందికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.పట్టణ ప్రజలు మాట్లాడుతూ...అత్యవసర సమయాల్లో శ్రీరాజరాజేశ్వర ఆసుపత్రి అందిస్తున్న వైద్య సేవలు ఇటువంటి నిబద్ధత కలిగిన వైద్యులు రామాయంపేటకు గర్వకారణమని ప్రశంసించారు.

## నేడు తలపెట్టిన బీసీ రిజర్వేషన్ల బంద్ ను విజయవంతం చేయండి..

కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు పరమేశ్వర్ రెడ్డి పిలుపు



**ఉప్పల్,అక్టోబర్17 (సూర్యరేఖ)**బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.సిఎం రేవంత్ రెడ్డి,టీపీసీసీ అధ్యక్షులు మహేష్ గౌడ్,లు కామారెడ్డి బీసీ డిక్లరేషన్,కు కట్టుబడి ఇదే అంశంపై అసెంబ్లీలో తీర్మానం చేయించి హైకోర్టు,సుప్రీంకోర్టు వరకు కొట్లాడుతున్నారని గుర్తు చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల పక్షాన నిలబడి 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని,అన్ని రకాలుగా ప్రయత్నాలు చేస్తుందని హైకోర్టు ఆదేశాల వల్లే నిలిచిపోయిన విషయాన్ని బీసీ వర్గాలకు తెలుసని ఏది ఏమైనా కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతాన్ని అమలు చేసి తీరుతుందని వెల్లడించారు.బీసీ రిజర్వేషన్ అమలుపై రాష్ట్ర క్యాబినెట్ సరియైన నిర్ణయం తీసుకుంటుందని ఆయన పేర్కొన్నారు.ఇదే డిమాండ్ పై నేడు జరగబోయే రాష్ట్ర బంద్ లో ఉప్పల్ నియోజకవర్గం లోని అన్ని డివిజన్ల పరిధిలో అధ్యక్షుల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## పిఆర్టియుటిఎస్ మండల కమిటీ ఎన్నిక..



**నిజాంపేట,అక్టోబర్17(సూర్యరేఖ)** మండల కేంద్రంలో శుక్రవారం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.మండల అధ్యక్షునిగా ఇప్పశ్రీకాంత్ రెడ్డి,ని ఏకగ్రీవంగా ఎన్నుకొని శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా పిఆర్టియుటిఎస్ గౌరవ అధ్యక్షులు సబ్బని శ్రీనివాస్,ఎన్నికల అధికారిగా రామాయంపేట అధ్యక్షులు వెంకట్ రెడ్డి, నిజాంపేట మండల ప్రధాన కార్యదర్శి రాందేవ్ వెంకటేష్,రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు దేశరాజు,రమేష్ బాబు, మండల అసోసియేట్ అధ్యక్షులు శ్రీకొండపర్తి శ్రీనివాస్ చారి, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్,ప్రాథమిక సభ్యులుదేవయ్య,నేరెళ్ల శ్రీనివాస్,జెల్ల శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న బాకీ కార్డుల పంపిణీ..



**నిజాంపేట,అక్టోబర్17(సూర్యరేఖ)** కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిందని ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ నిజాంపేట మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు బాకీ కార్డుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు.కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల విషయంలో విఫలమైందని ప్రజలకు ఇచ్చినటువంటి హామీలను నెరవేర్చగా పబ్బం కడుతున్న కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ప్రజలు తగిన గుణపాఠం చెప్తారన్నారు. బాకీ కార్డుల పంపిణీ విషయంలో గ్రామాలలో కాంగ్రెస్ నాయకులను తప్పకుండా నిలదీస్తామని హామీ ఇచ్చారని. బీఆర్ఎస్ పార్టీకి అపూర్వ స్పందన లభిస్తుందన్నారు.రానున్న రోజుల్లో బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు పట్టం కడతారని వారు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మాజీ ఎంపీపీ బిజ్జాసంపత్, మాజీ సర్పంచ్ తిరుమల గౌడ్,మాజీ ఎంపిటిసిలు బాల్ రెడ్డి, వెంకట స్వామి నాయకులు ఆకుల మహేష్,చంద్రయ్య,బండారి తిరుమల్, ఫాజిల్, మహేష్,తదితరులు పాల్గొన్నారు.

## అన్ని పార్టీలు రాష్ట్ర బంద్ లో పాల్గొంటే ఎవరిపై యుద్ధం.?


జమాల్ పుర గంగాధర్

**నాంపల్లి,హైద్రాబాద్,అక్టోబర్17(సూర్యరేఖ)** తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీసీ జేఏసీ ఈ నెల18న రాష్ట్ర బంద్ కు పిలుపునిచ్చింది.ఈ బంద్ కు కాంగ్రెస్,బీఆర్ఎస్,బీజేపీతో సహా అన్ని పార్టీలు మద్దతు ఇవ్వడంతో,అసలు ఎవరిపై నిరసన అన్నది ప్రశ్నగా మారిందని రాజకీయ విశ్లేషకులు,ప్రొఫెసర్ జమాల్ పూర్ గంగాధర్ అన్నారు.ఈ సందర్భంగా జమాల్ పూర్ గంగాధర్ మాట్లాడుతూ... న్యాయపరమైన రాజ్యాంగపరమైన అడ్డంకులే రిజర్వేషన్లకు ప్రధాన సమస్యగా విశ్లేషకులు చెబుతున్నారని తెలిపారు.ప్రభుత్వం బిల్లు చేసి గవర్నర్,రాష్ట్రపతి ఆమోదం పొందినా,కోర్టులు వాటిని చెల్లుబాటు కాదని తీర్పు ఇచ్చాయి. రాజకీయ అంశం కాకుండా న్యాయ పరిమితులే అడ్డుకట్టగా ఉన్నాయని బంద్ తో ప్రజలకు ఇబ్బందులు తప్ప ప్రయోజనం ఉండదని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.విశ్లేషకులు చెబుతున్నది మాత్రం అన్ని రాజకీయ పార్టీలు తమ తమ అస్తిత్వాన్ని ప్రదర్శించుకోవడానికి,బీసీ ప్రజల దృష్టిని తమ వైపు మరల్చుడానికి ఓ బాట సారి ఇటు చూడు అన్న చందంగా ప్రజలను తమ వైపు మరల్చుకోవడాని ప్రయత్నిస్తుంన్నాయన్నాయని జమాల్ పూర్ గంగాధర్ అన్నారు.



## ఆదమరిస్తే అంతే సంగతి.!

**నిజాంపేట,అక్టోబర్17 (సూర్యరేఖ)**మండల కేంద్రంలోని మల్కా చెరువు మత్తడి వద్ద ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వంతెన కొట్టుక పోవడం జరిగింది.వంతెన వద్ద అధికారులు తాత్కాలికంగా మట్టి పోయించి రాకపోకలను పునరుద్ధరించిన ఇరువైపులా సేఫ్టీ లేకుండా పోయింది. ప్రయాణికులు రోడ్డు బాగుందని ఆదమరిస్తే పోతే అంతే సంగతి అంటున్నారు.ఇకనైనా అధికారులు చొరవ చూపి రోడ్డు సైడ్ ఇరువైపులా ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని లేదా కట్టెలను పాతి తాడును కట్టేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుచున్నారు.



# బీసీ బంద్ ను విజయవంతం చేయాలి







**బీసీ సంక్షేమ మండల అధ్యక్షులు మావురం రామచంద్రం..**

**నిజాంపేట,అక్టోబర్17(సూర్యరేఖ)** స్థానిక ఎన్నికల్లో 42 శాతం బిసి రిజర్వేషన్ నిలుపుదల చేయడంపై రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ఇచ్చిన పిలుపుమేరకు శనివారం బంద్,ను విజయవంతం చేయాలని నిజాంపేట బీసీ సంక్షేమ మండల అధ్యక్షులు మావురం రామచంద్రం పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రైవేటు విద్యా సంస్థలు బంద్,కు మద్దతు తెలపాలని కరపత్రాలను అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ప్రకటించినప్పటికీ హైకోర్టు సుప్రీంకోర్టు కొట్టి వేయడంపై బీసీ సంఘాలు అసంతృప్తి వ్యక్తం చేశాయన్నారు.రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ఎన్నికల్లో బీసీలకు కల్పిస్తామన్న42శాతం రిజర్వేషన్లతో ఎన్నికలకు వెళ్లాలని ఆయన ప్రభుత్వాన్నికి డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ నాయకులు జీడి చంద్రకాంత్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాణాలతో కూడిన విద్య,వైద్యం పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం





**మక్తల్ లో ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించిన రాష్ట్ర మంత్రులు రాజనర్సింహ,వాకిటి శ్రీహరి**

**నారాయణపేట,అక్టోబర్17(సూర్యరేఖ)** తెలంగాణ రాష్ట్రంలో ప్రమాణాలతో కూడిన విద్య,మెరుగైన వైద్యం,పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ సాంకేతికశాఖ,జిల్లా ఇంచార్జీ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు.గత ప్రభుత్వ హయంలో ప్రజలకు సంక్షేమ పథకాలు అందలేదని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత పేదలకి సన్న బియ్యం,నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లను రాజకీయాలకు అతీతంగా మంజూరు చేస్తోందని తెలిపారు.రాష్ట్ర మత్స్యశాఖ ఆధ్వర్యం లో ఉచిత చేపపిల్లల పంపిణీ కార్లక్రమంలో భాగంగా శుక్రవారం మక్తల్ మండల పరిధిలోని సంఘం బండ (దివంగత చిట్టెం నర్సిరెడ్డి బ్యాలెన్సింగ్)రిజర్వాయర్ తోపాటు మక్తల్ పట్టణంలోని పెద్దచెరువు మిని ట్యాంక్ బండ్ లో చేప పిల్లలను మత్స్యశాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరితో కలిసి విడుదల చేశారు. తరువాత రూ.377లక్షల వ్యయంతో మక్తల్ మినీ ట్యాంక్ బండ్ సుందరీకరణ పనులకు మంత్రులుశంకుస్థాపన చేసి వన మహోత్సవంలో భాగంగా మినీ ట్యాంక్ బండ్ ఆవరణలో మొక్కలు నాటారు.ఆ తర్వాత అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రులు దామోదర రాజనర్సింహ,వాకిటి శ్రీహరి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ...తమ ప్రభుత్వంలో 100 శాతం రాయితీతో 26వేల చెరువుల్లో 88 కోట్ల చేపపిల్లలు,10 కోట్ల రొయ్య పిల్లలను" ఉచితంగా పంపిణీ"చేస్తున్నట్లు వెల్లడించారు. ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందినవాళ్ళతో తనకు అవినాభావ సంబంధం ఉందని,తమ ప్రాంతాలు సంగారెడ్డి, జోగిపేట,సదాశివ పేటలలో ఆసామాజికవర్గానికి చెందిన వాళ్లు చాలా ఉన్నారన్నారు.బీసీ సమాజంలో నాయకత్వం ఎదగాలని తద్వారా వెనకబడ్డ కులాలకు బడుగు బలహీనవర్గాలకు సామాజికన్యాయం అందుతుందన్నారు. ఎస్సీ సామాజిక వర్గాల 30ఏళ్ల పోరాటానికి చరమ గీతం పాడి వర్గీకరణ కల నెరవేర్చింది కాంగ్రెస్ పార్టీ అని,సామాజిక న్యాయం కాంగ్రెస్ తోనే సాధ్యం అన్నారు.బీసీ సమాజం లో నూటికి నూరు శాతం కమిట్మెంట్ ఉన్న నాయకుడు వాకిటి శ్రీహరి అని,ముదిరాజ్ కులంలో పుట్టిన శ్రీహరి ఆజాతికే గర్వకారణం అని కొనియాడారు.గతంలో ఈ ప్రాంతానికి వచ్చిన సందర్భంగ తన శాఖకు సంబంధించి అనేక అభివృద్ధి పనులు మంజూరు చేయడం జరిగిందని,ఆయన గుర్తు చేశారు.ఇక పై ప్రతీ 30 కిలో మీటర్లకు ఒక డయాలసిస్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని,వైద్య ఆరోగ్యశాఖ నిర్ణయం తీసుకుందని,జాతీయ రహదారులపై ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువ ఉంటుందని,అలాంటి బ్లాక్ పాయింట్ల వద్ద ట్రామా సెంటర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకోవడం జరిగిందని,ఈ ఏడాదిలో డిసెంబర్ లో ట్రామా సెంటర్లు అందుబాటులోకి వస్తాయని మంత్రి చెప్పారు. గతంలో తాను ఇచ్చిన హామీ మేరకు 6 నెలల్లో మహబూబ్ నగర్ లో క్యాన్సర్ స్క్రీనింగ్ సెంటర్ ఎంఆర్ఐ సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు.నారాయణపేటలో 50 సీట్లతో ఇప్పటికే మెడికల్ కాలేజీ అందుబాటులోకి తీసుకొని వచ్చామని,మరో 9 నెలల్లో చికిత్స కోసం హైదరాబాద్ వరకు వెళ్లకుండా గ్రామాల్లోనే చికిత్సా అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఆయన తెలిపారు.సభలో మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ...బీద బడుగు బలహీనర్గా లకు న్యాయం చేసే పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు.పక్కన కృష్ణమ్మ పారుతున్నా గత పాలకుల నిర్లక్ష్యం వల్ల మక్తల్ ప్రాంతానికి నీళ్లురాలేదనీ,కాంట్రాక్టర్లను బతికించడానికే గత పాలకులు ప్రాజెక్టులు తెచ్చారని ఎద్దేవా చేశారు.గత పాలకుల మాట లే తప్ప,చేతలు లేవన్నారు.గత పాలకులు మైక్ పట్టుకున్న ప్రతిసారి జీవో 69,14 అని కాగితాలు చూపించి మాత్రమే కాలం గడిపారు తప్ప ప్రాజెక్టు పూర్తి చేయలేదనీ ధ్వజమెత్తారు.ఈ ప్రాంతం వెనుబాటు తనానికి గురి అయిందని గుర్తించి జీవో నెం 69,14 ద్వారా ఈ ప్రాంతం సస్యశ్యామలం కావాలని నారాయణపేట-మక్తల్-కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును పూర్తి చేసి ఈ ప్రాంతం అభివృద్ధి కావాలని కృషి చేస్తున్న వ్యక్తి మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని తెలిపారు.30 కిలోమీటర్ల దూరంలో కృష్ణమ్మ నీళు ఇస్తుంటే 330కిలోమీ టర్ల దూరం టెలర్స్ పెట్టడం జరిగిందనీ,కాంట్రాక్టర్లను బతికించడానికే గత పాలకులు ఈనిర్ణయం తీసుకున్నారని విమర్శించారు.పాలమూరు-రంగారెడ్డి కాలువల నీళ్లు ఇస్తాం అని కథలు చెప్పారు. తప్పప్రాజెక్టుపూర్తి చేయకపోగా,నారాయణపేట-మక్తల్-కొడంగల్ ప్రాజెక్టు పూర్తి చేస్తుంటే అడుగడుగునా అడ్డు కోవాలని చూస్తున్నారని వ్యాఖ్యానించారు.గతంలో చేప పిల్లల పంపిణీలో అక్రమాలు జరిగాయనీ,తాను బాధ్యతలు తీసుకున్న తరువాత మత్స్యశాఖను ప్రక్షాళన చేశానని చెప్పారు.చేపల పంపిణీ ద్వారా రూ.5 లక్షల కుటుంబాలకు ఉపాధి కలుగుతుందని,ఈ ఘనత తమ కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు.మక్తల్ నియోజకవర్గంలో 255 నీటి వనరులు ఉన్నా లంబాడీలయని వాటిలో 94 లక్షల చేప పిల్లలను వదలడం జరుగుతుందని దీనివల్ల 46మత్స్య సహకార సంఘాలలోని 4500 కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని ఆయన తెలిపారు.ఇది వరకే మక్తల్ నియోజకవర్గానికి 2 ఆసుపత్రులు ఆత్మకూరు 22 కోట్లతో నిర్మాణం మక్తల్ ప్రాంతంలో 42 కోట్లతో నిర్మాణం,2 డయాలసిస్ సెంటర్లు,5 అంబులెన్స్,కు అమరచింత మండల కేంద్రంలో ఉన్న ఆసుపత్రికి 23 మంది వైద్య శాఖ స్టాఫ్ ను మంత్రి దామోదర రాజనర్సింహ కేటాయించారని గుర్తు చేశారు.మన ప్రాంతానికి నిధులు కేటాయించడంలో చొరవ చూపిస్తున్న దామోదర రాజనర్సింహ మనజిల్లాకు ఇన్చార్జి రావడం చాలాసంతోషం అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్,ఎస్పీ డాక్టర్ వినీత్, ఎమ్మెల్యేలు డాక్టర్ చిట్టెం పర్నికారెడ్డి,మధుసూదన్ రెడ్డి,యెన్నం శ్రీనివాస్ రెడ్డి,ఈర్లపల్లి శంకర్,రాష్ట్ర మత్స్యశాఖ చైర్మన్ సాయి మత్స్యశాఖ డైరెక్టర్ నిఖిల,జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ వార్ల విజయకుమార్ జిల్లా మత్స్యశాఖ చైర్మన్ కాంత్ కుమార్ మత్స్యశాఖ జిల్లా అధికారి రహమాన్, మార్కెట్ కమిటీ చైర్మన్ లు,జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్లు,ప్రజా ప్రతినిధులు,పార్టీ ముఖ్యనాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నేటి రాష్ట్ర బంద్ లో బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలి..

**తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ కార్వాన్ నియోజకవర్గం సీనియర్ నాయకులు గున్నాల రంగారెడ్డి**



**నాంపల్లి,హైద్రాబాద్, అక్టోబర్17 (సూర్యరేఖ)** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తాము పార్టీ తలపెట్టిన నేటి రాష్ట్ర బంద్ కు అన్ని రాజకీయ పార్టీలు ప్రజా సంఘాలు,విద్య సంస్థలు,వ్యాపార సముదాయాలు, బీసీ సంఘాల నాయకులు సహకరించాలని తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ కార్వాన్ నియోజకవర్గం సీనియర్ నాయకులు గున్నాల రంగారెడ్డి పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా వారి నివాస కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గున్నాల రంగారెడ్డి మాట్లాడుతూ...స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ సంఘాలు చేపట్టే రాష్ట్రవ్యాప్త బంద్ కు బీఆర్ఎస్ పార్టీ తరపున సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు కార్వాన్ నియోజకవర్గం సీనియర్ నాయకులు గున్నాల రంగారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.42 శాతం రిజర్వేషన్ల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మోసం చేసిన విషయం అందరికి తెలిసిందేనని,రిజర్వేషన్ల అంశంపై న్యాయస్థానాల పేరుతో కాలయాపన చేస్తున్నదని ఆరోపించారు.బీసీ రిజర్వేషన్లపై రాజకీయం చేయకుండా వాటి అమలు కోసం కృషి చేయాలని సూచించారు. నేటి బంద్లో బీఆర్ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని గున్నాల రంగారెడ్డి పిలుపునిచ్చారు.

## ఏరియాను సందర్శించిన మానవ వనరుల హెచ్ ఆర్ డి జనరల్ మేనేజర్



**మందమర్రి,అక్టోబర్17(సూర్యరేఖ)** సింగరేణి మానవ వనరుల జనరల్ మేనేజర్ జి. వెంకటరమణారెడ్డి శుక్రవారం మందమర్రి ఏరియాను సందర్శించారు.అక్టోబర్ 31వ తారీఖున పదవీ విరమణ పొందబోతున్న వెంకటరమణారెడ్డిని జనరల్ మేనేజర్ ఎన్.రాధాకృష్ణ ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ...సింగరేణి సంస్థలో మానవ వనరుల అభివృద్ధికి వెంకటరమణారెడ్డి ఎంతో కృషి చేశారని, సింగరేణి సంస్థలో వివిధ హోదాలలో పనిచేసి సంస్థ పురోగతికి కృషి చేశారని,సంస్థలో పనిచేస్తున్న ఫ్రంట్ లైన్ సూపర్వైజర్లకు ఉద్యోగులకు శిక్షణ తరగతులను ఏర్పటు చేసి నూతన సాంకేతిక విధానాన్ని వారికి శిక్షణ తరగతులలో నేర్పించి రక్షణతో కూడిన ఉత్పత్తి ఉత్పాదకత సాధించడానికి తమ వంతు పాత్ర పోషించారని గుర్తు చేశారు.పదవి విరమణ అనంతరం వారి శేష జీవితం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని వారు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జిఎం.విజయ ప్రసాద్,కేకే ఓసి ప్రాజెక్టు అధికారి మల్లయ్య పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యాంసుందర్, ఐ.ఈ.డి ఎస్.ఈ కిరణ్,విటిసి మేనేజర్ శంకర్, పర్చేస్ అధికారి బాబు,సీనియర్ పి.ఓ సందీప్, సీనియర్ పిఓకార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## కెసిఆర్ కాలనీ సమస్యలు త్వరలో పరిష్కరిస్తా..

**కాలనీ అధ్యక్షులు కట్ట ప్రభాకర్**



**రామాయంపేట,అక్టోబర్17(సూర్యరేఖ)**రామాయంపేట మండల కేంద్రంలోని డబుల్ బెడ్ రూమ్ కేసీఆర్ కాలనీ సంఘం కార్యవర్గ సభ్యులు కాలనీవాసుల సమక్షంలో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షులు కట్ట ప్రభాకర్ మాట్లాడుతూ...గత కొద్ది రోజులుగా కాలనీలో ఉన్న సిసి రోడ్లు,డ్రైనేజీ పనుల సమస్యలను స్థానిక ఎమ్మెల్యే రోహిత్ రావు కు,టిపిసిసి సభ్యులు చౌదరి సుప్రభాతరావు దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పనులు పూర్తి చేస్తామన్నారు.కాలనీలో ఎలాంటి సమస్యలు ఉన్న అటు అధికారులకు ఇటు నాయకులకు తెలియజేసి తాను కాలనీ సమస్యలను పరిష్కరిస్తానన్నారు.కెసిఆర్ కాలనీలో ఎలాంటి సమస్యలు ఉన్న కాలనీవాసులు నేరుగా తనకు తెలియజేస్తే వెంటనే తాను పరిష్కారం చేసే దిశగానే కృషి చేస్తానన్నారు.ఈ సమావేశంలో కాలనీవాసులు సంఘం కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఆరోగ్యశాఖ జివికె ఈఎంఆర్ఐ సంయుక్త ఆధ్వర్యంలో సీపీఆర్ అవగాహన కార్యక్రమం..




**హైదరాబాద్,అక్టోబర్17(సూర్యరేఖ)** తెలంగాణ ప్రభుత్వం ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జివికె ఈఎంఆర్ఐ ఆధ్వర్యంలో సీపీఆర్ (కార్డియో పల్మనరీ రీసస్సిటేషన్)అవగాహన కార్యక్రమం డీఎంఈ బిల్డింగ్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది ఉద్యోగులు పాల్గొన్నారు.అందులో 40 మంది పాల్గొనేవారు సీపీఆర్ పద్ధతులపై ప్రాయోగిక శిక్షణ పొందారు. మానికిన్ల సాయంతో ప్రత్యక్ష ప్రదర్శనలు నిర్వహించడం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను రక్షించే విధానాలను వారికి చూపించారు. ఈ కార్యక్రమం ద్వారా అత్యవసర వైద్య సేవలపై అవగాహన పెంపొందించ డం గుండె సంబంధిత అత్యవసర సమయాల్లో తక్షణ స్పందన ఇవ్వగల నైపుణ్యాలను సిబ్బందికి అందించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. కార్యక్రమంలో ప్రముఖులు డా. కరుణశ్రీ జేడీ,ఎన్‌సీడీ ప్రోగ్రాం బి.సుధాకర్ స్టేట్ హెడ్ఆఫ్ ఆపరేషన్స్,జివికె ఈఎంఆర్ఐ, బ్రహ్మానంద రావు కన్సల్టెంట్,పీఎన్‌పీపీ ఎన్‌ఎచ్‌ఎమ్,డా.పృథ్వి,స్టేట్ ప్రోగ్రామ్ ఆఫీసర్, ఎన్‌సీడీ,భూమా నాగేందర్,ప్రోగ్రామ్ మేనేజర్,నవీన్ కుమార్,ఈఎంఈలు పాల్గొన్నారు.ప్రముఖులు జివికె ఈఎంఆర్ఐ సంస్థను ప్రశంసిస్తూ, సిబ్బందిలో అత్యవసర వైద్య పరిజ్ఞానాన్ని పెంపొందించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు అభినందనలు తెలిపారు.

## బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం..

**కొల్చారం మండలం మాజీ జెడ్పిటిసి సభ్యురాలు మేఘమాల సంతోష్ కుమార్..**



**కొల్చారం,అక్టోబర్17(సూర్యరేఖ)**నేడు నిర్వహిస్తున్న బీసీ బందును విజయవంతం చేయండి..బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దెదించాల్సిందేనని జెడ్పిటిసి సభ్యురాలు ముత్యంగారి మేఘమాల సంతోష్ కుమార్ అన్నారు.బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వచ్చే స్థానిక ఎన్నికలలో బుద్ధి చెప్పాలని,బీసీలను మోసం చేస్తున్న ఘనత కేవలం కాంగ్రెస్ పార్టీకి దక్కిందని ముత్యంగారి మేఘమాల సంతోష్ కుమార్ ఆరోపించారు.భారతీయ రాష్ట్ర సమితి శనివారం నిర్వహించే బందుకు ప్రతి ఒక్కరూ మద్దతు తెలిపాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు.కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం మంత్రులు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీల పట్ల మొసలి కన్నీరు కారుస్తున్నారని,ప్రతి దగ్గర బీసీలకు అన్యాయమే జరుగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎక్కడికక్కడ నిలదీయాలని,స్థానిక ఎన్నికలలో బీసీలు అంతా కలిసి కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని ఆయన అన్నారు. మండల వ్యాప్తంగా ఉన్న బీఆర్ఎస్ నాయకులు మద్దతుగా ముందుకు వస్తున్నారని శనివారం నిర్వహిస్తున్న బీసీ బంద్ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ గెలుపుతథ్యం..

**రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ కార్తీక్ రెడ్డి**



**మణికొండ,అక్టోబర్17(సూర్యరేఖ)** ప్రతిష్టాత్మకమైన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ పార్టీ గెలుపు ఖాయమని రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ కార్తీక్ రెడ్డి అన్నారు.ప్రజలు కాంగ్రెస్ పాలనతో విసిగిపోయారని వ్యాఖ్యానించారు.భారత రాష్ట్ర సమితి పార్టీ అభ్యర్థి మాగంటి సునీతా గోపినాథ్ గెలుపు కోరుతూ ప్రచార ప్రారంభోత్సవానికి ముందు రాజేంద్రనగర్ నియోజకవర్గానికి చెందిన మణికొండ మున్సిపాలిటీ, జూబ్లీహిల్స్ నియోజకవర్గ షేక్ పేట డివిజన్ కూడలిలో గల కనకదుర్గమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆయన అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ..ప్రజలు బీఆర్ఎస్ పార్టీ వైపే చూస్తున్నారన్నారు.ప్రజలు కాంగ్రెస్ పాలనపై విసిగిపోయారన్నారు.ఈ ఎన్నికలో వార్ వన్ సైడ్ ఉంటుందని,కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు.నియోజకవర్గం నుంచి సైతం పార్టీ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పార్టీ గెలుపుకు శ్రమించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మంజీర విద్యాలయంలో దీపావళి సంబరాలు



**రామాయంపేట,అక్టోబర్17(సూర్యరేఖ)** స్థానిక మంజీర విద్యాలయంలో ముందస్తుగా దీపావళి సంబరాలను అంబరాన్నంటే విధంగా నిర్వహించ డం జరిగింది.ఈ కార్యక్రమంలో భాగంగా వాసవి మాట్లాడుతూ...దీపావళి పర్వదినం గురించి విద్యార్థిని విద్యార్థులకు వివరించడం జరిగింది. భారతీయ సంస్కృతికి ప్రతిబింబంగా వెలుగొందేవే భారతీయ పండుగలు.దివ్యకాంతుల దీపావళి జగతిని జాగృతం చేసే చైతన్య దీప్తుల శోభావళి. నరకాసురుడు అనే రాక్షసుడుని సంహరించిన మరుసటి రోజు అతడి పీడ వదిలిన ఆనందంలో ప్రజలు దీపావళి చేసుకుంటారని పురాణాలు చెబుతున్నాయి.అలాగే లంకలోని రావణుడిని సంహరించి శ్రీరాముడు సతీసమేతంగా అయోధ్య కు తిరిగి వచ్చినప్పుడు కూడా ప్రజలు ఆనంద ఉత్సాహం మధ్య దీపావళిని జరుపుకున్నారని రామాయణం చెప్తుంది.చీకటిని పారద్రోలుతూ వెలుగులు తెచ్చే పండగ విజయానికి ప్రత్యేకగా దీపావళి పండుగ జరుపుకుంటారు.ప్రతి సంవత్స రం ఆశ్వయుజ అమావాస్య రోజున దీపావళి జరుపుకుంటారు. ముందు రోజు నరక చతుర్దశి జరుపుకుంటారు. దీపమాలికల శోభలతో వెలు గొందే గృహాలు ఆనంద కోలాహాలంతో వెలివేసే ఆబాల గోపాలం నూతన వస్త్రాల రెపరెపలు పిండి వంటల గుమగుమలు బాణాసంచా చప్పులు ఈ దివ్య దీపావళి సోయగాలు,దీపం జ్యోతి పరబ్రహ్మ దీపం సర్వతా మోపహమ్ దీపేన సాధ్యతే సర్వం సంధ్యా దీప నమోస్తుతి,దీపం బ్రహ్మత్వం మనోవి కాసానికి, ఆనందానికి నవ్వులకు సజ్జనత్వానికి సద్గుణ సంపత్తికి నిదర్శనంగా దీపాన్ని భావిస్తారు. అందుకే మహిళా మణులంతా ఆశ్వయుజ బహుళ చతుర్దశి నుంచి కార్తీక మాసం అంతా మట్టి ప్రమిదలలో దీపాలను వెలిగిస్తారు.ఇది సౌభాగ్యాని కి, సౌజన్యానికి, సౌశీల్యానికి, ప్రత్యేకంగా భావిస్తారు. దీపావళి రోజున మహాలక్ష్మి పూజను జరుపుకోవడానికి ఓవిశిష్టత ఉంది.శ్రీహరి వద్ద ఎప్పుడూ ఉండడం న్యాయమా అని ఇంద్రుడు లక్ష్మీదేవిని ప్రశ్నించగా,నన్ను త్రికరణ శుద్ధిగా ఆరాధించే భక్తులకు నేను అనుగుణంగా మహర్షులకు మోక్షలక్ష్మి రూపంగా,విజయాన్ని కోరేవారికి విజయలక్ష్మిగా,విద్యార్థులు నన్ను ఆరాధిస్తే విద్యాలక్ష్మిగా,ఐశ్వర్యాన్ని కోరి ఆరాధించే వారికి ధనలక్ష్మిగా,వారి సమస్త కోరికలు నెరవేర్చి వరలక్ష్మిదేవిగా ప్రసన్నరాలవుతానని సమాధానమిచ్చింది.అందుచేత దీపావళి రోజున మహాలక్ష్మిని పూజించే వారికి సర్వసంపదలు చేకూరుతాయని విశ్వాసం లక్ష్మీ పూజలు నిర్వహించి దీపాలు వెలిగించి టపాకాయలు కాల్చి పాఠశాలలో దీపావళి సంబరాలు నిర్వహించడం జరిగింది.ఇందులో పాఠశాల కరస్పాండ్ జితేందర్ రెడ్డి వాసవి,ప్రిన్సిపల్ సురేష్ మౌనిక,సౌమ్య,మీనా శ్రీనిత,అనిల్,శ్రీశైలం,తదితరులు పాల్గొన్నారు.

# కాప్రాలో ఘనంగా రేగళ్ల సతీష్ రెడ్డి జన్మదినోత్సవ వేడుకలు



**పారిశుద్ధ్య కార్మికులకు బట్టలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**





**ఉప్పల్,అక్టోబర్17(సూర్యరేఖ)** తెలంగాణ రాష్ట్ర యువజన విభాగం రాష్ట్ర నాయకులు రేగళ్ళ సతీష్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను ఆయన తన నివాసం వద్ద ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కల్వకుంట్ల రామారావు, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావులను కలిసి వారి ఆశీర్వాదం తీసుకోన్నారు.అనంతరం ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా కాప్రా సర్కిల్ మున్సిపల్ పారిశుద్ధ కార్మికులకు బట్టల పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత 16 సంవత్సరాలుగా తన పుట్టినరోజు సందర్భంగా పరిశుద్ధ కార్మికులకు బట్టలు ఇచ్చి భోజనాలు పెట్టి వారితో కలసి పుట్టినరోజు జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులు అడిషనల్ డీసీపీ వెంకటరమణ, కుషాయిగూడ ఇన్స్పెక్టర్ భాస్కర్ రెడ్డి,ఎస్సై సతీష్ మాజీ కార్పొరేటర్ పావనిరెడ్డి,పార్టీ నాయకులు, కాలనీల అధ్యక్ష కార్యదర్శులు,యువ సంఘాలు, నాయకులు పాల్గొని వారిని ఆశీర్వదించారు.

# రామంతాపూర్ ప్రభుత్వ హోమియోపతి వైద్య కళాశాలలో హోమియోపతి ఎక్స్ పో-2025 ప్రారంభం







**ఉప్పల్,అక్టోబర్17(సూర్యరేఖ)** ఎన్నో దీర్ఘ కాలిక వ్యాధులు హోమియోపతి ద్వారా నయమవుతు న్నాయని ప్రభుత్వ హోమియోపతి వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.లింగరాజు అన్నారు. హోమియోపతి వైద్యంలో తమ కళాశాలలో విద్యార్థులకు ఉత్తమ బోధన అందిస్తున్నట్లు చెప్పారు. శుక్రవారం హైదరాబాద్ రామంతాపూర్ లోని ప్రభుత్వ హోమియోపతి వైద్య కళాశాలలో భారత ప్రభుత్వం ఆయుష్ విభాగం సౌజన్యంతో రెండు రోజులపాటు నిర్వహించే హోమియోపతి ఎక్స్ పో-2025ను ఆయన లాంచనంగా ప్రారంభించారు. పలు కళాశాలలకు చెందిన విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.... హోమియోపతి విద్యను చదివితే ఎలాంటి ప్రయోజనం కలుగుతుందో, ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలను ఎక్స్ పో ద్వారా ప్రజలకు,విద్యార్థులకు వివరిస్తునట్లు చెప్పారు. హోమియోపతి అంటే చక్కర గోలీలు అన్న అపోహ ప్రజల్లో తొలగించేలా ప్రయత్నిస్తున్నామని ప్రిన్సిపాల్ చెప్పారు. అందిస్తున్న వైద్యం చూసిన ప్రజలు కూడా ఎన్నో వ్యాధుల నుంచి బయటపడుతున్నారని చెప్పారు. ఆసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఇన్ హౌస్ మొక్కల ద్వారా ఏ వ్యాధికి ఏమందులు వాడాలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని వివరించారు.అనంతరం ఆయన ఎక్స్పోలో ఏర్పాటు చేసిన అనాటమీ పాతలాజ్జి ఫోరెన్సిక్ గైనిక్ ప్రదర్శనను వివిధ పాఠశాల విద్యార్థులతో కలిసి తిలకించారు.ఈ కార్యక్రమానికి డాక్టర్ మణిలాల్,ఐ ఐహెచ్ పి తెలంగాణ చాప్టర్ అధ్యక్షుడు ప్రొఫెసర్ జి. చంద్రశేఖర్,వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి,డాక్టర్ రజ నిచందర్ డాక్టర్ కృష్ణమూర్తి,డాక్టర్ సురేష్ డాక్టర్ శ్రీకాంత్,ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ పార్ధసారధి తదితరులు హాజరయ్యారు.

# తెలంగాణ రాష్ట్ర బంద్ ను జయప్రదం చేయండి

**ఉప్పల్ బిసి జేఏసీ యాక్షన్ కమిటీ ప్రతినిధులు**

**ఉప్పల్,అక్టోబర్17(సూర్యరేఖ)** బీ.సీలకు విద్య ఉద్యోగ,రాజకీయ స్థానాల్లో 42 శాతం రిజర్వేషన్ చట్టబద్ధంగా సాధించుకోవటానికై బీసీ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించ బోయే తెలంగాణ రాష్ట్ర బంద్ ను విజయవంతం చేయాలని ఉప్పల్ బీసీ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు నెర్ధం భాస్కర్ గౌడ్, దేవసాని బాలచందర్,గడ్డం సాయికిరణ్,లు తదితరులు పిలుపునిచ్చారు.ప్రతిష్టాత్మకంగా తెలంగాణ రాష్ట్ర సాధనకై ఏరకంగా ఉద్యమ రీతిలో సబ్బన్న వర్గాలు కదిలినారో అదే విధంగా రేపు జరగబోయేటువంటి తెలంగాణ బంద్ లో బిసి వర్గాలు పాల్గొనాల్సిందిగా కోరారు.ఇప్పటికే అన్ని రాజకీయ పార్టీలు,సామాజిక వర్గ సంస్థలు ఉద్యోగ సంఘాలు,కార్మిక సంఘాలు,మహిళా సంఘాలు స్వచ్ఛందంగా ఈ బందులో పాల్గొంటున్నట్లు తెలిపాయి. ఉప్పల్ చిల్కానగర్ రామంతపూర్, మల్లాపూర్ తదితర ప్రాంతాల్లో బి.సిజేఏసీ




కమిటీలు నేటి బందును విజయవంతం చేయుట కోసం పర్యటిస్తున్నారు. బంద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయుటకు జె.ఏ.సి సూచనలు పాటించవలసిందిగా ఆయా ప్రాంతాల్లో ఉదయం 9 గంటల వరకే జేఏసీ కార్యకర్తలంతా సంపూర్ణం గా బంధు నిర్వహించుటకు కదలాలని వ్యాపార సంస్థలు పాఠశాలలు,ప్రజా రవాణా సంస్థలను శాంతియుతంగా బంద్ నిర్వహించి ప్లకార్డ్స్, బ్యానర్లతో ఉప్పల్ రింగ్ రోడ్డు వరకు ప్రదర్శనగా బైక్ ర్యాలీ నిర్వహించి,ఉప్పల్ రింగ్ రోడ్డు వద్ద జన సమీకరణ చేసుకోవాలని కార్యక్రమాన్ని నిర్వహించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో చిలుకనగర్ జేఏసీ నాయకులు పుప్పాల వెంకటేశ్వర్లు రామరాజు యాదవ్,బోడ విద్యాసాగర్, పలుగుల యాదగిరి శామీర్ పేట్ చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# రామంతాపూర్ ప్రభుత్వ హెూమియోపతి వైద్య కళాశాలలో హెూమియోపతి ఎక్స్ పో-2025 ప్రారంభం








**ఉప్పల్,అక్టోబర్17(సూర్యరేఖ)** ఎన్నో దీర్ఘ కాలిక వ్యాధులు హెూమియోపతి ద్వారా నయమవుతున్నాయని ప్రభుత్వ హెూమియోపతి వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.లింగరాజు అన్నారు. హెూమియోపతి వైద్యంలో తమ కళాశాలలో విద్యార్థులకు ఉత్తమ బోధన అందిస్తున్నట్లు చెప్పారు.శుక్రవారం హైదరాబాద్ రామంతాపూర్ లోని ప్రభుత్వ హెూమియోపతి వైద్య కళాశాలలో భారత ప్రభుత్వం ఆయుష్ విభాగం సౌజన్యంతో రెండు రోజులపాటు నిర్వహించే హెూమియోపతి ఎక్స్ పో-2025ను ఆయన లాంచనంగా ప్రారంభించారు. పలు కళాశాలలకు చెందిన విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.... హెూమియోపతి విద్యను చదివితే ఎలాంటి ప్రయోజనం కలుగుతుందో, ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలను ఎక్స్ పో ద్వారా ప్రజలకు,విద్యార్థులకు వివరిస్తునట్లు చెప్పారు. హెూమియోపతి అంటే చక్కర గోలీలు అన్న అపోహ ప్రజల్లో తొలగించేలా ప్రయత్నిస్తున్నామని ప్రిన్సిపాల్ చెప్పారు. అందిస్తున్న వైద్యం చూసిన ప్రజలు కూడా ఎన్నో వ్యాధుల నుంచి బయటపడుతున్నారని చెప్పారు. ఆసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఇన్ హౌస్ మొక్కల ద్వారా ఏ వ్యాధికి ఏమందులు వాడాలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని వివరించారు.అనంతరం ఆయన ఎక్స్పోలో ఏర్పాటు చేసిన అనాటమీ పాతలాడ్జి ఫోరెన్సిక్ గైనిక్ ప్రదర్శనను వివిధ పాఠశాల విద్యార్థులతో కలిసి తిలకించారు.ఈ కార్యక్రమానికి డాక్టర్ మణిలాల్,ఐ ఐహెచ్ పి తెలంగాణ చాప్టర్ అధ్యక్షుడు ప్రొఫెసర్ జి. చంద్రశేఖర్,వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి,డాక్టర్ రజని చందర్ డాక్టర్ కృష్ణమూర్తి,డాక్టర్ సురేష్ డాక్టర్ శ్రీకాంత్,ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ పార్థసారధి తదితరులు హాజరయ్యారు.

# నేడు కాటేదాన్,మైలార్ దేవ్ పల్లిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం

**రాజేంద్రనగర్,అక్టోబర్17(సూర్యరేఖ)**కాటేదాన్ విద్యుత్ సెక్షన్ పరిధిలో వివిధ మరమ్మత్తుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ ప్రవీణ్ తెలిపారు.సెక్షన్ పరిధిలోని లక్ష్మీగూడ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు లక్ష్మీగూడ గ్రామం,హౌసింగ్ బోర్డ్ కాలనీ, బాలాజీనగర్,శమాటెంట్ హౌస్,గణేష్ నగర్, టీఎన్జీఎస్ కాలనీ,అమ్మగార్డెన్,పైనియర్ స్కూల్ ప్రాంతాలలో పెద్ద సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.విద్యుత్ నియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

**మైలార్ దేవ్ పల్లిలో..**

మైలార్ దేవ్ పల్లి విద్యుత్ సెక్షన్ పరిధిలో వివిధ మరమ్మత్తుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ తెలిపారు.ఈ సెక్షన్ పరిధిలోని బండ్లగూడ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం11 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు వినాయకనగర్, అలీనగర్ అయేషాకాలనీ,కింగ్స్ ఎవెన్యూ,యూసఫ్ గుల్షన్ కాలనీ,మైలార్ దేవ్ పల్లి గ్రామం విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు మొగల్ కాలనీ,ప్రగతి కాలనీ,బృందావన్ కాలనీ,పల్లె చెరువు విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటలనుండి 11 గంటల వరకు అలీనగర్,తమిళ్ బస్తీ ప్రాంతాలలో విద్యుత్



సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ పేర్కొన్నారు.విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

**శివరాంపల్లి సెక్షన్ పరిధిలో..**

శివరాంపల్లి విద్యుత్ సెక్షన్ పరిధిలో వివిధ మరమ్మత్తల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ నవీన్ తెలిపారు.సెక్షన్ పరిధిలోని పహడి విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 11:30 నుండి మధ్యాహ్నం రెండున్నర గంటల వరకు సులేమాన్ నగర్ పహడి, చింతల్ మెట్ కొంత భాగం,హబీబ్యా మజీద్ నాన మజీద్,బిలాల్ కేఫ్,జెడ్ జెడ్ కేఫ్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

## జస్టిస్ గవాయ్ పై దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేయాలి..



**మందమర్రి,అక్టోబర్17(సూర్యరేఖ)** సుప్రీంకోర్టులో ఓ కేసు విచారణ సమయంలో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయిపై బూటు విసిరి దాడికి పాల్పడిన రాకేష్ కిషోర్ పై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు.ఈ మేరకు ఎమ్మార్పీఎస్ మందమర్రి మండల ఇంచార్జి జీడి సారంగం మాదిగ ఆధ్వర్యంలో శుక్రవారం మండల తహసిల్దార్ పనగంటి సతీష్ కుమార్ శర్మకు వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ...ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడి అనాగరికమైందన్నారు.ఈ దాడి సమస్త భారతీయులను దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. దళిత పీడిత వర్గాల ప్రజలను తీవ్ర మనోవేదనకు గురిచేసిందన్నారు.దళితుడైన బిఆర్ గవాయి సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ కావడం కొన్ని ఆధిపత్య శక్తులు జీర్ణించుకోలేక పోతున్నాయని విమర్శించారు.ఇలాంటి ఘటనలు ఉన్నత న్యాయవ్యవస్థలో పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేసి శిక్ష పడే వరకు ఉద్యమిస్తామని తెలియజేసారు.బీసీ రిజర్వేషన్ కోసం చేస్తున్న పోరాటంలో ఎమ్మార్పీఎస్ పూర్తి మద్దతు ఇస్తున్నామని,శనివారం నిర్వహిస్తున్న తెలంగాణ బంద్ లో మేము సైతం పాల్గొంటామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షులు చిలుమల రాజ్ కుమార్ మాదిగ, వీహెచ్పీఎస్ పట్టణ అధ్యక్షులు రామ్ శ్రీనివాస్ మాదిగ ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు సబ్బిడీ శ్రీనివాస్ మాదిగ,ఎమ్ఎస్ఎఫ్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప దేవాలయం పరిశీలన..



**కొల్చారం,అక్టోబర్17(సూర్యరేఖ)** నర్సాపూర్ పట్టణ సమీపంలోని అయ్యప్ప దేవాలయ విగ్రహా ప్రతిష్ఠాపన కార్యక్రమం ఉన్నందున శుక్రవారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునితారెడ్డి దేవాలయ మూల విరాట్ మండపం, పనులను పరిశీలించారు,రాబోవు రోజుల్లో దేవాలయం మెదక్ జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతుందని చెప్పారు.ఈ కార్యక్రమంలో నర్సాపూర్ తాజా మాజీ బల్దియా అధ్యక్షులు అశోక్ గౌడ్, నాయకులు మన్సూర్ మండల పార్టీ అధ్యక్షుడు భోగ శేఖర్, వెల్దుర్తి మాజీ జెడ్పీటీసీ రమేష్ గౌడ్ నాయకులు, కార్యకర్తలు గురు స్వాములు పాల్గొన్నారు.

## బీసీ రాష్ట్ర బంద్‌కు ప్రజలు స్వచ్ఛందంగా సహకరించాలి:

**మైలార్ దేవ్ పల్లి డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ ఎస్.వెంకటేష్ కురుమ**



**రాజేంద్రనగర్,అక్టోబర్17 (సూర్యరేఖ)** బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ శనివారం చేపట్టనున్న తెలంగాణ బంద్ కు ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా సహకరించాలని మైలార్ దేవ్ పల్లి డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ ఎస్.వెంకటేష్ కురుమ పిలుపునిచ్చారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి ఆదేశాల మేరకు బంద్,కు పూర్తి మద్దతు ప్రకటించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వ,ప్రైవేటు విద్యా సంస్థలు బంద్,కు మద్దతు తెలపాలని ఆయన కోరారు.ఈ సందర్భంగా ఎస్.వెంకటేష్ కురుమ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని సాధ్యం కాని జీవోలతో బీసీ ప్రజలను మభ్యపెడుతున్నారని ఆరోపించారు.బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించి చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు.రాష్ట్రంలో బీసీ వర్గాలకు 42శాతం స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ బిల్లును గవర్నర్,రాష్ట్రపతి ఆమోదించకపోవడం,జీవో 9ఆర్డినెన్సుపై రాష్ట్ర హైకోర్ట్ స్టే విధించడాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్రంలోని బీసీ సంఘాలు 18న రాష్ట్ర బంద్ కు పిలుపును ఇచ్చిన నేపథ్యంలో బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందన్నారు.ప్రజలు స్వచ్ఛందంగా సహకరించాలన్నారు.ఉత్పత్తి ఉత్పాదక కులాలుగా ఉన్న బీసీలను ఎన్నో ఏళ్లుగా అణచివేస్తూ, హక్కులను కాలరాస్తున్న అగ్రవర్ణాల కుట్రలు ఇక సాగవన్నారు.రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల సమయంలో హామీలిస్తూ ఏండ్ల తరబడి బీసీలను మోసం చేస్తూనే ఉన్నారని,అగ్రవర్ణ కుట్రలకు వ్యతిరేకంగా పోరాడుతున్న వారికి మద్దతు ఇవ్వాలని వారు కోరారు.స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు విద్యా, ఉద్యోగ,చట్ట సభల్లో బీసీలకు రిజర్వేషన్‌లు కల్పించినప్పుడే బీసీ రాజ్యాధికారం సాధ్యమవుతుందన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేసే వరకూ పోరాడుతామన్నారు.

# భూభారతి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలి





**జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**

**కొల్చారం,అక్టోబర్17(సూర్యరేఖ)** భూభారతి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలనీ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం కోల్చారం మండల కేంద్రంలోనీ తహసీల్దార్ కార్యాలయాన్ని అకస్మాత్తుగా తనిఖీ చేశారు.భూభారతి పెండింగ్ దరఖాస్తులను,భూరికార్డులను,హాజరు పుస్తకాల్ని పరిశీలించారు.వివిధ భూసమస్యలతో తహసీల్దార్ కార్యాలానికి వచ్చిన భూబాధితులతో మాట్లాడారు. వారి సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ....తహసీల్దార్ కార్యాలయంలో పెండింగ్ లో ఉన్న భూభారతి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. భూసమస్యలతో వచ్చిన ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండి వారి సమస్యలకు పరిష్కారాన్ని సూచించాలన్నారు. భూసమస్యల వల్ల ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా అధికారులు వారికి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో తాహసిల్దార్ శ్రీనివాస్ చారి,డిప్యూటీ తాహసిల్దార్ నాగవర్ధన్ ఆర్ ఐ.ప్రభాకర్ స్థానిక అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సొంతింటి కలను నెరవేర్చి గొప్పలు చెప్పుకోండి





**సిఐటియు యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ నాగరాజు గోపాల్**

**మందమర్రి,అక్టోబర్17(సూర్యరేఖ)** జాతీయ సంఘాలు ఒప్పందం చేసుకున్న పిఎల్ఆర్ బోనస్ను ఇవ్వడాన్ని తమ గొప్పగా రాష్ట్ర ప్రభుత్వం చెప్పుకోవడం సరైనది కాదని,అవసరమైతే సింగరేణి కార్మికుల సొంతింటి కలను నెరవేర్చి ప్రభుత్వం తమ గొప్పగా చెప్పాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ నాగరాజు గోపాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం సిఐటియు ఆధ్వర్యంలో కాసిపేట1 గనిలోనే కార్మికులను కలుసుకొని సమస్యలు తెలుసుకున్న అనంతరం ఆయన మాట్లాడుతూ... గెలిచిన సంఘాలు కార్మికుల సమస్యలను మాట్లాడే వేదికైన స్ట్రక్చర్ సమావేశాలను బహిష్కరించడంతో పలు సమస్యలు పేరుకుపోయాయని అందువలనే నేడు మెడికల్ బోర్డు జరగడంలేదని,చివరకు మెడికల్ ఫిట్ అయిన డిపెండెంట్,లకు కూడా ఉద్యోగం ఇవ్వకుండా కుటుంబాల కార్మిక కుటుంబాలను ఆర్థికంగా నష్టం చేస్తుంటే గెలిచిన యూనియన్,లు పట్టించుకోకుండా ఓడిన సంఘాల వినతి పత్రాలు ఇచ్చుకుంటూ పోవడం జరుగుతుందని ఆరోపించారు.పదేపదే సానుకూలత వ్యక్తం చేశారంటూ చెప్పడం వలన కార్మికులు యూనియన్ పట్ల అసంతృప్తితో ఉన్నారన్నారు. మేనిఫెస్టోలో పెట్టిన ప్రధాన డిమాండ్లైన సొంతింటి కల పెరిక్స్ మీద ఐటి మాఫీ మారుపేరు అలాంటి సమస్యలను పరిష్కరించకపోవడం వల్లనే టీబీజీకేఎస్ ఓడిపోయిందని,ఇప్పటికైనా గుర్తింపు సంఘం తమ వంతు బాధ్యతగా అన్ని కార్మిక సంఘాలను కలుపుకొని పోరాటాలకు పిలుపునిచ్చే పెద్దన్న పాత్ర పోషించాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా బ్రాంచ్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్. వెంకట స్వామి,అల్లి.రాజేందర్,లు మాట్లాడుతూ... సమయానికి రావాల్సిన గరం కోట్లు ఇప్పటికీ ఇవ్వలేదని,నాణ్యమైన డ్రిల్ రాడ్లు బిట్లు యాజమాన్యం సప్లై చేయకుండా గెలిచిన సంఘాలు పట్టించుకోవడం లేదని,చివరకు చేస్తున్న కొన్ని డిసిగ్నేషన్లకు ప్రమోషన్లు ఇవ్వడం లేదని,ఎన్నో సంక్షేమ కార్యక్రమాలకు ఖర్చు పెడుతున్నామని చెప్తున్నా యాజమాన్యం చివరకు గనక వచ్చే రోడ్డును సైతం సరిగ్గా వేయించలేని స్థితిలో ఉన్నదన్నారు.

**సమయ వేళల మార్పుపై సిఐటియు ఆధ్వర్యంలో నిరసన..**

ఏరియాలోని సివిల్ డిపార్ట్మెంట్లో సమయ వేళలు మార్చినందుకు సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేసారు.కేవలం ఒక్కరోజు ముందుగా చెప్పి ఈ విధంగా సమయం మార్చడం సరైనది కాదని,పాత పద్ధతి ప్రకారం సమయాన్ని కొనసాగించాలని యాజమాన్యాన్ని కోరారు. గెలిచిన సంఘాల వైఖరి వల్లనే ఈ విధంగా సమయాన్ని మార్చారని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో పిట్ సెక్రెటరీ దెబ్బటి తిరుపతి అసిస్టెంట్ పిట్ సెక్రటరీ శ్రీధర్ ఆర్గనైజర్ అమీర్ ప్రశాంత్,నవీన్,గని కార్మికులు పాల్గొన్నారు.

# మధుకర్ హంతకులను కాంగ్రెస్ నుండి బహిష్కరించలి

**బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఏమాజి**




**బెల్లంపల్లి,అక్టోబర్17(సూర్యరేఖ)** భారతీయ జనతా పార్టీ వేమనపల్లి మండల అధ్యక్షులు ఏట మధుకర్ ఆత్మహత్యకు కారకులైనా మాజీ జడ్పీటిసి రుద్రభట్ల సంతోష్ కుమార్ తో పాటు ఇతర కాంగ్రెస్ నాయకులను కాంగ్రెస్ పార్టీ నుండి బహిష్కరించాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఏమాజి డిమాండ్ చేశారు. బెల్లంపల్లిలోని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మధుకర్ కుటుంబ సభ్యులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని,ప్రభుత్వం నుండి రూ.25 లక్షల నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు.స్థానిక ఎమ్మెల్యే గడ్డం వినోద్ హంతకులకు తన ఫామ్ హౌస్ లో దాచి పెట్టి రక్షణ కల్పిస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే అయి ఉండి బాధితులను పరామర్శించక పోవడం శోచనీయం అన్నారు. ఆయన చనిపోయి ఎనిమిది రోజులైనా నిందితులను పట్టుకోవడంలో పోలీసులు పూర్తిగా విఫలం అయ్యారని అన్నారు. పోలీసులు రాజకీయ ఒత్తిళ్ల వల్ల కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు.ఆత్మహత్యకు కారకులైన ఎస్ఐ కోటేశ్వర్ ను కాపాడడానికి పోలీసులు కంప్లైంట్ కూడా తీసుకోలేదన్నారు. పోలీసులు వెంటనే నిందితులను అరెస్ట్ చేయాలని, లేకుంటే కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.ఈ సమావేశంలో బిజెపి మాజీ జిల్లా ఉపాధ్యక్షులు పులగం తిరుపతి,సీనియర్ నాయకులు గోవర్ధన్,జిల్లా కౌన్సిల్ సభ్యులు,శ్రవణ్ కుమార్,ఎస్సీ మోరచ జిల్లా కార్యదర్శి కల్లేపల్లి నవీన్ కుమార్,ఎస్సీ మోరచ జిల్లా కార్యవర్గ సభ్యులు నర్సింగ్,బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శి అరవింద్ పాల్గొన్నారు.

## వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు..



**మాసాయిపేట,అక్టోబర్18(సూర్యరేఖ)** మాసాయిపేట మండలం అచ్చంపేట గ్రామంలో మంగళవారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసిల్దార్ జ్యోతి,ఏవో కవిత,ఆర్ఐ ధన్ సింగ్ సొసైటీ డైరెక్టర్ ఊదండపురం నరసింహు,లు ప్రారంభించారు.రైతులు పండించిన ధాన్యంకు గిట్టుబాటు ధర కల్పించడం కోసమే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిందని వారు తెలిపారు.రైతుల పండించిన ధాన్యం దళారులకు విక్రయించకుండా కొనుగోలు కేంద్రాలకు తరలించి గిట్టుబాటు ధర పొందాలని రైతులకు సూచించారు

## పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరి.

**పశు వైద్యాధికారి డాక్టర్ కావ్య**



**మాసాయిపేట,అక్టోబర్17(సూర్యరేఖ)**మెదక్ జిల్లా మాసాయిపేట మండల కేంద్రంలోని మాసాయిపేట మండల గోపాల కృష్ణాపురం గ్రామం లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయడం జరిగింది అని పశు వైద్యాధికారి డాక్టర్ కావ్య తెలిపారు.ఏడవ విడత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు ఉచితంగా మండలంలోని అన్ని గ్రామాలలో టీకాలు వేయడం జరుగుతుంది.డాక్టర్ కావ్య మాట్లాడుతూ....గాలికుంటు వ్యాధి సోకిన పశువులలో పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గుతుందన్నారు.రైతులు ఈ వ్యాధిని మొదటి దశలోనే గుర్తించి పశు వైద్య అధికారుల సలహాలు తీసుకుంటే పశువులను రక్షించుకోవచ్చని ఆమె అన్నారు.అన్ని గ్రామాల రైతులు నవంబర్ 14 గడువులోపు వేస్తామని,పశువులు ఉన్న ప్రతి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

## కేటీఆర్ పై ఎస్పీకి ఫిర్యాదు చేసిన జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాసరావు.



**కామారెడ్డి,అక్టోబర్17(సూర్యరేఖ)** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట తారక రామారావుపై కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఎస్పీ రాజేష్ చంద్రకు ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కైలాస్ శ్రీనివాసరావు గుప్తా మాట్లాడుతూ.. భారత రాష్ట్ర సమితి సభ్యులు సామాజిక మధ్యమాల్లో పెట్టిన పోస్టులపై ఫిర్యాదు చేస్తున్నట్లు చెప్పారు.సోషల్ మీడియాలో వేరువేరు వర్గాల మధ్య విద్వేషాన్ని రెచ్చగొట్టడం శాంతి భద్రతలకు భంగం చేస్తున్నారని ప్రభుత్వాన్ని అపఖ్యాతి పరచడం వంటి విషయాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విన్నవించినట్లు చెప్పారు. భారత రాష్ట్ర సమితి పార్టీ సభ్యులు అనుచరులు పార్టీ ప్రతినిధులు కల్వకుంట్ల తారకరామారావు మార్గదర్శకంలో సామాజిక మధ్యమాల ద్వారా ఉద్దేశపూర్వకంగా దూషణాత్మకమైన అపరధ కలిగించే పోస్టులు చేస్తున్నారని పేర్కొన్నారు.ఈ అంశాన్ని సీరియస్,గా తీసుకొని సంబంధిత బిఎంఎస్ఎస్ సమాచార సాంకేతిక చట్టాల ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పండ్లరాజు,విభజన కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్,మాజీ కౌన్సిలర్లు రాజేశ్వర్ రవీందర్ గౌడ్,సర్వర్ చందు,సత్యం,రఫీ, అజ్మత్ లక్కపతిని గంగాధర్,తో పాటు గజిబాయ్ పాల్గొన్నారు.

## యువకుడ్ని కాపాడాలని ఓవైసీ వినతి

**హైదరాబాద్ :** తెలంగాణలోని హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ అహ్మద్ అనే యువకుడు రష్యాలో చిక్కుకున్నాడు. నిర్మాణ సంస్థలో ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించి రష్యాకు పంపిన అహ్మద్‌ను ఉక్రెయిన్‌తో పోరాడేందుకు ఒత్తిడి తెస్తున్నారు. రాజ్‌భవన్‌కు ఎదురుగా నివసించే మహ్మద్‌ను ముంబైకి చెందిన 'ట్రస్ట్ కన్సల్టెన్సీ' యజమాని ఆదిల్ రష్యాలో మంచి ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించాడు. అతడి మాటలు నమ్మిన అహ్మద్ రష్యాకు వెళ్లాడు. ఏప్రిల్ 25, 2025న రష్యాకు చేరుకున్న తర్వాత అతనికి నెల రోజుల పాటు ఎటువంటి పని ఇప్పించలేదు. ఆ తర్వాత, అతన్ని, మరో 30 మందిని బలవంతంగా ఒక మారుమూల ప్రాంతానికి తీసుకెళ్లారు. అక్కడ వారికి ఆయుధాలు వాడకంపై శిక్షణ ఇచ్చారు. ఈ బృందంలో మరో 6 మంది భారతీయులు కూడా ఉన్నారని సమాచారం. శిక్షణ తర్వాత 26 మందిని ఉక్రెయిన్ సైన్యంతో పోరాడేందుకు రష్యా సరిహద్దుకు పంపారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో పురోగతి కనిపించాలి

కలెక్టర్ నారాయణరెడ్డి



**రంగారెడ్డి జిల్లా,అక్టోబర్17(సూర్యరేఖ)** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలలో స్పష్టమైన పురోగతి కనిపించేలా క్షేత్ర స్థాయిలో చిత్తశుద్ధితో కృషి చేయాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. లక్ష్య సాధనకు కృషి చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరం నుండి ఇందిరమ్మ ఇళ్ల పురోగతి,డబుల్ బెడ్రూంల పంపిణీ ప్రక్రియపై, వనమహోత్సవం ఎన్ఆర్ఇజిఎస్,పారిశుద్ధ్యం, ఇందిరా మహిళాశక్తి తదితర అంశాలపై కలెక్టర్ సి. నారాయణరెడ్డి శుక్రవారం ఎంపీడీఓలు హౌసింగ్ ఏ.ఈలు మున్సిపల్ కమిషనర్లు,ఏపిఎమ్,లతో సుదీర్ఘసమీక్ష జరిపారు.ఈ సందర్భంగా కలెక్టర్ ఒక్కో మండలం వారీగా మంజూరైన ఇందిరమ్మ ఇళు ఎన్ని, వాటిలో ఎన్ని గ్రౌండింగ్ అయ్యాయి,ఎన్ని ఇండ్లు ఏ దశలో నిర్మాణంలో ఉన్నాయి ఇప్పటివరకు గ్రౌండింగ్ జరగని ఇళ్లకు సంబంధించి లబ్ధిదారులచే పనులు ప్రారంభించేలా చేపట్టిన చర్యలు ఏమిటి తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఇళ్ల నిర్మాణాలలో వెనుకంజలో ఉన్న ఆయా మండలాల అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.క్రమం తప్పకుండా సమీక్ష నిర్వహిస్తూ నిర్దేశిత లక్ష్యాల సాధన కోసం స్పష్టమైన దిశానిర్దేశం చేస్తున్నప్పటికీ, ఎందుకు పురోగతి సాధించడం లేదని అడిగారు. ప్రభుత్వం వెంటదివెంట బిల్లులను మంజూరు చేస్తూ, తగిన తోడ్పాటును అందిస్తోందని గుర్తు చేశారు. అలాంటప్పుడు ఇంటి నిర్మాణం పనులు చేపట్టేలా లబ్ధిదారులను ప్రోత్సహించడానికి ఇబ్బంది ఏమిటని ప్రశ్నించారు.ఇళ్ల నిర్మాణాలలో స్పష్టమైన పురోగతి సాధించాల్సిందేనని స్పష్టం చేశారు. మంజూరీలు పొందిన వారందరూ తక్షణమే ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా లబ్ధిదారులను ప్రోత్సహిస్తూ, క్షేత్రస్థాయిలో పక్కాగా పర్యవేక్షణ చేయాలని సూచించారు.ప్రతి ఒక్కరూ ఇంటి నిర్మాణం పనులు చేపట్టేలా చూడాలని,ఇందిరమ్మ కమిటీల సహకారం తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపు ప్రక్రియను కూడా వేగవంతం చేయాలని సూచించారు. నిరుపేద వారికి డిఆర్డిఏ ద్వారా రెండు లక్షల వరకు ఆర్థిక సహాయం అందించేందుకు నిజమైన వారిని గుర్తించాలని కలెక్టర్ సూచించారు.మహిళా సమైక్య గ్రూప్ల ద్వారా మహిళా శక్తి రుణాలను అందించేందుకు ఇటుకలు, సెంట్రింగ్ బాక్సులు తయారీదారులకు అందించేలా ప్రతి గ్రూపుల్లో రెండు యూనిట్లను యూనిట్లను ఎంపిక చేయాలని సూచించారు. వనమహోత్సవంపై సమీక్షిస్తూ నవంబర్ 1నుండి ప్రతి గ్రామ, మున్సిపాలిటీ పరిధిలో అంగన్వాడి కేంద్రాలలో పాఠశాలల్లో ఇన్స్టిట్యూట్లో వైకుంఠ ధామాలలో పల్లె ప్రగతి పార్కుల్లో నిర్దేశించిన లక్ష్యాలను 100 శాతం పూర్తి అయ్యేలా మొక్కలు నాటాలని సూచించారు. నాటిన మొక్కలను పరిశీలించుటకు టీంలు ఏర్పాటు చేసి పరిశీలించడం జరుగుతుందన్నారు. నిర్దేశించిన లక్ష్యాలను 100 శాతం పూర్తి చేయని,వారిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సూచించారు. అర్బన్ ఆవాస్ యోజనా గ్రామీణ పథకం ద్వారా చేపట్టిన ఇండ్ల నిర్మాణాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్,జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ పిడి శ్రీలత పరిశ్రమలశాఖ అధికారి శ్రీలక్ష్మి సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ రామారావు విద్యాశాఖ అధికారి సుశిందర్ రావు సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం






తెలంగాణ ప్రభుత్వ వ్యవసాయశాఖ సంచాలకులు డాక్టర్ బి.గోపి

**రాజేంద్రనగర్,అక్టోబర్17(సూర్యరేఖ)** జీడిమెట్ల కేంద్రీయ సమగ్ర సస్య సంరక్షణ కేంద్రం ఆధ్వర్యంలో భారత ఆహార ధాన్య నిల్వ,నిర్వాహణ పరిశోధన సంస్థ ఆడిటోరియం అక్టోబర్ 13 నుంచి జరిగిన 5 రోజుల సమగ్ర సస్య రక్షణ మానవ వనరుల అభివృద్ధి కార్యక్రమంలో ముగింపు కార్యక్రమం నిర్వహించారు.ఈ ముగింపు కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ వ్యవసాయశాఖ సంచాలకులు డాక్టర్ బి.గోపి ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు.ఐదు రోజుల మానవ వనరుల అభివృద్ధి కార్యక్రమంలో శిక్షణ పొందిన వారందరినీ ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. మొక్కల చీడ పీడల నిర్వాహణలో ఐపీఎం ప్రాముఖ్యతను,రసాయన పురుగుమందుల సురక్షితమైన వివేకవంతమైన ఉపయోగం గురించి ఆయన నొక్కిచెప్పారు. వ్యవసాయ అధికారులు అందరూ తమ సాధారణ కార్యకలాపాలతో పాటు చీడపీడల పర్యవేక్షణ పర్యావరణ అనుకూల చీడ పీడల నిర్వహణ విధానాలపై దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. తెలంగాణ వ్యవసాయశాఖ అధికారులు తెలంగాణ రైతులు జాతీయ చీడపీడల పర్యవేక్షణ వ్యవస్థ మొబైల్ యాప్ను ప్రోత్సహిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. సీఐపీఎంసీ హైదరాబాద్ ఇంచార్జ్ అధికారిణి రౌతు సునీత హాజరైన అధికారులను ఉద్దేశిస్తూ చీడపీడల నిర్వాహణ కోసం 5 రోజుల మానవ వనరుల అభివృద్ధి కార్యక్రమంలో నేర్చుకున్న ఐపీఎం పద్ధతులు,విధానాలను తుది వినియోగదారులైన రైతులకు అమలు చేయాలని కోరారు.సీఐపీఎంసీ హైదరాబాద్ శిక్షణ సమన్వయకర్త వెంకట రెడ్డి,రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి పాల్గొన్న వారందరూ నేర్చుకున్న ఐపీఎం విధానాలు వ్యవసాయ సమాజానికి ప్రయోజనకరంగా ఉంటాయని ఆశించారు.శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసినందుకు అందరూ నిర్వాహక సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.రాజేంద్రనగర్లోని ఐజిఎంఆర్ఐ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రవీణ్ గౌడ స్థిరమైన వ్యాధి నిర్వహణ పద్ధతుల ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు.ఈ కార్యక్రమంలో వారందరికీ తుది మూల్యాంకన పరీక్షను హొన్నప్పగౌడ ఎపిపిఓ(ఇ) బసవన్నెప్ప ఎపిపిఓ(ఇ),ఉదయ్ శంకర్.ఎ ఎపిపిఓ(పిపి) బొల్లి వేణు బాబు,ఏపీపీఓ నిర్వహించారు.శిక్షణ కార్యక్రమంలో కొందరు అధికారులు కార్యక్రమ ఏర్పాట్లపై సానుకూల స్పందనను పంచుకున్నారు.సిఐపిఎంసి హైదరాబాద్ ద్వారా ఐపిఎంపై క్రమం తప్పకుండా శిక్షణా కార్యక్రమాలను నిర్వహించాలని వ్యవసాయ డైరెక్టర్ను అభ్యర్థించారు.

# మండలంలో పర్యటించిన ట్రైనింగ్ ఎంపీడీఓలు

**చేగుంట,అక్టోబర్17(సూర్యరేఖ)** రాష్ట్ర స్థాయి గ్రూప్ వన్ ఫలితాల్లో ఎంపికై, ఎంపీడీవోలుగా శిక్షణ పొందుతున్న ట్రైనింగ్ అధికారులు,చేగుంట మండలంలోని చిన్న శివనూర్ గ్రామాన్ని చేగుంట ఎంపీడీఓ చిన్నరెడ్డితో కలిసి శుక్రవారం సందర్శించారు.శిక్షణలో భాగంగా గ్రామ స్థాయి పరిపాలన విధానాన్నితో పాటు పలు అభివద్ధి పనులను చూపించి గ్రామ స్థాయిలో అభివృద్ధి ఏవిధంగా ఉంటుందో ఎంపీడీఓ చిన్నరెడ్డి వారికి వివరించారు.మండల అభివృద్ధి కొరకు అధికారులు ఏ అంశాలపై దృష్టి సారించాలి,గ్రామ పరిపాలన విధానాన్ని,ఏ విధంగా గ్రామాలను అభివృద్ధి



చేసుకోవాలి అనే అంశాల గురించి,ట్రైని అధికారులకు ఎంపీడీవో చిన్న రెడ్డి వివరించారు. అనంతరం శిక్షణ పొందుతున్న ట్రైనీ ఎంపీడీవోలకు చిన్నశివనూరుతో పాటు మండలంలోని పలు



గ్రామాల్లోని నర్సరీలు డంపింగ్ యార్డ్,విధి లైట్ల, తదితరల అంశాలపైన వారికీ అవగాహనా కల్పిచడం జరిగింది,ఈ కార్యక్రమంలో ఎంపీవో సురేష్,వివిధ గ్రామాల పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు వచ్చే వరకు ఉద్యమం కొనసాగుతుంది..

సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్



**రామాయంపేట,అక్టోబర్17 (సూర్యరేఖ)** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు లభించే వరకు తెలంగాణలో ఉద్యోగ విద్య,స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్లు ఇవ్వడానికి వీలు లేదని సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ స్పష్టం చేశారు. శనివారం శనివారం బీసీ జేఏసీ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా జరగనున్న" బంద్ ఫర్ జస్టిస్" కార్యక్రమంలో సగర సంఘం కూడా సమగ్రంగా పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు.బీసీ జేఏసీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఉద్యమం బీసీల ఆత్మగౌరవం కోసం జరుగుతోందని,అన్ని బీసీ సంఘాలు ఒకే వేదికపైకి వచ్చి ఏకమై పోరాటం చేయడం చారిత్రాత్మక పరిణామమని ఆయన పేర్కొన్నారు."ఇది కేవలం బీసీల హక్కుల కోసం కాదు,రాష్ట్ర సమానత్వం కోసం జరుగుతున్న పోరాటం"అని ఉప్పరి శేఖర్ అన్నారు.జిల్లా,మండల,గ్రామీణ స్థాయిలో ఉన్న సగర బంధువులందరూ ఈ బంద్లో చురుకుగా పాల్గొని, బీసీలకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు."మన భవిష్యత్తు,మన హక్కుల కోసం,బీసీ ఉద్యమం విజయవంతం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత"అని రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ స్పష్టం చేశారు.

## బీఆర్ఎస్ పార్టీతోనే రాష్ట్ర అభివృద్ధి..

కాంగ్రెస్ ను నమ్మితే మోసపోయినట్లే..

జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచార ప్రారంభోత్సవంలో రాజేంద్రనగర్ నియోజకవర్గం బీజేపీ ఇంచార్జ్ కార్తీక్ రెడ్డి



**రాజేంద్రనగర్,అక్టోబర్17(సూర్యరేఖ)** బీఆర్ఎస్ పార్టీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని రాజేంద్రనగర్ నియోజకవర్గం బీజేపీ ఇంచార్జ్ కార్తీక్ రెడ్డి అన్నారు.ప్రతిష్టాత్మకమైన జూబ్లీహిల్స్ ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి పార్టీ అభ్యర్థి మాగంటి సునీతా గోపినాథ్ గెలుపు కోరుతూ అధిష్టానం భారత రాష్ట్ర సమితి పార్టీ రాష్ట్ర యువ నాయకుడు రాజేంద్రనగర్ నియోజకవర్గ రథసారథి పట్లోళ్ల కార్తీక్ రెడ్డికి బూత్ నంబర్ 24 నుండి 30 వరకూ బాధ్యతలను అప్పజెప్పారు.అందులో భాగంగా బూత్ నంబర్ 29 కు చెందిన అంబేద్కర్ నగర్ పరిసర ప్రాంతాలలో ఇంటింటికి ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రజలు కాంగ్రెస్ పాలనపై తీవ్ర వ్యతిరేకంగా ఉన్నారన్నారు.కాంగ్రెస్ ను నమ్మితే మోసపోయినట్లేనని వ్యాఖ్యానించారు.ప్రజల సమస్యల పరిష్కారంలో చర్యలు తీసుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి వైఫల్యం చెందినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు రాములు,వెంకటేష్,లు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బంద్ కు మద్దతు..

జహీరాబాద్ బీసీ జేఏసీ మెంబర్స్



**అందోల్,అక్టోబర్17(సూర్యరేఖ)** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ లో శనివారం భవాని మందిర్ చౌరస్తా నుంచి బస్టాండ్ వరకు స్వచ్ఛంద బంద్ కు బీసీ బంధువులు,అన్ని పార్టీల బీసీ కార్యకర్తలు తమ మద్దతు తెలుపాలని డాక్టర్ పెద్ద గొల్ల నారాయణ అన్నారు.మనం బీసీలందరం ఏకతాటికి రావాలని మనకు జరిగిన అన్యాయాన్ని ఈ బంద్ ధార తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని జహీరాబాద్ బీసీ జేఏసీ సభ్యులు కోరారు.ఈ కార్యక్రమంలో బీసీ కుల సంఘాలు,బీఆర్ఎస్ పార్టీ బీసీ సోదరులు,బిజెపి పార్టీ బీసీ సోదరులు జాగో తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జహీరాబాద్ నియోజకవర్గం అన్ని మండలాల నుంచి బీసీ బంధువులు అతిథి హోటల్లో బీసీ తాలుక జేఏసీ ఆధ్వర్యంలో సమావేశం అయ్యారు.శనివారం జరగబోయే బంద్ కు తమ తమ మద్దతు తెలుపుతున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ పెద్ద గొల్ల నారాయణ,కోహిర్ మండల్ మాజీ జెడ్పిటిసి,నర్సింలు,కొండాపురం నరసింహులు,విశ్వనాథ్ యాదవ్,బిజెపి నాయకులు తట్టు నారాయణ బిఆర్ఎస్ పార్టీ జహీరాబాద్ మండల అధ్యక్షులు వెంకటేశం,బిఆర్ఎస్ జర సంఘం మండల్ మొహమ్మద్ ఇమ్రాన్,బీసీ మైనార్టీ,సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు శంకర్,సాగర్,బిసి జగన్,మాదినం శివప్రసాద్,జాగో తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామ్ శెట్టి తదితరులు పాల్గొన్నారు.

# పశువైద్య కళాశాలలో రక్తదానం శిబిరం




**రాజేంద్రనగర్,అక్టోబర్17(సూర్యరేఖ)** ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి నిండు జీవితాన్ని కాపాడాలని డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫ్ఫైర్స్ ప్రొఫెసర్ కె.సతీష్ కుమార్ అన్నారు.పీవీ నరసింహారావు పశువైద్య కళాశాల రాజేంద్రనగర్ జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో పీవీ నరసింహా రావు మెమోరియల్ ట్రస్ట్ వారి సౌజన్యంతో రక్తదాన శిభిరం నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫ్ఫైర్స్ ప్రొఫెసర్ కె.సతీష్ కుమార్ ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ డి.మాధురి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు,సిబ్బంది విరివిగా పాల్గొని రక్తదానం చేశారు.ఈ సందర్భంగా సతీష్‌కుమార్ మాట్లాడుతూ.. రక్తదానం చేసి నిండు జీవితానికి మన వంతుగా సహకారం అందించాలన్నారు. రక్తదానం చేయడం వల్ల ఎలాంటి నష్టం లేదని,అనవసర వదంతులను నమ్మి రక్తం ఇవ్వడానికి వెనుకంజ వేయవద్దన్నారు.ఈ కార్యక్రమాన్ని కళాశాల జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ ఆఫీసర్స్ ప్రొఫెసర్ కె.రామచంద్ర రెడ్డి,ప్రొఫెసర్ అమృత్ కుమార్,ప్రొఫెసర్ అమరేశ్వరి,డాక్టర్ కె.కవిత ప్రొఫెసర్ సుజాత సింగ్,ఓఎస్ఏ పర్యవేక్షించారు. పీవీ నరసింహా రావు మెమోరియల్ ట్రస్ట్ వారి సిబ్బంది డాక్టర్ చైతన్య,అనిత పాల్గొన్నారు.

## బీసీ బంద్ కు మద్దతు ఇచ్చిన బీజేపీ నాయకులు



**రాజేంద్రనగర్,అక్టోబర్17(సూర్యరేఖ)**బీసీ సంఘాలు చేపట్టిన తెలంగాణ బంద్ కు మద్దతు ఇస్తున్నామని అత్తాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు సుల్గే వెంకటేష్ తెలిపారు.బీసీలు నిర్వహిస్తున్న బంద్ కు బీసీ సంఘాలకు బిజెపి తరపు నుంచి పూర్తి మద్దతు ఇస్తున్నామని వివరించారు.అదేవిధంగా బస్ డిపోలు విద్యాసంస్థలు వాణిజ్యాలు,అన్ని స్వచ్ఛందంగా బంద్ చేయాలని పిలుపునిచ్చారు.బీసీలను కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు కల్లబొల్లి మాటలు చెప్పి మోసం చేస్తుందని ఆయన వ్యాఖ్యానించారు.

## కారు దగ్ధం..తృటిలో తప్పిన ప్రమాదం


**ప్రాణాలతో బయటపడ్డ డ్రైవర్**



**రాజేంద్రనగర్,అక్టోబర్17(సూర్యరేఖ)**నడుస్తున్న కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. వెంటనే కారు ఆపి పక్కకు జరగగానే మంటలు పెద్దగా వ్యాపించి నడి రోడ్డుపై అందరూ చూస్తుండగానే కారు పూర్తిగా దగ్ధమైంది.మైలార్ దేవ్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో పెనుప్రమాదం తప్పింది.చంద్రాయనగుట్ట నుంచి నుంచి ఆరాంఘర్ వైపు వెళ్తున్న కారులో పల్లె చెరువు వద్ద ఆకస్మాత్తుగా మంటలు చెలరేగాయి.కారులో పొగలు రావడం గుర్తించిన పఠాన్ చెరువుకు చెందిన డ్రైవర్ శ్రావణ్ అందులో నుంచి క్షణాల్లో బయటకు దిగి తన ప్రాణాలను కాపాడుకున్నారు.తర్వాత మంటలు కారు మొత్తం వ్యాపించాయి.దీంతో ఆ ప్రాంతంలో పొగలు కమ్ముకున్నాయి.స్థానికులు మంటలను ఆర్పివేశారు.కారులో మంటలు చెలరేగడంతో వాహనదారులు భయాందోళనలకు గురయ్యారు. కొద్దిసేపు ఆ ప్రాంతంలో ట్రాఫిక్ నిలిచిపోయింది.కారు ఇంజిన్లో షార్ట్ సర్క్యూట్ కారణంగానే మంటలు చెలరేగినట్లు పోలీసులు నిర్ధారించారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు వచ్చే వరకు ఉద్యమం కొనసాగుతుంది

**రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సగర ఆదేశాలతో**
**"బంద్"లో మేము సైతం..**
**సగర సంగం జిల్లా ప్రధాన కార్యదర్శి మర్కు నగేష్ సగర..**



**రామాయంపేట,అక్టోబర్17(సూర్యరేఖ)** బీసీలకు 42శాతం రిజర్వేషన్లు లభించే వరకు తెలంగాణలో ఉద్యోగ,విద్య,స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్లు ఇవ్వడానికి వీలు లేదని సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సగర ఆదేశాలతో. శనివారం బీసీ జేఏసీ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా జరగనున్న"బంద్ ఫర్ జస్టిస్" కార్యక్రమంలో సగర సంఘం కూడా సమగ్రంగా పాల్గొననున్నట్లు సగర సంగం మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్కు నగేష్ సగర తెలిపారు.శుక్రవారం ఆయన రామాయంపేటలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ...బీసీ జేఏసీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఉద్యమం బీసీల ఆత్మగౌరవం కోసం జరుగుతోందని,అన్ని బీసీ సంఘాలు ఒకే వేదికపైకి వచ్చి ఏకమై పోరాటం చేయడం చారిత్రాత్మక పరిణామమని ఆయన పేర్కొన్నారు."ఇది కేవలం బీసీల హక్కుల కోసం కాదు, రాష్ట్ర సమానత్వం కోసం జరుగుతున్న పోరాటం" అన్నారు. మెదక్ జిల్లాలోని అన్ని మండలాల గ్రామీణ స్థాయిలో ఉన్న సగర బంధువులందరూ ఈ బంద్‌లో చురుకుగా పాల్గొని, బీసీలకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సగర సంగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మర్కు దత్తు సగర, జిల్లా సంయుక్త కార్యదర్శి రామారపు యాదగిరి సగర,స్థానిక సంఘం నాయకులు మర్కు భూపాల్ సగర,మర్కు అజేష్ సగర,రేవెళ్లి వినయ్ సగర,తదితరులు పాల్గొన్నారు.

# సుప్రీంకోర్టు న్యాయమూర్తిపై దాడిని ఖండించిన ఎమ్మార్పీఎస్




**రాజేంద్రనగర్,అక్టోబర్17(సూర్యరేఖ)**భారత అత్యున్నత న్యాయస్థానం అయిన సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయి మీద జరిగిన దాడిని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు క్యాసారం శంకర్ రావు మాదిగ అన్నారు.ఈ మేరకు రాజేంద్రనగర్ మండల తహశీల్దార్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శంకర్ రావు మాదిగ మాట్లాడుతూ.. సుప్రీం కోర్టు చీఫ్ జెస్టిస్ గవాయి మీద జరిగిన దాడి భారత రాజ్యాంగం మీద జరిగిన దాడిగా అభివర్ణించారు.అలా దాడి చేయడాన్ని తీవ్రంగా కండించారు.దాడి చేసిన వారిపై చట్టరీత్యా కఠిన శిక్ష వేయాలని ఎమ్మార్పీఎస్ తరపున కోరారు.ఈ కార్యక్రమంలో పోతురాజు యాదయ్య మాదిగ నాన్నగారి రాంచందర్ మాదిగ,లింగని కృష్ణ మాదిగ శ్యామల జగదీశ్వర్,పోయిల జీవన్ దాస్ మంగలారం శ్రీనివాస్,శ్యామల గంగాధర్ గోల్కొండ రాజు కుమార్,ఎడ్లకాడి సూర్యం వీర్లపల్లినవీన్ ఎ.మహేందర్ లేవిరాజ్ నాని చంద్రశేకర్ జోగి శ్రీనివాస్,జోగి శేఖర్,అనిల్ కుమార్ ఎ.బాబురావు వెంకటరమణ నరేష్ నవీన్ కరన్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనలో నీరు గారిన విద్య వ్యవస్థ

**రాజేంద్రనగర్ నియోజకవర్గం బీజేపీ ఇంచార్జ్ కార్తీక్ రెడ్డి**



**శంషాబాద్,అక్టోబర్17(సూర్యరేఖ)**కాంగ్రెస్ పాలనలో విద్య వ్యవస్థ నీరుగారిపోయిందని రాజేంద్రనగర్ నియోజకవర్గం బీజేపీ ఇంచార్జ్ కార్తీక్ రెడ్డి అన్నారు.శనివారం నియోజకవర్గం పరిధి శంషాబాద్ మండలం ముచ్చింతల్ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలను ఇంద్రారెడ్డి ట్రస్ట్ చైర్మన్, రాజేంద్రనగర్ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి సందర్శించారు.ఈ సందర్భంగా ఇంద్రారెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో అదనపు గదుల నిర్మాణం,మరుగు దొడ్లను పరిశీలించారు. అనంతరం టీ స్టాల్లో టీ తాగి,ఆటో డ్రైవర్లతో ముచ్చటించారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## రేపటి బందు విజయవంతం చేయాలి జనసేన నాయకుడు నక్క మల్లేష్



**కామారెడ్డి,అక్టోబర్17 (సూర్యరేఖ)** బీసీ సంఘాల ఆధ్వర్యంలో రేపు నిర్వహించే రాష్ట్ర బందును విజయవంతం చేయాలని జనసేన పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నక్క మల్లేశం తెలిపారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని చిత్తశుద్ధి లేదని అన్నారు.ఒకవేళ అలా ఉంటే అఖిల పక్షాన్ని ప్రధానమంత్రి వద్దకు తీసుకు వెళ్లే వాడని కోర్టులో ఇది నిలవదని,తెలిసి బీసీలతో ఆడుకుంటున్నాడని ఆయన పేర్కొన్నారు.ప్రజలను మభ్యపెట్టడానికి సుప్రీంకోర్టుకు వెళ్లాడని తెలిపారు. ఎన్నికల్లో హామీల్లో భాగంగా కామారెడ్డి బిసి డిక్లరేషన్ హామీ ఇచ్చి అమలు చేయని ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు.రేపు బీసీ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్ర బంద్ కు జనసేన పార్టీ సంపూర్ణ మద్దతు పలుకుతుందని నక్క మల్లేశం తెలిపారు.

## బీసీల రిజర్వేషన్ల సాధన కోసం నిర్వహించే బంద్,కు సహకరించండి..

**బీసీ రిజర్వేషన్ సాధన సమితి**



**చేగుంట,అక్టోబర్17(సూర్యరేఖ)** బీసీల రిజర్వేషన్ల సాధన కోసం బీసీ సంఘాల ఐక్య కార్యాచరణ పిలుపుమేరకు రేపు చేగుంట మండల బీసీ సంఘాలు,అన్ని రాజకీయ పార్టీల బీసీ నాయకుల ఆధ్వర్యంలో సంపూర్ణ బంద్ నిర్వహిస్తున్నాం కావున ఈ బంద్ కు చేగుంటలోని అన్ని వాణిజ్య వ్యాపార వర్గాలు,వివిధ దుకాణ సముదాయాలు,ప్రైవేట్ విద్యా సంస్థలు స్వచ్ఛందంగా బంద్ కు సహకరించాలని మండల రిజర్వేషన్ సాధన కమిటీ సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి ముధం శ్రీనివాస్, మాజీ ఎంపీపీ మాసుల శ్రీనివాస్,కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్,రాజగౌడ్,రాంపూర్ తాజా మాజీ సర్పంచ్ కాషాబోయిన భాస్కర్,కుమ్మరి శ్రీనివాస్,బల్ చందర్,బిజెపి మాజీ అధ్యక్షులు భూపాల్, రాజగోపాల్,చౌదరి శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు

## పత్రిక స్వేచ్ఛను హరించడం సరికాదు..



**అందోల్,అక్టోబర్17(సూర్యరేఖ)** సాక్షి పత్రిక ఎడిటర్ ధనుంజయ్ రెడ్డిపై అక్రమ కేసులు పెట్టి పత్రిక స్వేచ్ఛను అడ్డుకోవలనుకోవడం సరికాదని జర్నలిస్ట్ సంఘాల నాయకులు రమేష్,విట్టల్,సాయిరాం శెట్కార్ లు అన్నారు.ఎడిటర్ పై కేసుల నమోదును నిరసిస్తూ నల్లబ్యాడ్జిలు ధరించి తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు.అనంతరం తహసీల్దార్ ఆశాజ్యోతికి వినతి పత్రం ఇచ్చారు.ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ..ఏపి ప్రభుత్వ పెద్దల ఒత్తిడితోనే ఎడిటర్ పై వరుసగా కేసులు పెట్టి,నోటీసులు జారీ చేస్తున్నారని ఆరోపించారు. ఎడిటర్ పై కక్షపూరిత చర్యలను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగం కల్పించిన మీడియా స్వేచ్ఛను హరించడంపై కుట్ర కోణం ఉందన్నారు.కలానికి సంకెళ్లు వేయాలనే ప్రభుత్వ కుట్రలపై నిరసన కొనసాగిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ పత్రికా విలేకరులు పండరి శేఖర్,ప్రశాంత్,ఆనంద్,శ్రీనివాస్,మ్యాతరి ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


## పత్రిక స్వేచ్ఛను హరించడాన్ని ఖండించిన తెలంగాణ యూత్ జర్నలిస్టు ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు శేఖర్ ముదిరాజ్ ముదిరాజ్




**అందోల్,అక్టోబర్17(సూర్యరేఖ)** :సాక్షిపత్రిక ఎడిటర్ ధనుంజయ్ రెడ్డిపై అక్రమ కేసులు పెట్టి పత్రిక స్వేచ్ఛను అడ్డుకోవాలనుకోవడం సరికాదని జర్నలిస్టుల పై ఎడిటర్ పై కేసుల నమోదును చేయటం సరైన పద్దతి కాదని అన్నారు.తెలంగాణ యూత్ జర్నలిస్టు ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు శేఖర్ ముదిరాజ్ ముదిరాజ్ మాట్లాడుతూ..ఏపీ ప్రభుత్వ పెద్దల ఒత్తిడితోనే ఎడిటర్ పై వరుసగా కేసులు పెట్టి,నోటీసులు జారీ చేస్తున్నారని ఆరోపించారు. ఎడిటర్ పై కక్ష పూరిత చర్యలను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు.రాజ్యాంగం కల్పించిన మీడియా స్వేచ్ఛను హరించడంపై కుట్ర కోణం ఉందన్నారు.కలానికి సంకెళ్లు వేయాలనే ప్రభుత్వ కుట్రల పై శేఖర్ ముదిరాజు ఖండించారు.

## మాస్ జాతరతో రవితేజ మిషన్ స్టార్ట్

### వరుగా నాలుగు డిఫరెంట్ జానర్లతో అలరించే ప్రయత్నం



మాస్ మహారాజా రవితేజ మళ్లీ మాస్ ట్రాక్‌లోకి రావడానికి సిద్ధమయ్యాడు. ఈ నెల అక్టోబర్ 31న విడుదల కానున్న ఆయన 75వ చిత్రం 'మాస్ జాతర' తర్వాత వరుసగా మూడు కొత్త సినిమాలు లైన్‌లో ఉన్నాయి. ఒక్కో సినిమా వేర్వేరు జానర్‌లో ఉండటంతో, ఈసారి రవితేజ కెరీర్‌ను రీబూట్ చేసే సిరీస్ ఇదే అవుతుందని అభిమానులు నమ్ముతున్నారు. 'ధమాకా' తర్వాత మరోసారి శ్రీలీలతో జోడీ కట్టిన రవితేజ, ఈసారి కూడా ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేయడానికి రెడీ అవుతున్నారు. భాను భోగవరపు దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాను నాగవంశీ మరియు సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన పాటలు, టీజర్లు మంచి రెస్పాన్స్ అందుకుంటున్నాయి. రవితేజ మార్క్ మాస్ యాక్షన్, ఎనర్జీతో కూడిన ఎంటర్‌టైనర్‌గా ఇది నిలిచే అవకాశం ఉంది. 'నేను శైలజ', 'రెడ్' వంటి సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న కిశోర్ తిరుమల దర్శకత్వంలో రవితేజ నటిస్తున్న 76వ సినిమా 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. ఇందులో ఆషికా రంగనాథ్, కేతిక శర్మ హీరోయిన్లుగా నటిస్తున్నారు. స్పెయిన్‌లో షూటింగ్ జరుగుతున్న ఈ చిత్రానికి మొదట 'అనార్కలి' అనే టైటిల్ పరిశీలించగా, చివరికి ఈ పేరునే ఫైనల్ చేసినట్లు సమాచారం. సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ సినిమా సంక్రాంతి 2026లో విడుదల కానుంది. 77వ ప్రాజెక్ట్ కోసం రవితేజ 'నిన్ను కోరి', 'మజిలీ', 'ఖుషీ' దర్శకుడు శివ నిర్వాణతో జట్టుకట్టనున్నారు. ఇది ఓ థ్రిల్లర్ డ్రామా జానర్‌లో తెరకెక్కనుంది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ సినిమాలో రవితేజ తన వయసుకు తగ్గ సీరియస్, ఇంటెన్స్ పాత్రలో కనిపించబోతున్నాడని సమాచారం.



## జటాధర ట్రైలర్.. భయపెడుతోన్న ధన పిశాచి!

టాలీవుడ్ యంగ్ హీరో సుధీర్ బాబు లేటెస్ట్ మూవీ 'జటాధర'. డివోషనల్ బ్యాక్ డ్రాప్ స్టోరీతో తీస్తున్న ఈ సినిమాలో బాలీవుడ్ బ్యూటీ సోనాక్షి సిన్హా కూడా నటిస్తోంది. ఇప్పటికే టీజర్ రిలీజ్ చేసిన మేకర్స్.. తాజాగా ట్రైలర్ విడుదల చేశారు. ప్రిన్స్ మహేశ్ బాబు చేతుల మీదుగా ట్రైలర్ రిలీజైంది. కాగా.. ఈ సినిమాకు వెంకటేశ్ కల్యాణ్- అభిషేక్ జైస్వాల్ దర్శకత్వం వహిస్తుండగా.. జీ స్టూడియోస్-ప్రేరణ అరోరా సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని తెలుగు, హిందీ భాషల్లో నవంబర్ 7న రిలీజ్ చేయనున్నారు. 'పూర్వం ధనాన్ని దాచిపెట్టి... మంత్రాలతో బంధనాలు వేసేవాడు' అనే డైలాగ్‌తో ట్రైలర్ ప్రారంభమైంది. ఇవాళ విడుదలైన ట్రైలర్ చూస్తే.. ఈ కథను ధనపిశాచి అనే కాన్సెప్ట్‌తో తెరకెక్కించినట్లు తెలుస్తోంది. ట్రైలర్‌లో సోనాక్షి సిన్హా ధనపిశాచి పాత్రలో విశ్వరూపం చూపించింది. నమ్రతా సిస్టర్ శిల్పా శిరోద్కర్ సీన్స్ ఈ సినిమాపై అంచనాలు పెంచేస్తున్నాయి. ఈ సినిమా కథేంటో ట్రైలర్ చూస్తేనే ప్రేక్షకులను తెలిసిపోతోంది.

## కొత్త దర్శకుడితో విక్రమ్ సినిమా ప్లాన్



పాత్రల్లో పరకాయ ప్రవేశం చేసే అతికొద్ది మంది కథానాయకులలో నటుడు విక్రమ్ ఒకరు. ఈయన జయాపజయాలకు అతీతుడనే చెప్పాలి. విక్రమ్ చిత్రం వస్తుందంటేనే అభిమానుల్లో అంచనాలు వేరే లెవెల్‌లో ఉంటాయి. ఈయన ఇటీవల హీరోగా నటించిన వీర ధీర సూరన్ చిత్రం కమర్షియల్‌గా మంచి విజయాన్ని సాధించింది. ముఖ్యంగా విక్రమ్ నటన, శారీరక భాషకు ప్రశంసలు లభించాయి. తదుపరి రెండు మూడు చిత్రాల్లో విక్రమ్ నటించబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. అవన్నీ చర్చల దశలో ఉన్నాయి. కాగా ప్రస్తుతం శాంతి టాకీస్ సంస్థ నిర్మిస్తున్న చిత్రంలో నటించడానికి సిద్ధం అవుతున్నారని సమాచారం. కాగా తాజాగా విక్రమ్ మరో చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. యువ దర్శకుడు విష్ణు ఎడవన్ దర్శకత్వంలో విక్రమ్ హీరోగా నటించనున్నారు. ప్రస్తుతం నయనతార, కెవిన్ కలిసి నటిస్తున్న హాయ్ చిత్రం ద్వారా విష్ణు ఎడవన్ దర్శకుడిగా పరిచయం అయ్యారు. దీన్ని జి.స్టూడియోస్, లలిత్ కుమార్, దర్శకుడు విఘ్నేష్ శివన్ కలిసి నిర్మిస్తున్నారు. కాగా ఈ చిత్రం నిర్మాణ కార్యక్రమాలు తుది దశకు చేరుకున్నాయి. తదుపరి విక్రమ్ హీరోగా చిత్రం చేయడానికి సిద్ధం అవుతున్నట్లు తాజా సమాచారం. ఈ చిత్రానికి అనిరుధ్ సంగీతాన్ని అందించనున్నట్లు తెలిసింది. ఈ చిత్రాన్ని వేల్స్ ఫిలిం ఇంటర్నేషనల్ పతాకంపై ఐసరి కె.గణేశ్ నిర్మించనున్నట్లు సమాచారం. హాయ్ చిత్రాన్ని పూర్తి చేసిన తరువాత విక్రమ్ హీరోగా నటించే చిత్రానికి విష్ణు ఎడవన్ దర్శకత్వం వహించనున్నట్లు తెలిసింది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో వెలువడే అవకాశం ఉంది.



## తెలుగు రాష్ట్రాల్లో సెంచరీ దాటేసిన కాంతార

మూడేళ్ల క్రితం ఎటువంటి అంచనాలు లేకుండా వచ్చిన కాంతార సినిమా బాక్సాఫీస్‌ను షేక్ చేసింది. కేవలం రూ.15- 20 కోట్లతో నిర్మిస్తే ఏకంగా రూ.450 కోట్ల వరకు వసూళ్లు రాబట్టింది. ఈ సినిమా ప్రీక్వెల్‌గా కాంతార: చాప్టర్ 1 తెరకెక్కించారు. కాంతార లాగే.. కాంతార 1 బాక్సాఫీస్ వద్ద మ్యాజిక్ చేస్తుందా? ప్రేక్షకుల్ని మెప్పిస్తుందా? లేదా? అన్న అనుమానాలు ఉండేవి. ఆ అనుమానాలన్నింటినీ పటాపంచలు చేసింది కాంతార 1. రిషబ్ శెట్టి స్వీయదర్శకత్వం వహించి హీరోగా నటించిన ఈ చిత్రం అక్టోబర్ 2న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. బాక్సాఫీస్ రికార్డులు తిరగరాస్తూ వసూళ్ల ఊచకోత కొనసాగిస్తూనే ఉంది. ఈ రెండు వారాల్లో తెలుగు రాష్ట్రాల్లో రూ.105 కోట్లు రాబట్టింది. ప్రపంచవ్యాప్తంగా ఏకంగా రూ.717.50 కోట్లు కలెక్ట్ చేసి వెయ్యి కోట్ల దిశగా పరుగులు తీస్తోంది. అలాగే హిందీలో అత్యధిక వసూళ్లు సాధించిన సౌత్ సినిమాల లిస్టులోనూ చేరిపోయింది. కాంతార విషయానికి వస్తే రిషబ్ శెట్టి (%=ఙంప్తుఎ ాష్త్వ్ఎ%) హీరోగా నటించిన ఈ మూవీలో రుక్మిణి వసంత్, గుల్షన్ దేవయ్య కీలక పాత్రలు పోషించారు. హొంబలే ఫిలింస్ బ్యానర్‌పై విజయ్ కిరగందూర్ నిర్మించిన ఈసినిమాకు అజనీష్ లోకనాథ్ సంగీతం అందించారు.

## ముస్లిం కుటుంబంలో పుట్టి క్రైస్తవ మతాన్ని స్వీకరించిన రెజీనా కసాండ్రా.. కారణాలు వెల్లడించిన నటి!



సౌత్ ఇండస్ట్రీలో తన అందం, అభినయంతో ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న నటి రెజీనా కసాండ్రా మరోసారి వార్తల్లో నిలిచింది. ఇటీవల ఆమె తన వ్యక్తిగత జీవితం, ముఖ్యంగా మత మార్పిడి గురించి ఓ ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. 1990 డిసెంబర్ 13న చెన్నైలో జన్మించిన రెజీనా, కేవలం 9 ఏళ్ల వయసులోనే పిల్లల టీవీ ఛానల్‌లో యాంకర్‌గా తన కెరీర్ ప్రారంభించింది. తన ముద్దుముద్దు మాటలతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఆమె, చిన్నతనంలోనే కళారంగంపై ఆసక్తి చూపింది. 14 ఏళ్ల వయసులో నటుడు ప్రసన్న, లైలా జంటగా నటించిన తమిళ చిత్రం 'కంద నాన్ మూ' లో లైలా చెల్లెలుగా నటించింది. ఆ తర్వాత 2012లో తెలుగు సినిమా 'శివ మనసులో శ్రుతి' తో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చి, తొలి సినిమాతోనే సైమా ఉత్తమ తొలి నటి అవార్డు అందుకుంది. తమిళం, తెలుగు, హిందీ భాషల్లో పలు సినిమాలు చేసిన రెజీనా, తెలుగులో ప్రత్యేకమైన ఫ్యాన్‌బేస్ సంపాదించింది. 'సుబ్రహ్మణ్యం ఫర్ సేల్', 'ఈనాడు', 'అవును 2', 'ఏక్ లడ్కీ కో దేఖా తో ఐసా లగా' వంటి సినిమాల ద్వారా తన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో రెజీనా మాట్లాడుతూ తన మత మార్పు గురించి ఓపెన్‌గా చెప్పింది. "నా నాన్న ముస్లిం, అమ్మ క్రిస్టియన్. ఇద్దరూ ప్రేమ వివాహం చేసుకున్నారు. చిన్నతనంలో నేను ముస్లింగా పెరిగాను. ఆ తర్వాత, ఆరు సంవత్సరాల వయసులో క్రిస్టియన్‌గా మారిపోయాను." అని ఆమె వెల్లడించింది. ఈ వ్యాఖ్యలు బయటకు రావడంతో సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. కొందరు ఆమె ఓపెన్‌నెస్‌ను ప్రశంసిస్తుండగా, మరికొందరు ఆమె జీవిత ప్రయాణంపై ఆసక్తిగా స్పందిస్తున్నారు. వివిధ మతాలు, సంస్కృతుల మధ్య పెరిగిన రెజీనా, తన ప్రతిభతో సినీ పరిశ్రమలో ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకుంది. ఇప్పుడు ఆమె తన నమ్మకాలు, వ్యక్తిగత అనుభవాలను ధైర్యంగా పంచుకోవడం ఆమె వ్యక్తిత్వానికి సంబంధించిన మరో కొత్త కోణాన్ని చూపిస్తోంది.

## రూ.150 కోట్ల యాడ్‌లో శ్రీలీల వామ్మో ఇండియాలోనే కాస్ట్లీ గురూ!



అందం, అభినయం, డ్యాన్స్ లో కోస్టార్లకు గట్టిపోటీనిచ్చే అతికొద్ది భామల్లో టాప్‌లో ఉంటుంది శ్రీలీల. గ్లామరస్ పాత్రలతోపాటు నటనకు ఆస్కామున్న రోల్స్ చేస్తూ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలుస్తుంది. ఈ భామకు సంబంధించి క్రేజీ అప్‌డేట్ ఒకటి ఇప్పుడు నెట్టింట రౌండప్ చేస్తోంది. శ్రీలీల ఓ క్రేజీ కమర్షియల్‌లో ఛాన్స్ కొట్టేసిందన్న వార్త అభిమానులు, ఫాలోవర్లలో జోష్ నింపుతోంది. తమిళ స్టార్ డైరెక్టర్ అట్లీ ఏం ప్లాన్ చేసినా గ్రాండ్‌గా ఉంటుందని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు.. మెర్సల్, బిగిల్, జవాన్ చిత్రాలే దీనికి ఉదాహరణ. ఈ స్టార్ డైరెక్టర్ ఈ సారి మాత్రం ఎవరూ ఊహించన విధంగా అందరినీ ఆశ్చర్యపరిచేలా ఓ యాడ్ ఫిల్మ్ చేస్తున్నాడన్న వార్త ఇప్పుడు ఇండస్ట్రీ సర్కిల్‌లో హాట్ టాపిక్‌గా మారింది. అట్లీ ఇండియాలోనే ఇదివరకెన్నడూ చేయడని అత్యంత ఖరీదైన యాడ్ ఫిల్మ్ ను డైరెక్ట్ చేశాడట. ఇంతకీ ఏంటా యాడ్ అనుకుంటున్నారా..? చింగ్స్ దేశీ చైనీస్ బ్రాండ్ టీవీ కమర్షియల్ యాడ్‌ను తీశాడని బీటౌన్ సర్కిల్‌లో ఓ వార్త హల్ చల్ చేస్తోంది. బాలీవుడ్ స్టార్లు రన్‌వీర్ సింగ్, బాబీ డియోల్‌తోపాటు సౌతిండియా సెన్సేషన్ శ్రీలీల కూడా ఈ భారీ యాడ్‌లో నటించడం విశేషం. త్వరలో ప్రసారం కానున్న ఈ యాడ్ కోసం అట్లీ టీం ఏకంగా రూ.150 కోట్లు ఖర్చు పెట్టిందని సమాచారం. ఇదివరకెన్నడూ లేని విధంగా స్టన్నింగ్ సెట్స్, ప్రపంచ స్థాయి వీఎఫ్ఎక్స్, మల్టీపుల్ లొకేషన్లలో చింగ్స్ దేశీ చైనీస్ యాడ్ క్యాంపెయిన్ సినిమాటిక్ స్టైల్‌లో చేసేందుకు రెడీ అవుతున్నాడని బీటౌన్ సర్కిల్‌లో ఓ వార్త వైరల్ అవుతోంది. షారుక్‌ఖాన్‌తో తెరకెక్కించిన జవాన్ తర్వాత అట్లీ చేస్తున్న తొలి కమర్షియల్ ప్రాజెక్ట్ ఇదే కావడంతో అంచనాలు పెరిగిపోతున్నాయి.

Ediited Printed & Published Mekkonda Premraj on behalf MPR publications and Printed RNI NO:TELTEL/ 2023/89546 Cell No.9397303326,